www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 18-11-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 213 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా. 6.56 తదుపరి చవితి; నక్షత్రం: మృగశిర మ. 3.49 తదుపరి ఆరుద్ర; వర్జ్యం: రా. 11.54-1.26; దుర్ముహూర్తం: మ. 12.22-1.07, మ. 2.36-3.21; అమృతఘడియలు: ఉ. 7.35-9.04, తె. 5.18 మొదలు; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.25; సూర్యాస్తమయం: 5.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విశ్వ సుందరి..
విక్టోరియా కెజార్

డెన్మార్క్ భామ హెల్విగ్‌ను వరించిన కిరీటం

ఆ దేశానికి 'మిస్ యూనివర్స్' ఇదే తొలిసారి

రన్నరప్‌లుగా నైజీరియా, మెక్సికో యువతులు

టాప్ 5లోనూ లేని భారత్‌కు చెందిన రియా

2



చంద్రబాబు అరెస్టు వెనుక
సీఐడీ మహాకుట్ర!

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

తాడేపల్లి డైరెక్షన్‌లో తప్పుడు 'స్కిల్ స్టోరీ'
నాడు పీవీ రమేశ్ వాంగ్మూలం తారుమారు

2023 సెప్టెంబరు 9వ తేదీ రాత్రి నంద్యాల పర్యటనలో బస్సులో బస చేసిన నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబును హైడ్రామా మధ్య సీఐడీ అరెస్ట్ చేసిన తీరు నేటికీ ప్రజలకు గుర్తుంటుంది. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని, నిధులు దారి మళ్లించారని నాడు సీఐడీ ప్రకటించింది. నాటి ముఖ్యమంత్రి జగన్, ఆయన రోత మీడియా కూడా ఇదే పాట పాడారు. తాజాగా బయటపడిన విషయం ఏంటంటే.. అసలు ఈ కేసే ఓ కుట్ర! తాడేపల్లి డైరెక్షన్‌లో సీఐడీ ఉన్నతాధికారులు చేసిన మహాకుట్ర!

చంద్రబాబును అరెస్ట్ చేయడం కోసం... ఏకంగా నాటి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పీవీ రమేశ్ ఇచ్చిన 161 స్టేట్‌మెంట్‌ను సీఐడీ అధికారులు మార్చేశారు. ఆయన చెప్పని విషయాలను సొంతంగా స్టేట్‌మెంట్‌లో చేర్చారు. చేయని తప్పునకు చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి 53 రోజులు జైలులో ఉంచారు.

161 స్టేట్‌మెంట్ మార్చేసిన సీఐడీ అధికారులు

చెప్పని విషయాలతో సొంతంగా వాంగ్మూలం

అర్ధరాత్రి దాటాక అక్రమంగా చంద్రబాబు అరెస్ట్

53 రోజులపాటు రాజమండ్రి జైలులోనే

సీఐడీ, వైసీపీ నేతల అడ్డగోలు ఆరోపణలు

తాజాగా వెలుగులోకి వచ్చిన జగన్ లీలలు

ఇదీ వాస్తవం

ఒక పథకానికి లేదా ప్రాజెక్టుకు శాసనసభలో బడ్జెట్ ఆమోదం ఉన్నప్పుడు నిధుల విడుదలలో ఎలాంటి అభ్యంతరాలూ ఉండబోవు. ఏదైనా పని సత్వరం కావాలనుకున్నప్పుడు ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు చెప్పడం రివాజు. -పీవీ రమేశ్ స్టేట్‌మెంట్

ఇదీ సీఐడీ 'కథ'

స్కిల్ ప్రాజెక్టులో చెల్లింపులు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయి. నేను కుదరదని అభ్యంతరం చెబితే నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అనేకసార్లు ఫోన్ చేసి, ఒత్తిడి చేసి డబ్బులు విడుదల చేయించారు.


-రమేశ్ చెప్పినట్లు కోర్టుకు సీఐడీ సమర్పించిన నివేదిక

స్కిల్ ప్రాజెక్టులో నాడు ఏం జరిగింది? సీఐడీ మోపిన అభియోగాలు ఏవిటి? పీవీ రమేశ్ ఏం చెప్పారు? సీఐడీ అధికారులు దానిని ఎలా మార్చారు? ఈ మొత్తం వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అక్రమ కేసుల గురించి చాలాసార్లు వినుంటారు! ఏ తప్పూ చేయని వ్యక్తిని రాజకీయ కక్షసాధింపుతో అరెస్ట్ చేయడానికి ఏకంగా వాంగ్మూలాన్ని తారుమారు చేయడం గురించి విన్నారా? అది కూడా ఓ సీనియర్ ఐఏఎస్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను! జగన్ ఈ 'ఘన కార్యం' కూడా చేశారు. నాటి

మిగతా 11వ పేజీలో...



బాబు అరెస్టుకు.. నా స్టేట్‌మెంట్లతో లింకా?

పోలీసుల ప్రకటన దిగ్భ్రాంతికరం

ఆయన అరెస్టుకు దారితీసే అంశాలేవీ వాటిలో లేవు

కేబినెట్ ఆమోదంతోనే స్కిల్ కార్పొరేషన్ ఏర్పాటు

నిబంధనలకు అనుగుణంగానే డిజైన్‌టెక్‌కు నిధులు

నాటి ఇంటర్వ్యూలో రిటైర్డ్ ఐఏఎస్ పీవీ రమేశ్ స్పష్టీకరణ

గుట్టు చప్పుడు కాకుండా
గనుల ఘనుడు వెంకటరెడ్డి విడుదల



తీవ్ర అభియోగాలున్న కేసులో చడీచప్పుడు లేకుండా బెయిల్

సమర్థ వాదనలు వినిపించడంలో ఏసీబీ విఫలం

బెయిల్ పిటిషన్‌పై అభ్యంతరం చెప్పని వైనం

దేశం విడిచి వెళ్లరాదని అధికారికి కోర్టు షరతు

ప్రతి శనివారం ఏసీబీ సీఐయూ అధికారుల ముందు హాజరు కావాలని ఆదేశం

విజయవాడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మైనింగ్ శాఖను మడత పెట్టేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న గనుల శాఖ మాజీ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డికి బెయిల్ లభించింది. శనివారం రాత్రి బాగా పొద్దుపోయాక ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. గత ప్రభుత్వంలో ఇసుక, మైనింగ్ వ్యవహారాల్లో ఆయనపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన వెంకటరెడ్డి వ్యవహారంలో బెయిల్, జైలు నుంచి విడుదల చడీచప్పుడు లేకుండా జరిగిపోయాయి. జగన్ పాలనలో వెంకటరెడ్డి ప్రభుత్వ ఖజానాకు గండికొట్టి సహజ వనరులను వైసీపీ నేతలకు దోచి పెట్టారన్న అభియోగాలు ఉన్నాయి. సెప్టెంబరు 11న ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) ఆయనపై కేసు నమోదు చేసింది. అదే నెల 26వ తేదీ రాత్రి హైదరాబాద్‌లో అధికారులు ఆయన్ను అరెస్టు చేశారు. విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించింది. 50 రోజులపాటు ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వెంకటరెడ్డి అరెస్టయిన తర్వాత రిమాండ్‌కు వెళ్లగానే ఆరోగ్యపరమైన కారణాలను చూపించి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. గనుల శాఖకు చెందిన రూ.160 కోట్లను ఆయన ఎవరి ప్రమేయమూ లేకుండా దారి మళ్లించారని సీఐయూ అధికారులు నిర్ధారించారు. వెంకటరెడ్డిపై నమోదు చేసిన అభియోగాలకు సంబంధించి కొన్ని ఆధారాలను కూడా సంపాదించారు. వాటిని కోర్టు ముందు పెట్టి వెంకటరెడ్డి తరఫున న్యాయవాదులు చేసిన బెయిల్ పిటిషన్‌పై వాదనలను తిప్పికొట్టడంలో మాత్రం విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. జగన్ సీఎంగా ఉన్నప్పుడు గనుల శాఖలో వెంకటరెడ్డి చేసిన అక్రమాలను కూటమి ప్రభుత్వం

మిగతా 11వ పేజీలో...

'లాభదాయక' అనర్హతపై
కొత్త చట్టం

ఫ్లాగ్‌షిప్ పథకాల్లో సభ్యులుగా ఉన్నవారిపై వేటు పడదు

బిల్లుపై ప్రజాభిప్రాయం కోరిన కేంద్ర న్యాయశాఖ

1959 నాటి చట్టం రద్దుకు యోచన

వర్తమాన కాల పరిస్థితులకు అనుగుణంగా నిర్వచనం

న్యూఢిల్లీ, నవంబరు 17: ఎంపీలపై అనర్హత వేటుకు సంబంధించి కొత్త చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. సర్కారులో లాభదాయక పదవులు నిర్వహిస్తూ ఎంపీగా గెలిచినవారిపై అనర్హతకు అవకాశం కల్పిస్తున్న 1959నాటి చట్టాన్ని రద్దుచేయాలని భావిస్తోంది. వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా 'లాభదాయక పదవి'కి నిర్వచనం ఇవ్వాలని నిశ్చయించింది. 16వ లోక్‌సభ (2014-19) కాలంలో బీజేపీ సీనియర్ నేత కల్‌రాజ్ మిశ్రా సారథ్యంలోని పార్లమెంటరీ కమిటీ (జాయింట్ కమిటీ ఆన్ ఆఫీసెస్ ఆఫ్ ప్రాఫిట్-జేసీవోపీ) సిఫారసులకు అనుగుణంగా కొత్త బిల్లు ముసాయిదాకు రూపకల్పన చేసింది. దీనిపై కేంద్ర న్యాయ శాఖ తాజాగా ప్రజాభిప్రాయం కోరింది. నూతన 'పార్లమెంటు (అనర్హత నిరోధక) బిల్లు-2024'లో అనర్హత పరిధిలోకి వచ్చే పదవులు, అనర్హతకు వీల్లేని పోస్టుల జాబితాను ప్రతిపాదించింది. కొన్ని నిర్దిష్ట కేసుల్లో అనర్హత వేటును తాత్కాలికంగా సస్పెండ్ చేయడానికి ప్రస్తుత చట్టంలోని సెక్షన్ 4 అవకాశం కల్పిస్తోంది. దీన్ని తొలగించాలని తాజా బిల్లులో ప్రతిపాదించారు. కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలు, కార్యక్రమాలైన స్వచ్ఛభారత్, స్మార్ట్ సిటీ విజన్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్-గ్రామీణ కౌశల్య యోజన మొదలైనవాటిలో సభ్యులుగా ఉండేవారిని లాభదాయక పదవులు నిర్వహించేవారి జాబితాలోకి తేకూడదని జేసీవోపీ న్యాయ శాఖకు సూచించింది. అలాగే 'లాభదాయక పదవి'కి సమగ్ర నిర్వచనం రూపొందించాలని.. చట్టంలోని భాష, ఫార్మాట్ సరళంగా ఉండాలని ప్రతిపాదించింది. ప్రస్తుత చట్టంలోని కాలం చెల్లిన, నిరర్థక అంశాలను పరిగణనలోకి తీసుకోకూడదని పేర్కొంది.

విశాఖలో ఉద్యోగం.. ముంబైలో లంచం

సీబీఐ ఉచ్చులో విశాఖ రైల్వే ఉన్నతాధికారి

పెనాల్టీ తగ్గించడానికి లంచం డిమాండ్

రూ.25 లక్షలు తీసుకుంటుండగా అరెస్టు 12

నిందితుడు వాల్తేర్ డీఆర్ఎం.. 1991 ఐఆర్ఎస్ అధికారి

లంచం ఇచ్చిన ఇద్దరు కంపెనీ ప్రతినిధులు కూడా అరెస్టు



మహారాష్ట్రలోని బల్లార్పూర్‌లో డిప్యూటీ సీఎం పవన్ ప్రచారం

మోదీ నాయకత్వాన..
ప్రగతి పథంలో భారత్

5 ట్రిలియన్ల ఆర్థిక శక్తిగా ఎదగాలంటే ఎన్డీయే ప్రభుత్వమే ఉండాలి: పవన్

నా పిల్లలతో మరాఠీలోనే మాట్లాడతా.. ఆ భాషపై గౌరవంతోనే నేర్చుకున్నా

హైదరాబాద్ నుంచి వచ్చినవారు మన సంస్కృతిని అగౌరవపరుస్తున్నారు

సనాతన ధర్మంపై దాడిచేస్తే ఊరుకోను.. కచ్చితంగా పోరాడతా: డిప్యూటీ సీఎం పవన్

మహాయుతి అభ్యర్థుల తరఫున రెండో రోజూ ప్రచారం 11



తమ్ముడు రామ్మూర్తి పాడె మోస్తున్న సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే పులివర్తి నాని

అధికార లాంఛనాలతో
నారా రామ్మూర్తి అంత్యక్రియలు

తమ్ముడి పాడె మోసిన చంద్రబాబు

కన్నీటి పర్యంతమైన ముఖ్యమంత్రి

నారావారిపల్లిలో తల్లిదండ్రుల సమాధుల పక్కనే చితి ఏర్పాటు 12

నిప్పంటించిన రోహిత్, గిరీష్

మహారాష్ట్ర గవర్నర్ సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖుల హాజరు

డీఎస్సీ ఆలస్యం!

ఎస్సీ వర్గీకరణ కోసం ఆగిన నోటిఫికేషన్

తాజాగా వర్గీకరణపై ఏకసభ్య కమిషన్.. దాని నివేదిక వచ్చాక నోటిఫికేషన్

ఈలోగా అభ్యర్థుల సన్నద్ధతకు అవకాశం.. నోటిఫికేషన్ ఇచ్చాక ప్రక్రియ వేగవంతం

న్యాయ వివాదాలు రాకుండా ప్రభుత్వం కసరత్తు

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి మరికొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. షెడ్యూలు ప్రకారం ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉండగా అనూహ్యంగా వాయిదా పడింది. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు వెలువరించిన నేపథ్యంలో డీఎస్సీ నుంచే దానిని అమలు చేయాలని వచ్చిన విజ్ఞప్తుల మేరకు నోటిఫికేషన్‌ను వాయిదా వేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ఎలా చేయాలన్న దానిపై ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీంతో నివేదిక వచ్చిన తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడనుంది. రెండు, మూడు నెలల్లో నోటిఫికేషన్ జారీ చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈలోగా డీఎస్సీకి సిద్ధంగా ఉండాలని అభ్యర్థులకు ప్రభుత్వం స్పష్టం చేయనుంది. నోటిఫికేషన్ జారీ అయ్యాక భర్తీ ప్రక్రియ వేగంగా పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే విద్యా సంవత్సరంలో బడులు తెరుచుకునే సమయానికి కొత్త టీచర్లు

మిగతా 12వ పేజీలో...



పాఠశాలల పనివేళలు పెంపు!

నెల్లూరు జిల్లాలో పైలట్‌గా కొత్త టైమ్‌టేబుల్

సాయంత్రం గంట అదనంగా బడి

పైలట్ అనంతరం తుది నిర్ణయం

రారా.. శ్రీమంతుడా!

గ్రామాలు, వార్డుల దత్తత కార్యక్రమాన్ని పునరుద్ధరించే యోచనలో కూటమి ప్రభుత్వం

ప్రముఖులు, ఎన్ఆర్ఐలకు సాదర ఆహ్వానం

చంద్రబాబు, పవన్ పిలుపుతో గ్రామ సీమల అభివృద్ధికి ముందుకొచ్చే అవకాశం

గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో మొహం చాటేసిన దత్తత శ్రీమంతులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'శ్రీమంతుల'ను ఆహ్వానించి మళ్లీ 'గ్రామాలు, వార్డుల దత్తత' కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని కూటమి సర్కార్ యోచిస్తోంది. గత టీడీపీ హయాంలో తెచ్చిన స్మార్ట్ వార్డు-స్మార్ట్ గ్రామాల కాన్సెప్ట్‌ను మరింత మెరుగుపరిచి సొంత గడ్డను దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు వారి భాగస్వామ్యం కోరాలని భావిస్తోంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపుతో దేశ, విదేశాల్లో

మిగతా 3వ పేజీలో...

హైపర్‌సానిక్ క్లబ్‌లో భారత్

ఒడిశాలో విజయవంతంగా దీర్ఘ శ్రేణి క్షిపణి పరీక్ష

ఇదో చరిత్రాత్మక ఘట్టం: రాజ్‌నాథ్ సింగ్

ఇప్పటికే ఈ క్షిపణులను వాడుతున్న రష్యా

గతంలోనే చైనా, అమెరికా పరీక్షలు సక్సెస్

ఈ ప్రయోగంతో ఆ దేశాల సరసన భారత్

అల్వాల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతదేశపు తొలి దీర్ఘ శ్రేణి హైపర్‌సానిక్ (శబ్దం కన్నా ఐదు రెట్లు, అంతకు మించి వేగంతో వెళ్లే) క్షిపణిని రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధి (డీఆర్‌డీవో) సంస్థ ఒడిశాలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ దీవి నుంచి విజయవంతంగా పరీక్షించింది. డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు, త్రివిధ దళాలకు చెందిన ఉన్నతాధికారుల సమక్షంలో ఈ పరీక్షను నిర్వహించారు. ప్రపంచంలో ఇప్పటిదాకా ఒక్క రష్యా వద్ద మాత్రమే ఆపరేషనల్ హైపర్‌సానిక్ క్షిపణులున్నాయి. ఉక్రెయిన్‌తో యుద్ధంలో వాటిని

మిగతా 2వ పేజీలో...



మణిపూర్‌లో ఊరేగుతున్న ఉన్మాదం

- రెండేళ్ల బాలుడి తల, చేతులు నరికి దారుణహత్య
- చిన్నారితో పాటు కుటుంబంలోని ఆరుగురినీ చంపేశారు
- నదిలో మృతదేహాలు.. వెలుగులోకి కుకీ మిలిటెంట్ల దుశ్చర్య
- రాష్ట్రంలో తీవ్ర నిరసనలు, ఉద్రిక్తత.. కేంద్ర హోంశాఖ సమీక్ష
- విద్వేషపూరిత రాజకీయం కోసమే బీజేపీ చోద్యం: ఖర్గే
- బీరేన్ సర్కారుకు ఎన్‌పీపీ మద్దతు ఉపసంహరణ 2



జాబిలిపై ఆక్సిజన్ పైప్‌లైన్!

దక్షిణ ధ్రువం వద్ద ఏర్పాటు చేసేందుకు నాసా కసరత్తు

న్యూయార్క్: చందమామపై మానవ శాశ్వత ఆవాసాలే లక్ష్యంగా 'ఆర్టెమిస్' ప్రాజెక్టును చేపట్టిన అమెరికా అంతరిక్ష పరిశోధనల సంస్థ నాసా.. చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద ఓ భారీ ఆక్సిజన్ పైప్‌లైన్ ఏర్పాటుకు సిద్ధమవుతోంది! ఎందుకంటే.. భవిష్యత్తులో చేపట్టబోయే ఇతర అంతరిక్ష యాత్రలకు చందమామను ఒక బేస్‌గా వాడుకోవాలంటే అక్కడ ఉన్న వనరులతోనే వ్యోమగాములు మనుగడ సాగించగలగాలి. అలా సాగించడానికి వారికి అన్నింటికన్నా అత్యంత అవసరమైనది, కీలకమైనది ప్రాణవాయువే. కానీ, అది చంద్రుడి మీద అస్సలు ఉండదు. కాబట్టి.. జాబిలి దక్షిణ ధ్రువం వద్ద ఉన్న మంచు పొరల నుంచి వ్యోమగాములకు అవసరమైన ఆక్సిజన్‌ను సంగ్రహించి, దాన్ని వ్యోమగాములు ఉండే బేస్‌లకు తరలించేలా రోబోల సాయంతో దాదాపు 5 కిలోమీటర్ల నిడివిగల పైప్‌లైన్ వ్యవస్థను నిర్మించేందుకు నాసా కసరత్తు చేస్తోంది. ఈ వినూత్న



ప్రాజెక్టుకు నాసా.. 'లూనార్ సౌత్‌పోల్ ఆక్సిజన్ పైప్‌లైన్ (ఎల్-ఎస్‌పాప్)' అని పేరు పెట్టింది. అన్నట్టు.. 'ఆర్టెమిస్' అంటే.. గ్రీకు, రోమన్ పురాణాల్లో 'చంద్ర దేవత' పేరు. గతంలో నాసా చేపట్టిన చంద్రయాత్రలన్నింటికీ 'అపోలో' పేరు పెట్టిన సంగతి తెలిసిందే. అపోలో అంటే.. గ్రీకు దేవుడి పేరు. ఆయన సోదరి 'ఆర్టెమిస్'. 1972లో చేపట్టిన 'అపోలో 17'.. అప్పట్లో నాసా ఆఖరి మూన్ మిషన్. మళ్లీ ఇప్పుడు 'ఆర్టెమిస్' పేరుతో తన సత్తా చాటేందుకు సిద్ధమైంది.

ఆవు పేడలో భారీగా నోట్ల కట్టలు

- ఒడిసాలో స్వాధీనం చేసుకున్న హైదరాబాద్ పోలీసులు

బాలాసోర్ (ఒడిసా), నవంబరు 17: ఆవు పేడలో భారీగా నోట్ల కట్టలు బయటపడిన ఉదంతం ఒడిసా రాష్ట్రంలో వెలుగుచూసింది. శనివారం అక్కడి బాలాసోర్ జిల్లా కమర్దా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బడమండరుని అనే ప్రాంతంలో హైదరాబాద్, ఒడిసాలకు చెందిన పోలీసు బృందాలు వాటిని స్వాధీనం చేసుకున్నాయి. హైదరాబాద్‌లోని ఓ ఆగ్రో కంపెనీలో పనిచేస్తున్న గోపాల్ బెహ్రా అనే వ్యక్తి.. కంపెనీ లాకర్ నుంచి దాదాపు రూ.20 లక్షలు దొంగిలించి పారిపోయాడు. పరారీలో ఉన్న నిందితుడు ఆ డబ్బును తన బావమరిది అయిన రవీంద్ర బెహ్రాతో సొంతూరు పంపించాడు. ఆగ్రో కంపెనీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ పోలీసులు రంగంలోకి దిగారు. కమర్దా పోలీసులతో కలిసి రవీంద్ర ఇంట్లో సోదాలు చేయగా.. అక్కడ పేడకుప్పలో ఈ నోట్ల కట్టలు బయటపడ్డాయి.

లోకం తీరు



అమెరికాలో భారీగా ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు

- వృథా ఖర్చుల తగ్గింపే ట్రంప్ సర్కార్ లక్ష్యం
- ఇది అణుబాంబు తయారీలాంటి 'మన్‌హట్టన్ ప్రాజెక్టు' అన్న అభిప్రాయం
- అధికార యంత్రాంగానికి 'షేవింగ్' తప్పదు
- 'కరెంటు రంపాన్ని' ఉపయోగిస్తాం : వివేక్ రామస్వామి

వాషింగ్టన్, నవంబరు 17: అనవసర ఖర్చులు తగ్గించేందుకు బడ్జెట్‌లో కోతలు విధించడమే ప్రథమ లక్ష్యమని ప్రకటించిన అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆలోచనలను కార్యరూపంలోకి తెచ్చేందుకు కసరత్తు మొదలైంది. అధికారం చేపట్టిన వెంటనే అమలు చేసేలా కసరత్తు జరుగుతోంది. ఇందుకోసం ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్; భారత సంతతికి చెందిన బయోటెక్ కంపెనీ సీఈవో, రిపబ్లికన్ పార్టీ నాయకుడు వివేక్ రామస్వామి ఆధ్వర్యంలో ప్రభుత్వ సామర్థ్య విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ-డోగ్) ప్రత్యేకంగా ఏర్పాటైంది. ప్రభుత్వ విభాగాల్లో సామర్థ్యం పెంచడమంటే భారీగా ఉద్యోగాల్లో కోత విధించడమేనని ఈ ఇరువురు సీఈవోలు భావిస్తున్నారు. ఇటీవల ట్రంప్ సొంత ఎస్టేట్ అయిన మార్ ఎ లాగోలో జరిగిన సన్మాన సభలో వివేక్ ప్రసంగిస్తూ "మస్క్, నేను కలిసి వాషింగ్టన్‌లోని అధికార యంత్రాంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది 'ఎన్నిక ద్వారా నియమితులుకాని ఉద్యోగుల'ను బయటకు పంపి వేస్తాం. మేం ఆ పొజిషన్‌లో ఉన్నాం"అని చెప్పారు. "మస్క్ గురించి మీకు పూర్తిగా తెలియదు. ప్రభుత్వ ఉద్యోగులను తగ్గించడానికి ఆయన పెద్ద కరెంటు రంపమే తెస్తున్నారు. చాలా సరదాగా ఉంటుందిలే" అని వ్యాఖ్యానించారు. ఈ 'కరెంటు రంపం' ఆలోచనను అర్జెంటీనా అధ్యక్షుడు జావియర్ మిలేయి నుంచి తీసుకున్నట్టు కనిపిస్తోంది. అధికారం చేపట్టిన వెంటనే సాహసోపేత పొదుపు చర్యలు తీసుకుంటానని మిలేయి ప్రకటించారు. 'ఆర్థిక పోకిరీ', 'అరాచక పెట్టుబడిదారుడు'నని స్వయంగా చెప్పుకొన్నారు. అధికార యంత్రాంగం, ఆర్థిక లోటును తగ్గించేందుకు 'కరెంటు రంపాన్ని' ఉపయోగిస్తానని ప్రకటించారు. ఆ భావననే వివేక్ తీసుకున్నట్టు కనిపిస్తోంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని 'క్షవరం' చేయాల్సి ఉందని ఆయన అన్నారు. "ప్రభుత్వ యంత్రాంగం సైజును "షేవింగ్" చేయడం మా లక్ష్యం. ఇది మాత్రం సాధ్యమైనంత వరకు పారదర్శకంగా జరగాలి"అని పేర్కొన్నారు. ఈ కసరత్తును ఆయన 'ఆధునిక మన్‌హట్టన్ ప్రాజెక్టు' అని అభివర్ణించారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో అణుబాంబులు తయారు చేసేందుకు అమెరికా ప్రభుత్వం 'మన్‌హట్టన్ ప్రాజెక్టు'ను నిర్వహించింది. ప్రస్తుతం భారీగా ప్రభుత్వ ఉద్యోగులను తగ్గించేందుకు చేపట్టే ప్రాజెక్టు కూడా అంత తీవ్రమైనదేనని తెలిపారు. ఇందుకోసం దేశంలోని మేధావులను ఒక్క దగ్గర చేర్చుతున్నామని చెప్పారు. జీతం తీసుకోకుండా వారానికి 80 గంటలపాటు అంకితభావంతో పనిచేసేవారు కావాలంటూ ఉద్యోగ ప్రకటన ఇచ్చారు కూడా. ఉద్యోగుల తొలగింపు కారణంగా కీలకమైన ప్రభుత్వ విధులు కుంటుపడుతాయన్న హెచ్చరికలకు వివేక్ సమాధానమిస్తూ 'నూతన ఆవిష్కరణలు, వ్యయం అదుపునకు కోతలు తప్పనిసరి' అన్నారు. "మనం క్షీణదశలో ఉన్న దేశం అంటూ నిరాశ భావనను ఇంతవరకు మనకు కలిగించారు. అది తప్పని ఎన్నికల్లో రుజువైంది. దేశ నిర్మాతలు గర్వపడేలా తగిన సైజ్, లక్ష్యం ఉండే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే 'డోగ్' పని అని అన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతివారం ఎక్స్‌లో 'డోగ్‌కాస్ట్' ప్రసారం చేసి మస్క్, వివేక్‌లు తమ అభిప్రాయాలను తెలుపుతారు.

ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడి

- ఇంధన మౌలిక వనరులే లక్ష్యంగా 120 క్షిపణులు, 90 డ్రోన్లతో విధ్వంసం
- కీవ్ సహా ప్రధాన నగరాల్లో చీకట్లు
- ఇద్దరి మృతి.. మరో ఇద్దరికి గాయాలు

కీవ్, నవంబరు 17: ఉక్రెయిన్‌పై రష్యా భారీ స్థాయిలో విరుచుకుపడింది. ఆదివారం తెల్లవారుజామున పలు నగరాల్లోని ఇంధన మౌలిక వనరులను లక్ష్యంగా పెద్ద ఎత్తున క్షిపణులు, డ్రోన్లతో దాడికి తెగబడింది. ఫలితంగా ఇంధన వనరులకు తీవ్ర నష్టం సంభవించింది. ఆగస్టు తర్వాత ఉక్రెయిన్‌పై రష్యా భారీ క్షిపణి దాడి ఇదే. ప్రధానంగా ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు నగరాలు పేలుళ్లతో అట్టుడికాయి. ఫలితంగా ఎక్కడికక్కడ చీకట్లు కమ్ముకున్నాయి. రష్యా మొత్తంగా 120 క్షిపణులు, 90 డ్రోన్లతో రష్యా 'తీవ్రమైన దాడికి' పాల్పడటం ద్వారా ఇంధన మౌలిక వనరులను విచ్ఛిన్నం చేసిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. "ఇంధన వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని రష్యా మరోసారి తీవ్ర స్థాయిలో దాడికి పాల్పడింది. ఉక్రెయిన్ వ్యాప్తంగా విద్యుదుత్పాన, సరఫరా వ్యవస్థపై శత్రుదేశం దాడికి తెగబడింది" అని ఫేస్బుక్‌లో ఉక్రెయిన్ విద్యుత్తు శాఖ మంత్రి జర్మన్ గాలుస్కో పేర్కొన్నారు. రష్యా దాడి ఫలితంగా ఉక్రెయిన్‌లో ఏ స్థాయిలో నష్టం జరిగిందనే లెక్కలు ఇంకా తెలియరాలేదు. రష్యా దాడుల కారణంగా కీవ్ సహా పలు నగరాల్లో అధికారులు విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. డ్రోన్ దాడి కారణంగా ఉక్రెయిన్‌లోని వోలిన్ ప్రాంతంలో ఇద్దరు సాధారణ పౌరులు దుర్మరణంపాలయ్యారు. కీవ్‌లో భవనం కూలి శిథిలాలు పడటంతో ఇద్దరు గాయపడ్డారు. జర్మన్ చాన్స్‌లర్ ఒలఫ్ స్కోల్జ్ 2022 తర్వాత రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో శుక్రవారం మాట్లాడారు. దీన్ని ఉక్రెయిన్ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఆండ్రిజ్ సైబిహా పరోక్షంగా ఉటంకిస్తూ రష్యా తెగబడిన దాడికి పుతిన్‌తో చర్చించిన నేతలే "నిజమైన బాధ్యులు" అని వ్యాఖ్యానించారు. రష్యా దాడితో ఉక్రెయిన్‌కు పశ్చిమాన ఉన్న నాటో సభ్యదేశమైన పొరుగుదేశం పోలెండ్ అలర్ట్ అయింది. ముందుజాగ్రత్తగా భద్రతా చర్యల్లో భాగంగా తమ గగనతలంలో ఎయిర్‌ఫోర్స్‌ను అప్రమత్తం చేసింది. రష్యా ఇంతకుముందు చివరిసారిగా గత ఆగస్టు 26న ఉక్రెయిన్‌పై భారీ క్షిపణి దాడికి పాల్పడింది. అప్పట్లో ఆ దేశవ్యాప్తంగా 200పైగా డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించినట్లు ఉక్రెయిన్ అధికారులు చెప్పారు. ఈ దాడుల్లో అప్పట్లో ఏడుగురు సాధారణ పౌరులు మృత్యువాతపడ్డారు.

ముంబై ఓటు ఎటువైపు?

2019 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-శివసేన స్వీప్.. 36 స్థానాలకు గాను 30 చోట్ల ఎన్డీఏ గెలుపు

- లోక్‌సభ ఎన్నికల్లో భిన్నంగా ఫలితాలు
- 6 ఎంపీ సీట్లలో బీజేపీకి రెండే..
- ప్రస్తుతం 2 కూటములుగా ఆరు పార్టీలు
- ఓట్లు చీల్చనున్న ఒవైసీ, రాజ్‌థాకరే పార్టీలు


ముంబై, నవంబరు17: ఈ నెల 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో దేశ వాణిజ్య రాజధాని ముంబై అన్ని పార్టీలకూ కీలకం కానుంది. ముంబైలోని 36 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ, శివసేన, ఎన్సీపీతో కూడిన మహాయుతి కూటమి అభ్యర్థులతో కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే వర్గం శివసేన, శరద్ పవార్ వర్గం ఎన్సీపీతో కూడిన మహావికాస్ అఘాడీ(ఎంవిఏ) కూటమి అభ్యర్థులు తలపడుతున్నారు. వీరికి తోడు రాజ్‌థాకరే నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన(ఎంఎన్ఎస్), ప్రకాశ్ అంబేడ్కర్ సారథ్యంలోని వించిత్ బహుజన్ అఘాడీ, అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని మజ్లిస్ అభ్యర్థులు కూడా ముంబైలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

2019లో బీజేపీ-శివసేన హవా

2019 అసెంబ్లీ ఎన్నికల్లో 36 సీట్లకు గాను బీజేపీ, ఉమ్మడి శివసేన ఎన్డీయే కూటమిగా 30 స్థానాలు కైవసం చేసుకున్నాయి. ఇందులో బీజేపీ 16, శివసేన 14 స్థానాలు గెలుచుకున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో మహాయుతి కూటమిలోని బీజేపీ 18, షిండే శివసేన 16, అజిత్ పవార్ ఎన్సీపీ 2 నియోజకవర్గాల్లో అభ్యర్థులను బరిలోకి దించాయి. ఎంవిఏ కూటమిలోని యూబీటీ 22, కాంగ్రెస్ 11, శరద్ పవార్ వర్గం ఎన్సీపీ 2 చోట్ల అభ్యర్థులను పోటీకి దించాయి. శివసేన రెండు ముక్కలై పరస్పరం పోటీపడుతుండటంతో తాజా ఎన్నికల్లో ముంబై ఓటర్లు ఏ వర్గాన్ని ఆదరిస్తారనేది ఉత్కంఠగా మారింది.

2024 లోక్‌సభ ఎన్నికల్లో మారిన సీన్

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ముంబైలోని ఆరు



ఎంపీ సీట్లకు గాను బీజేపీ రెండింటినే గెలుచుకోగలిగింది. మిగతా నాలుగింటిలో మూడింటిని ఉద్ధవ్ శివసేన గెలుచుకోగా ఎంవిఏ కూటమిలో భాగంగా కాంగ్రెస్ మరో స్థానాన్ని గెలుచుకుంది. మెజార్టీ నియోజకవర్గాలను గెలుచుకున్న ఎంవీఏ అదే ఊపుతో అసెంబ్లీ ఎన్నికల్లోనూ బరిలోకి దిగుతోంది.

రాజ్‌థాకరే పార్టీ ఓట్లను చీలుస్తుందా?

మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన అధ్యక్షుడు రాజ్‌థాకరే ముంబైలో 25 నియోజకవర్గాల నుంచి తన అభ్యర్థులను బరిలోకి దించారు. దీంతో సంప్రదాయ ఓట్లు చీలే అవకాశం ఉంది. ముఖ్యంగా ముంబైలో సంప్రదాయ ఓట్లను నమ్ముకున్న బీజేపీ, శివసేనలకు ఎంఎన్ఎస్ సవాలుగా మారనుంది. వర్లీలో ఉద్ధవ్ ఠాకరే తనయుడు, సిటింగ్ ఎమ్మెల్యే ఆదిత్య ఠాకరే పోటీ చేస్తున్నారు. శివసేన తరఫున మిలింద్ దేవరా బరిలో ఉండగా, ఎంఎన్ఎస్ సందీప్ దేశ్‌పాండేను పోటీకి దించింది. దీంతో ముక్కోణపు పోటీ ఏర్పడింది. 2024 లోక్‌సభ ఎన్నికల నాటి మూడ్‌లోనే ఓటర్లు కొనసాగితే ముంబైలో 4 సీట్లు గెలుచుకున్న ఎంవిఏ కూటమి మరోసారి స్వీప్ చేసే అవకాశం ఉంది. అయితే తాము అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల కారణంగా ముంబై నగర వాసులు అసెంబ్లీ ఎన్నికల్లో తమకు పట్టం కడతారని మహాయుతి కూటమి ఆశాభావంగా ఉంది.

ముస్లిం ఓట్లలో చీలిక తప్పదా?

మజ్లిస్ అభ్యర్థులు బరిలో నిలుస్తోన్న వెర్సోవా, శివాజీనగర్ తదితర నియోజకవర్గాల్లో ఎంవీఏ కూటమికి దక్కే ముస్లిం ఓట్లలో చీలిక తప్పదని విశ్లేషకులు చెబుతున్నారు. ఇది ఎంవీఏ కూటమికి మింగుడు పడని విషయంగా మారనుంది. గత ఎన్నికల్లో 44 చోట్ల పోటీ చేసిన మజ్లిస్ దళానికు పైగా నియోజకవర్గాల్లో కాంగ్రెస్-ఎన్సీపీ కూటమి అభ్యర్థులను ఓడించడంలో కీలకంగా మారింది.

బీజేపీ, ఆర్ఎస్ఎస్ విషనాగులు: ఖర్గే

పుణె/ముంబై, నవంబరు17: దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజకీయంగా ప్రమాదకరమైనవని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను విషనాగులతో పోల్చారు. అందుకే వాటిని చంపేయాలంటూ మహారాష్ట్ర ఓటర్లకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సంగ్లీలో జరిగిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. మహారాష్ట్రలో జరుగుతున్నవి అసెంబ్లీ ఎన్నికలని, ప్రధానమంత్రిని ఎన్నుకునేవి కావని వ్యంగ్యంగా మాట్లాడుతూ ఆయన మోదీ ఎన్నికల ప్రచారాన్ని తప్పుబట్టారు. కాగా, మహారాష్ట్రలో నెలకొల్పాల్సిన పరిశ్రమలు, పెద్ద ప్రాజెక్టులను స్వార్థబుద్ధితో గుజరాత్‌కు తరలిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. ఆదివారం మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె ప్రసంగించారు.

హైపర్‌సానిక్ క్లబ్‌లో భారత్

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోగిస్తోంది కూడా. అలాగే.. అమెరికా, చైనా హైపర్‌సానిక్ క్షిపణి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాయి. తాజా ప్రయోగంతో.. హైపర్‌సానిక్ సత్తా ఉన్న ఆ దేశాల సరసన భారత్ చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. దీన్ని చరిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ క్షిపణి ప్రాంగణం సహా దేశంలోని వివిధ డీఆర్‌డీవో పరిశోధనశాలలు, ఇతర పారిశ్రామిక భాగస్వాములతో కలిసి డీఆర్‌డీవో దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణి.. 1500 కిలోమీటర్లకు మించిన దూరంలోని లక్ష్యాలను హైపర్‌సానిక్ వేగంతో దూసుకెళ్లి ఛేదించగలదు. హైపర్‌సానిక్ క్షిపణులు రెండు రకాలు. ఒకటి.. హైపర్‌సానిక్ గ్లైడ్ వెహికల్స్ (హెచ్‌జీవీ). రెండు.. హైపర్‌సానిక్ క్రూయిజ్ మిసైల్ (హెచ్‌సీఎం). హెచ్‌జీవీలను రాకెట్ బూస్టర్‌తో లాంచ్ చేస్తారు. నిర్దిష్ట ఎత్తుకు చేరిన తర్వాత.. క్షిపణి బూస్టర్ నుంచి విడివడి నిర్దేశిత మార్గంలో లక్ష్యం దిశగా దూసుకుపోతాయవి. హైపర్‌సానిక్ క్రూయిజ్ క్షిపణులు అలా కాదు. స్క్రామ్ జెట్ ఇంజన్ల సాయంతో మొత్తం ప్రయాణంలో హైపర్‌సానిక్ వేగాన్ని అలాగే కొనసాగిస్తాయి(ఈ స్క్రామ్ జెట్ ఇంజన్లలోకి గాలి సూపర్‌సానిక్ వేగంతో లోపలికి వెళ్లి హైపర్‌సానిక్ వేగంతో బయటకు వస్తుంది). బాలిస్టిక్ క్షిపణుల కన్నా తక్కువ ఎత్తులో, ఎగువ వాతావరణంలో ప్రయాణిస్తాయి. ఇంకా.. అమిత వేగం, మెన్యూవరబిలిటీ (ప్రయాణంలో ఉండగానే తన దిశ ను మార్చుకోగలగడం) వంటి లక్షణాలు ఉండడం తో.. సంప్రదాయ క్షిపణి రక్షణ వ్యవస్థలు గుర్తించి, అడ్డుకునేలోపే ఇవి లక్ష్యంపై విరుచుకుపడిపోతాయి. కాగా.. ఫ్రాన్స్, జర్మనీ, ఇరాన్, ఇజ్రాయెల్, ఆస్ట్రేలియా, జపాన్ కూడా హైపర్‌సానిక్ క్షిపణుల అభివృద్ధికి కృషి చేస్తున్నాయి.

విశ్వ సుందరి.. విక్టోరియా కెజార్

డెన్మార్క్ భామ హెల్విగ్‌ను వరించిన కిరీటం

న్యూఢిల్లీ, నవంబరు 17: డెన్మార్క్‌కు చెందిన విక్టోరియా కెజార్ తీల్‌విగ్ 2024 సంవత్సరానికి మిస్ యూనివర్స్‌గా ఎంపికయ్యారు. మెక్సికోలోని ఎరెనా నగరంలో శనివారం జరిగిన ఈ పోటీలకు 120 మంది యువతులు హాజరయ్యారు. నైజీరియాకు చెందిన చిడిమా ఎడెషినా ద్వితీయ స్థానంలో, మెక్సికోకు చెందిన మరియా ఫెర్నాండ బెల్ట్రాన్ తృతీయ స్థానంలో నిలిచారు. భారత్‌కు చెందిన రియా సింఘా తుది 30 మందిలో చోటు దక్కించుకున్నారు.

ఆప్‌ను వీడిన రవాణా మంత్రి కైలాష్ గెహ్లోత్

- ఎన్నికల వేళ ఆప్‌కు గట్టి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ, నవంబరు17: ఆమ్ ఆద్మీ పార్టీకి ఢిల్లీలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రవాణా శాఖ మంత్రి కైలాష్ గెహ్లోత్ తన మంత్రి పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అతి త్వరలో ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో గెహ్లోత్ రాజీనామా చేయడం సంచలనంగా మారింది. రాజీనామాకు ఆయన చెప్పిన కారణాలు కలకలం రేపాయి. ఓ పక్క ఆమ్ ఆద్మీ(సామాన్యుడు) సంక్షేమమే లక్ష్యమంటూ మరోపక్క 45 కోట్ల రూపాయల ఖర్చుతో సీఎం అధికారిక నివాసాన్ని శీశ్‌మహల్ తరహాలో పునర్నిర్మించారని ఆయన విమర్శించారు. యమునా నది శుద్ధిని గాలికి వదిలేశారని గెహ్లోత్ ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులకు సేవ చేసేందుకు ఏర్పాటు చేసిన ఆప్ తన లక్ష్యానికి దూరంగా జరిగిపోయిందని, తానిక పార్టీతో కొనసాగలేక రాజీనామా చేస్తున్నట్లు లేఖలో రాశారు. కైలాష్ గెహ్లోత్ రాజీనామా బీజేపీ కుట్ర ఫలితమేనని ఆప్ ఆరోపించింది. గెహ్లోత్‌పై ఐటీ, ఈడీ వంటి సంస్థలను ఉసిగొల్పి దాడులు చేయించిందని, మరో మార్గంలేక ఆయన బీజేపీలో చేరబోతున్నారని ఆరోపణలు చేసింది. కైలాష్ గెహ్లోత్ బీజేపీలో చేరతారని జోరుగా ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఢిల్లీ బీజేపీ మాజీ ఎమ్మెల్యే అనిల్ ఝా ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. కేజ్రీవాల్ విధానాలు నచ్చి ఆప్‌లో చేరుతున్నట్లు ఝా చెప్పారు.

మణిపూర్‌లో ఉన్మాదం

రెండేళ్ల పసి బాలుడి తల, చేతులు నరికి హత్య

- వెలుగులోకి కుకీ మిలిటెంట్ల దుశ్చర్య
- చిన్నారితోపాటు మొత్తం ఆరుగురి హత్య



కుకీ మిలిటెంట్ల హింసాకాండను నిరసిస్తూ మణిపూర్‌లోని జిరిబమ్ జిల్లాలో టైర్లకు నిప్పు పెట్టి ఆందోళనకు దిగిన ప్రజలు

ఇంఫాల్, గౌహతి, న్యూఢిల్లీ, నవంబరు 17: ఉన్మాదం రాజ్యమేలుతున్నప్పుడు మనుషులు మనుషులుగా ఉండరు. రాక్షసులుగా తయారై కనీస మానవ విలువలకు కూడా దూరమవుతారు. మణిపూర్ హింసాకాండ దీనినే కళ్లకు కడుతోంది. తాము అపహరించుకెళ్లిన ఆరుగురినీ హత్య చేసిన కుకీ మిలిటెంట్లు.. వారిలో ఓ రెండేళ్ల బాలుడిని తల, చేతులు నరికి అత్యంత దారుణంగా చంపిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. తల, రెండు చేతులూ లేని ఆ చిన్నారి మృతదేహం జిరిబమ్ ప్రాంతంలోని బరాక్ నదిలో దొరికింది. అదే నదిలో ఆ బాలుడి అమ్మమ్మ మృతదేహం కూడా అర్ధనగ్న స్థితిలో బయటపడింది. సోమవారం కుకీ మిలిటెంట్లు.. మెయితీ తెగకు చెందిన వీరి కుటుంబాన్ని ఓ శరణార్థి శిబిరం నుంచి అపహరించుకెళ్లిన విషయం తెలిసిందే. కిడ్నాప్‌నకు గురైన వారిలో రెండేళ్ల బాలుడు, ఎనిమిది నెలల వయసున్న అతడి తమ్ముడు, తల్లి, అమ్మమ్మ, చిన్నమ్మ, ఆమె కూతురు.. మొత్తం ఆరుగురు ఉన్నారు. అందరి మృతదేహాలు బరాక్ నదిలోనే శుక్ర, శనివారాల్లో లభ్యమయ్యాయి. ఈ దారుణ హత్యలతో ఎప్పుడేం జరుగుతుందోనని ప్రజలు వణుకుతున్నారు. శనివారం రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో ఏకం గా ముఖ్యమంత్రి నివాసంపైనే మెయితీ నిరసనకారులు దాడికి దిగారు. పలువురు మంత్రులు, బీజేపీ ఎమ్మెల్యేల ఇళ్లను దగ్ధం చేశారు. బాధిత కుటుంబాన్ని రక్షించటానికి ప్రభుత్వం తగిన ప్రయత్నాలు చేయలేదని నిరసనకారులు ఆరోపిస్తున్నారు.

ఎన్‌కౌంటర్‌తో మళ్లీ హింస మొదలు..

గత ఏడాది మే నుంచి జాతుల సంఘర్షణతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో.. ఇటీవల సీఆర్‌పీఎఫ్ జవాన్లతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10 మంది కుకీ మిలిటెంట్లు మరణించటంతో హింసాకాండ మరోసారి ప్రజ్వరిల్లింది. మరణించిన వారందరూ మెయితీ మిలిటెంట్ల దాడుల నుంచి రక్షణ కోసం గ్రామ వలంటీర్లుగా పని చేస్తున్నారని, వారిని సీఆర్‌పీఎఫ్ వాళ్లు కావాలనే పట్టుకొని చంపారని కుకీ సంఘాలు ఆరోపించాయి. ఇదిలా ఉండగానే, గురువారం కుకీల్లోనే ఓ తెగకు చెందిన మహిళను మెయితీ మిలిటెంట్లు అత్యంత దారుణంగా చంపారు. ముగ్గురు పిల్లల తల్లి అయిన ఆ మహిళ కాలిపై మేకులు కొట్టి చిత్రహింసలు పెట్టారు. సామూహిక అత్యాచారం జరిపి, ఆ తర్వాత ఆమెను సజీవ దహనం చేశారు. ఈ ఘటనల నేపథ్యంలోనే, కుకీ మిలిటెంట్లు.. మెయితీ కుటుంబాన్ని కిడ్నాప్ చేసి చంపారు.

బీజేపీ విద్వేష రాజకీయాల కోసమే: ఖర్గే

తన విద్వేషపూరిత రాజకీయాల కోసమే అందమైన సరిహద్దు రాష్ట్రం మణిపూర్ తగలబడాలని బీజేపీ కోరుకుంటున్నట్లు అర్థమవుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. తాజా హింసాకాండపై ఆదివారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'మే 2023 నుంచీ ఊహించనలవి కానంతటి బాధలో, హింసాకాండలో మణిపూర్ ఉంది. ఇది ఆ రాష్ట్ర ప్రజల భవిష్యత్తును సర్వనాశనం చేసింది. మణిపూర్‌ను ప్రధాని మోదీ విఫలం చేశారు' అని ఖర్గే పేర్కొన్నారు. మణిపూర్‌ను సందర్శించి, అక్కడ శాంతిభద్రతల స్థాపనకు ప్రయత్నించాలని మోదీని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కోరారు. కాగా, రాష్ట్రంలోని అన్ని మిలిటెంట్ సంస్థలపైనా ఉక్కుపాదం మోపాలని మెయితీ పౌరహక్కుల సంఘం 'కొకొమీ'.. ఆదివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. 24 గంటల్లో గట్టి చర్యలు చేపట్టాలంటూ అల్టిమేటం జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రతినిధులు, ఎమ్మెల్యేలు కలిసి కూర్చొని సంక్షోభ నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చింది.

సర్కారుకు ఎన్‌పీపీ మద్దతు ఉపసంహరణ

మణిపూర్‌లో హింసాకాండను అదుపులోకి తీసుకురావటంలో విఫలమైనందుకు బీజేపీ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్టు నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) ప్రకటించింది. ఈ మేరకు బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాకు ఎన్‌పీపీ అధ్యక్షుడు, మేఘాలయ ముఖ్యమంత్రి కన్రాడ్ సంగ్మా ఆదివారం లేఖ రాశారు. రాష్ట్రంలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించటంలో, శాంతిభద్రతలను పునరుద్ధరించటంలో బీరేన్‌సింగ్ సారథ్యంలోని ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆ లేఖలో సంగ్మా పేర్కొన్నారు. కాగా, మణిపూర్‌లో ఆందోళన పరిస్థితుల నేపథ్యంలో.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మహారాష్ట్రలో ఆదివారం పాల్గొనాల్సిన ఎన్నికల ప్రచార కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. హోంశాఖ సీనియర్ అధికార్లతో ఢిల్లీలో సమీక్ష జరిపారు. మణిపూర్‌లో శాంతిభద్రతల పునరుద్ధరణకు అన్ని చర్యలూ తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు.

మోదీకి నైజీరియా రెండో అత్యున్నత పురస్కారం

నైజీరియాలో ప్రధానికి ఘన స్వాగతం

న్యూఢిల్లీ, నవంబరు 17: తొలిసారి నైజీరియా పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీకి ఆ దేశంలో అరుదైన గౌరవం దక్కింది. నైజీరియా రెండో అత్యున్నత పురస్కారం అయిన 'గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది నైగర్' అవార్డుతో ఆ దేశం మోదీని సత్కరించింది. ఈ అవార్డును ఆదివారం మోదీకి అందజేసింది. నైజీరియన్లు కాకుండా.. 1969లో క్వీన్ ఎలిజబెత్ తర్వాత ఈ అవార్డును అందుకున్న రెండో విదేశీ వ్యక్తి మోదీనే కావడం విశేషం. ఈ అవార్డును తనకు అందజేసిన నైజీరియా ప్రభుత్వానికి, ఆ దేశ ప్రజలకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును 140 కోట్ల భారతదేశ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. విదేశాల్లో మోదీ అందుకున్న అత్యున్నత అంతర్జాతీయ అవార్డుల్లో ఇది 17వ పురస్కారం. ఆ దేశాధ్యక్షుడు బోలా అహ్మద్ తినూబూ ఆహ్వానం మేరకు ఆదివారం నైజీరియా చేరుకున్న మోదీకి అక్కడ ఘన స్వాగతం లభించింది. నైజీరియా ప్రధానమంత్రి నెసోమ్ ఎజెన్వో ఎయిర్‌పోర్టుకు చేరుకుని మోదీని అబుజా నగరంలోకి ఆహ్వానిస్తున్నట్లు సంకేతంగా ఓ తాళాన్ని అందజేశారు. ఓ వ్యక్తిపై నమ్మకం, గౌరవానికి సూచికగా నైజీరియన్లు ఆ తాళాన్ని అందజేస్తారని భారత విదేశీ వ్యవహారాలశాఖ ఎక్స్‌లో పేర్కొంది. అనంతరం ఆ దేశాధ్యక్ష భవనానికి చేరుకున్న మోదీ నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ తినుబూతో సమావేశమై ఇరు దేశాల మధ్య బంధం మరింత బలోపేతమయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. నైజీరియా పర్యటన అనంతరం జీ- 20 సదస్సులో పాల్గొనేందుకు మోదీ బ్రెజిల్ వెళ్లనున్నారు. అటు నుంచి గయానా వెళ్లి భారత్‌కు తిరిగి రానున్నారు.

నైజీరియాలో తెలంగాణ ప్రవాసికి ప్రధాని ప్రశంసలు



ప్రదీప్ ఫొటోపై సంతకం చేస్తున్న మోదీ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): నైజీరియాలో ఉంటూ ఆఫ్రికా దేశాల్లో భారతీయ సంస్కృతి పరిరక్షణకు పాటు పడుతున్న తెలంగాణ ప్రవాసిని ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. యాదాద్రి జిల్లా ఆలేరు మండలం క్రాంతినగర్ గ్రామానికి చెందిన బిర్కూరి ప్రదీప్ నైజీరియాలో పని చేస్తున్నారు. ఆయన నైజీరియాతో పాటు ఆఫ్రికా దేశాల్లో భారతీయ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, విలువల పరిరక్షణకు తన వంతుగా కృషి చేస్తున్నారు. అలాగే ఆఫ్రికాలోని ఎత్తయిన కిలిమంజారో పర్వత శిఖరాన్ని కూడా అధిరోహించారు. ప్రదీప్ కృషిని గుర్తించిన భారత రాయబార కార్యాలయం.. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా అబుజాలో ఆయన చేతుల మీదుగానే సత్కరించింది. ఈ సందర్భంగా కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించిన క్రమంలో ప్రదీప్ ప్రధాని చిత్రపటంతో దిగిన ఫొటోను చూపారు. దీంతో ఆయన్ను అభినందిస్తూ మోదీ దానిపై తన సంతకం చేశారు. బీజేపీ అభిమాని అయిన ప్రదీప్.. నైజీరియాలోని తెలుగు ప్రవాసి ప్రముఖుల్లో ఒకరు.

నిజం వెలుగులోకి వస్తోంది..

- 'ది సబర్మతీ రిపోర్టు'పై ప్రధాని మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ, నవంబరు 17: గోద్రా రైలు దహనకాండ, గుజరాత్ అల్లర్లపై తెరకెక్కిన 'ది సబర్మతీ రిపోర్టు' సినిమాపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. సినిమా ద్వారా అసలు నిజం వెలుగులోకి వస్తోందంటూ వ్యాఖ్యానించారు. అది కూడా సామాన్యులకు అర్థమయ్యేలా చూపించారని చిత్ర బృందాన్ని కొనియాడారు. ఈ చిత్రం తప్పక చూడాల్సిన సినిమా అంటూ 'ఎక్స్'లో ఓ నెటిజన్ పెట్టిన సుదీర్ఘ పోస్టును షేర్ చేసి మోదీ స్పందించారు. 'నిజం బయటికొస్తోంది. కల్పిత కథలు కొంతకాలమే కొనసాగుతాయి. వాస్తవాలు ఎప్పటికైనా బయటికి రాక తప్పదు' అంటూ పేర్కొన్నారు. మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు (2002లో) గోద్రాలో కొందరు దుండగులు సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌కు నిప్పంటించి.. దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 58 మంది ప్రాణాలు కోల్పోయారు. అనంతరం గుజరాత్ అంతటా అల్లర్లు వ్యాపించి వందలాది మంది మరణించారు.

రారా.. శ్రీమంతుడా..!

(మొదటి పేజీ తరువాయి)

పలు రంగాల్లో ఉన్న ప్రముఖులు గ్రామ సీమలను అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చే అవకాశమున్నందున.. మళ్లీ 'దత్తత' కార్యక్రమాన్ని ప్రారంభించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ భావిస్తోంది. మరింత మెరుగ్గా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, సొంత గడ్డకు మేలు చేయాలనే వారికి అవకాశం కల్పించాలనుకుంటున్నట్టు సమాచారం. ఉద్యోగ, వ్యాపారపరంగా దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లిన వాళ్లు, విదేశాల్లో స్థిరపడ్డ ఎన్ఆర్ఐలకు జన్మభూమికి సేవ చేసే అవకాశాన్ని వైసీపీ ప్రభుత్వం కాలరాసింది. ఇప్పుడు ఆ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని కూటమి సర్కార్ భావిస్తోంది.



'కనెక్ట్ ఆంధ్రా'కు డిస్‌కనెక్ట్

వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్మార్ట్ వార్డు-స్మార్ట్ విలేజ్ కార్యక్రమాన్ని రద్దు చేశారు. దాని స్థానంలో 'కనెక్ట్ ఆంధ్రా' పేరుతో కొత్త విభాగాన్ని తీసుకొచ్చారు. అయితే దీని కాన్సెప్ట్ స్ఫూర్తి కల్పించలేకపోయింది. ఎన్ఆర్ఐలు, దత్తత తీసుకునే ప్రముఖులు నిధులిస్తే.. ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని చెప్పడంతో ఎవరూ ఆసక్తి చూపలేదు. ప్రభుత్వం అభివృద్ధి చేయకపోవడంతోనే తాము గ్రామాలను దత్తత తీసుకుంటున్నామని, తాము నిధులిస్తే, ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందనే నమ్మకం తమకు లేదని పలువురు ఎన్ఆర్ఐలు కనెక్ట్ ఆంధ్రాకు డిస్‌కనెక్ట్ అయ్యారు. దీంతో కొన్ని ప్రభుత్వ సంస్థల సీఎస్ఆర్ నిధులను పాఠశాలలకు అందించేందుకే కనెక్ట్ ఆంధ్రా పనిచేసింది.

2015లో శ్రీకారం చుట్టిన చంద్రబాబు

గతంలో గ్రామ సీమలను దత్తపుత్రికలుగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు ప్రభుత్వం 2015లో ఈ దత్తత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సంసద్ ఆదర్శ గ్రామ యోజన తరహాలో రాష్ట్రంలో ప్రతి ఊరు, వార్డును కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖులు, ఎన్ఆర్ఐలు దత్తత తీసుకునేలా ప్రోత్సాహించింది. పలువురు ప్రముఖులు గ్రామాలు, వార్డులను ఎంపిక చేసుకుని, పాఠశాలలు, తాగునీటి సౌకర్యాలు, రోడ్లు, ఆటస్థలాలు, ప్రార్థనా మందిరాలు, స్మశానాల అభివృద్ధి కోసం ఆర్థిక సాయం అందించారు. సినీ, రాజకీయ ప్రముఖులు పలు గ్రామాలను దత్తత తీసుకోవడంతో విదేశాల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డ వాళ్లు కూడా తన సొంత గ్రామ అభివృద్ధికి సహకరించేందుకు ముందుకొచ్చారు. అలాంటి వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఒక వేదిక కల్పించింది. అధికారులను నియమించి సహకారం అందించింది. పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చింది. వారిని ప్రోత్సహించేందుకు ప్రతి సంక్రాంతికి అవార్డులను ప్రదానం చేసింది.

ప్రభుత్వం తరపున విస్తృత ప్రచారం

ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు పశ్చిమగోదావరి జిల్లా వెలివెన్ను గ్రామంలో స్మార్ట్ విలేజ్-స్మార్ట్ వార్డ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 18 కి.మీ పాదయాత్ర చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు వారి ప్రాంతాల్లో పాదయాత్రలు చేసి ప్రచారం కల్పించారు. దత్తత కోసం గ్రామ పంచాయతీ/వార్డులు లేదా వివిధ రంగాల జాబితాను పబ్లిక్ పోర్టల్లో అందుబాటులో ఉంచారు. పలువురు ప్రముఖులు, కార్పొరేట్ సంస్థలు తాము దత్తత తీసుకున్న గ్రామాల్లో ప్రభుత్వ సహకారంతో, తమ సొంత నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. సంక్రాంతికి గ్రామాలకు వచ్చిన ఎన్ఆర్ఐలను సన్మానించింది.

గతంలో శ్రీమంతులకు ప్రోత్సాహం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ ప్రణాళికా శాఖ.. యూనిసెఫ్‌తో కలిసి స్మార్టు గ్రామాల అభివృద్ధికి నియమాలు రూపొందించి, వాటిని దత్తత తీసుకునే వారికి అందించింది. 13 జిల్లాల్లోని 110 మున్సిపాలిటీలు, 12,958 గ్రామ పంచాయతీల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా పెట్టుకుంది. మౌలిక సదుపాయాలు, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, మాతాశిశు సంరక్షణ, పిల్లల చదువు, పర్యావరణ పరిరక్షణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర 20 రాజీలేని అంశాలతో ముందుకెళ్లింది. ఒక్కో గ్రామం ఒక కొత్త ఆలోచనతో ప్రణాళికలు రూపొందిస్తే 16 వేల కొత్త ఆలోచనల్లో 300 సృజనాత్మక ఆలోచనలు వస్తాయని ప్రభుత్వం భావించింది. శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, స్వచ్ఛంద సంస్థలు, సినీ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఇతర రాజకీయవేత్తలు, కళాకారులు తమకు నచ్చిన గ్రామాన్ని దత్తత చేసుకుని అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనేది ప్రభుత్వ ఆకాంక్ష. ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉన్న ప్రతి ఒక్కరు గ్రామాన్ని లేదా వార్డును దత్తత తీసుకుంటే స్మార్ట్ ఏపీని సాధించవచ్చనేది అప్పటి ప్రభుత్వ అభిప్రాయం. సంస్థలు, వ్యక్తులు దత్తత తీసుకోగా మిగిలిన ఊళ్లను ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, రాష్ట్ర ఉన్నతోద్యోగులు పాలనా వ్యవహారాలు చూసుకుంటూనే ఏదైనా ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేశారు. గ్రామానికి వెళ్లి అక్కడ సామాజికాభివృద్ధి, హక్కుల పరిరక్షణ, సామాజిక భద్రత, పర్యావరణం తదితర అంశాలను పరిశీలించి పురోగమనానికి దోహదపడ్డారు. వనరులను సమీకరించి ఎలా ఖర్చుపెడితే అభివృద్ధి చెందుతాయో దత్తత తీసుకున్నవారు, గ్రామాధికారులు కలిసి నిర్ణయించారు. జన్మభూమి కార్యక్రమంలో సేకరించిన సమాచారాన్ని పోర్టల్‌లో అందుబాటులో ఉంచడం ద్వారా దేశ విదేశాల్లో ఉన్న వారు ఆన్‌లైన్ ద్వారా గ్రామాన్ని, వార్డును ఎంపిక చేసుకునేలా ఏర్పాట్లుచేశారు. ఇందుకోసం ప్రత్యేక యాప్‌లు కూడా అందించారు. స్మార్టు విలేజ్ కార్యక్రమంలో ఎవరేమి చేయాలనే విషయంపై మార్గదర్శకాలను ప్రణాళికా శాఖ, యూనిసెఫ్ తయారు చేసింది.

పలువురు ప్రముఖుల దత్తత

అప్పట్లో చంద్రబాబు విశాఖ జిల్లా అరకు లోయను, ఆయన సతీమణి భువనేశ్వరి కృష్ణా జిల్లా కొమరవోలు, కుమారుడు లోకేశ్ తన తాత ఎన్టీఆర్ జన్మస్థలం నిమ్మకూరు, కోడలు బ్రాహ్మణి చిత్తూరు జిల్లా నారావారిపల్లెను, మంత్రి నారాయణ తాను జన్మించిన నెల్లూరు జిల్లా తోటపల్లిగూడురు, పెరిగిన నెల్లూరు నగరంలోని హరనాథపురాన్ని దత్తత తీసుకుంటామని ప్రకటించారు. సూపర్ స్టార్ మహేశ్‌బాబు.. తన తండ్రి కృష్ణ జన్మించిన గుంటూరు జిల్లా బుర్రిపాలేన్ని దత్తత తీసుకున్నారు. కృష్ణ కుమార్తె, అప్పటి ఎంపీ గల్లా జయదేవ్ భార్య పద్మావతి కంచర్ల గ్రామాన్ని స్వీకరించారు. అప్పటి డీజీపీ రాముడు స్వగ్రామం అనంతపురం జిల్లాలోని నరసింహపల్లిని దత్తత తీసుకున్నారు.



శ్రీశైలం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, ప్రధాన వీధుల్లో రద్దీ నెలకొంది. వేకువజాము నుంచే భక్తులు పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మకు దీపహారతులు, నైవేద్యాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులుదీరారు. కార్తీకమాసం శని, ఆది, సోమవారం రోజుల్లో భక్తుల రద్దీ దృష్ట్యా స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు.

శ్రీవారి సేవలో జస్టిస్ హరినాథ్



తిరుమల ఆలయం ముందు జస్టిస్ హరినాథ్

తిరుమల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హరినాథ్, జస్టిస్ వినోద్ కుమార్ తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న న్యాయమూర్తులకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు.

శ్రీవారిని దర్శించుకున్న పార్లమెంటరీ కమిటీ సభ్యులు



తిరుమల ఆలయం ముందు పార్లమెంటరీ డిఫెన్స్ స్టాండింగ్ కమిటీ సభ్యులు

తిరుమల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని పార్లమెంటరీ డిఫెన్స్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ రాధా మోహన్ సింగ్ ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. అలాగే, సినీ నటుడు రాజేంద్రప్రసాద్ కూడా స్వామి సేవలో పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠకు హాజరైన జస్టిస్ సురేష్‌రెడ్డి




విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న జస్టిస్ సురేష్‌రెడ్డి

పర్చూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా పర్చూరు మండల పరిధిలోని అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట చిలకలూరిపేట జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.నరేంద్రరెడ్డి, చీరాల జూనియర్ సివిల్ న్యాయాధికారి నిషాద్ నాంచ్, పర్చూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి కడియం ప్రశాంతి ఉన్నారు.

తిరుమలలో అన్యమత రీల్స్ కలకలం

» విజిలెన్స్ ఫిర్యాదు మేరకు ఇద్దరు షికారీలపై కేసు



శంకరమ్మ చేసిన వీడియోలో దృశ్యం

తిరుమల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో అన్యమతానికి సంబంధించిన సోషల్ మీడియా రీల్స్ చేసిన ఇద్దరు షికారీలపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదయింది. వివిధ ప్రాంతాలకు చెందిన కొందరు షికారీలు తిరుమలతో పాటు పాపవినాశనంలో హాకర్లుగా ఉంటున్నారు. తిరుపతిలోని ఓటేరుకు ప్రాంతానికి చెందిన హాకర్లు వీరరాఘవ శంకరమ్మ, మీనాక్షి పాపవినాశనంలో ఇతర మతానికి చెందిన పాటలతో రీల్స్ చేస్తుండటాన్ని అక్కడి దుకాణదారులు గుర్తించారు. వెంటనే టీటీడీ విజిలెన్స్ అధికారులకు సమాచారమిచ్చారు. వారు ఇద్దరు మహిళలపై తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వీరితో పాటు మరికొందరు అన్యమతస్థులు తిరుమలలోనే ఉన్నారని, వారూ ఇలానే తరచూ రీల్స్ చేస్తున్నారని ఫిర్యాదులు అందగా విచారణ జరుపుతున్నారు.

'అక్రమ పదోన్నతులపై విచారణ జరిపించండి'

విజయవాడ (ధర్నాచౌక్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో సహాయ సంచాలకుల అక్రమ పదోన్నతులపై విశ్రాంత న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, వారి అక్రమ పదోన్నతులు రద్దు చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లుగా అసిస్టెంట్ డైరెక్టర్లు విద్యాశాఖలో అక్రమంగా రాజ్యమేలుతున్నారని, ధనార్జనే పరమావధిగా వ్యవహరిస్తున్నారని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యతను వీడి, భయానక వాతావరణాన్ని సృష్టించి, డోపిడీ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేస్తున్నారని, నిబంధనలు తుంగలో తొక్కి పదోన్నతులు పొందారని ఆరోపించారు.

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి

తొలి సమావేశం

» దాదాపు 80 అంశాలపై చర్చించనున్న బోర్డు

తిరుమల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నూతన ధర్మకర్తల మండలి తొలి సమావేశం సోమవారం తిరుమలలో జరగనుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీటీడీ బోర్డుకు బీఆర్ నాయుడు ఛైర్మన్‌గా, మరో 24 మందిని సభ్యులుగా ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉదయం 10.15 గంటలకు ఈ సమావేశాన్ని ప్రారంభించనున్నారు. పలు రకాల ముడిసరుకుల కొనుగోళ్లతో పాటు కొన్ని ఇంజనీరింగ్ పనులకు ఆమోదం తెలపనున్నారు. లడ్డూలు, అన్నప్రసాదాల నాణ్యత పెంచేందుకు నూతన టెండర్లను ఆహ్వానించనున్నారు. అలాగే కల్తీ నెయ్యి వ్యవహారం పెద్దస్థాయిలో దుమారం రేపిన విషయం తెలిసిందే. ఇకపై అత్యంత నాణ్యమైన నెయ్యి కొనుగోలు, వాటి పరీక్ష నిమిత్తం ల్యాబ్ ఏర్పాటు వంటి అంశాలపైనా చర్చించనున్నారు. తిరుమలలో రాజకీయ ప్రసంగాలకు బ్రేక్ వేసేలా నిర్ణయాలు తీసుకోనున్నారు. గత ప్రభుత్వంలో బోర్డు తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలన్నింటిపైనా చర్చించనున్నారు. గతంలో భారీగా ఇంజనీరింగ్ పనులకు నిధులు కేటాయించిన అంశంపై చర్చించనున్నట్టు తెలిసింది. గత ప్రభుత్వంలో సామాన్య భక్తులకు దూరమైన వైకుంఠం క్యూకాంప్లెక్స్-1ను పూర్తిస్థాయిలో తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చే అంశంపై చర్చ జరగనుంది. తిరుమలలో అన్యమత ప్రచారానికి పూర్తిస్థాయిలో అడ్డుకట్టవేయడంతో పాటు, అన్యమత ఉద్యోగుల విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే అంశంపై కూడా చర్చించనున్నట్టు తెలిసింది. ఇలా గత ఐదేళ్లలో భక్తులకు కలిగిన ఇబ్బందులన్నీ తొలగించేందుకు ఒక్కొక్కటిగా పరిశీలన చేయనున్నారు. మొత్తం మీదుగా తొలి సమావేశానికి దాదాపు 80 అంశాలతో అజెండాను రూపొందించినట్టు తెలిసింది.

టీటీడీ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఈవో శ్యామలరావు ప్రమాణం



తిరుమల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఈవో శ్యామలరావు తిరుమల ఆలయంలో ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద ఈవోతో అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో శ్యామలరావుకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం అదనపు ఈవో లడ్డూప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ.. బోర్డు సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయడం శ్రీవారు ఇచ్చిన పవిత్రమైన అవకాశంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. గత ఐదు నెలలుగా టీటీడీలో ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టామన్నారు.

'ఆవాస్ యోజన' అవకతవకలపై దృష్టి పెట్టండి

» 20 సూత్రాల అమలు ఛైర్మన్‌కు బీజేపీ నేతల విజ్ఞప్తి

అమరావతి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం అమలులో జరిగిన అవకతవకలపై దృష్టి సారించాలని బీజేపీ శాసనసభ పక్ష నేత విష్ణుకుమార్‌రాజు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 2019-24 మధ్య ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద.. నిర్దేశిత లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణం జరగకపోయినా లబ్ధిదారుల పేరుతో రుణాలు సేకరించి, నిధులు పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఇళ్లు పూర్తికాకపోయినా, వాయిదాలు చెల్లించాలంటూ బ్యాంకులు జారీ చేసిన నోటీసులతో లబ్ధిదారులు మానసిక వ్యధకు గురవుతున్నారని, ఇళ్లు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరగక 43 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. అలాగే, కొవిడ్ వల్ల నిర్మాణాలు ఆలస్యమైతే, ధరల పెరుగుదల నిబంధనను ప్రభుత్వం పట్టించుకోక 2019 ముందు ప్రారంభించిన ఇళ్లు కూడా పూర్తి కాలేదని తెలిపారు. అయితే, ఇళ్లు పూర్తయినట్లు అప్పటి సీఎం జగన్ కేంద్రానికి తప్పుడు నివేదిక ఇచ్చారని వివరించారు. దీనిపై స్పందించిన దినకర్, సమగ్ర సమాచారం సేకరించి, సీఎంకు నివేదిక ఇస్తామని తెలిపారు.

కూటమి సర్కారులో క్షత్రియులకు మంచి గుర్తింపు

» అప్పటి పాలకులు నన్ను దారుణంగా హింసించారు: రఘురామ



డిప్యూటీ స్పీకర్ రఘురామను సన్మానిస్తున్న క్షత్రియ పరిషత్ ప్రతినిధులు

దివాన్‌చెరువు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నప్పటికీ క్షత్రియులకు కూటమి ప్రభుత్వంలో మంచి గుర్తింపుతో ఉన్నత పదవులు ఇవ్వడం సంతోషంగా ఉందని శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు అన్నారు. రాజమహేంద్రవరం క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులో ఆదివారం జరిగిన కార్తీక వన సమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అప్పటి పాలకులు తనను దారుణంగా హింసించారని, అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి కొంతమంది క్షత్రియులతో తనను తిట్టించారని, అటువంటి కష్టసమయంలో తూర్పుగోదావరి జిల్లా క్షత్రియులంతా తనకు అండగా నిలిచారంటూ కృతజ్ఞతలు తెలిపారు. మరో ముఖ్య అతిథి గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ) కులపతి కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మాట్లాడుతూ జనవరి 8, 9, 10 తేదీల్లో జీజీయూలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రఘురామను క్షత్రియ సేవా సమితి తరపున ఘనంగా సత్కరించారు.

రెప్పపాటులో మృత్యు కౌగిలికి!

» ఒంగోలులో స్కూటీని ఢీకొట్టిన వాటర్ ట్యాంకర్

» ముగ్గురు బాలురు మృతి



వికాస్



రేష్మంత్



విశాల్

ఒంగోలు క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంట్లో శుభకార్యం, చెల్లెలి పుట్టినరోజు కోసం ఆమెకు దుస్తులు కొనుగోలు చేసేందుకు వచ్చిన ఇద్దరు సోదరులు, మరో బాలుడు ప్రకాశం జిల్లాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ప్రకాశం జిల్లా ఒంగోలు నగర శివారులోని కొప్పోలు అంబేద్కర్‌నగర్‌కు చెందిన వడ్డే వికాస్ (14), వడ్డే విశాల్ అలియాస్ కుశాల్ (11) అన్నదమ్ములు. వారి బంధువుల గృహ ప్రవేశంతో పాటు, తమ బంధువు కన్నెదార రేష్మంత్ (16) చెల్లెలు పుట్టిన రోజు కోసం దుస్తులు కొనుగోలు చేసేందుకు ముగ్గురూ స్కూటీపై ఆదివారం ఒంగోలు వచ్చారు. తిరుగు ప్రయాణంలో కొప్పోలులోని ఆంజనేస్వామి గుడి వద్దకు చేరుకునే సరికి వారు ప్రయాణిస్తున్న స్కూటీని వెనుక నుంచి వాటర్ ట్యాంకర్ (ట్రాక్టర్) ఢీకొట్టడంతో కిందపడిపోయారు. ట్రాక్టర్ వెనుక చక్రం వారిపై నుంచి వెళ్లగా, స్కూటీ నడుపుతున్న రేష్మంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. వికాస్‌ను చికిత్స నిమిత్తం ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు విడిచాడు. విశాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సంస్కార హీనులను దూరం పెట్టండి!

» కాకినాడ శెట్టిబలిజ వనసమారాధనలో మంత్రి సుభాశ్ వివాదాస్పద వ్యాఖ్యలు

» కుర్చీలు విసురుకుని కొట్టుకున్న ఇరువర్గాలు



వనసమారాధనలో కుర్చీలు విసురుకుని కొట్టుకుంటున్న ఇరువర్గాలు

కాకినాడ సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): "సంస్కార హీనులను దూరంగా ఉంచండి. సంస్కారం లేని వెధవలను పట్టించుకోవద్దు" అని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. మంత్రి వ్యాఖ్యలతో ఆదివారం కాకినాడలో జరిగిన శెట్టిబలిజ కార్తీక వన సమారాధన రచ్చగా మారింది. దీంతో మంత్రి సమక్షంలో శెట్టిబలిజ సామాజికవర్గానికే చెందిన ఇరువర్గాలు కుర్చీలు విసురుకుని కొట్టుకున్నాయి. ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. వన సమారాధన సందర్భంగా నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సుభాశ్ మాట్లాడుతూ.. "ఇద్దరు శెట్టిబలిజలు పోటీ చేస్తున్నప్పుడు కుల సంఘాల నాయకులు కచ్చితంగా ఆ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండి ఎవరికి నచ్చిన వారికి వారు ఓటు వేసుకోవాలి. అంతే తప్ప కుల సంఘాల నాయకులు ఓ పార్టీ వైపు దూరి 'సిద్ధం.. సిద్ధం..' అంటే అంత కంటే చేతకానితనం ఇంకొకటి ఉండదు" అని వ్యాఖ్యానించారు. దీంతో సభలో ఒక్కసారిగా కలకలం రేగింది. "నిన్ను ఎవరూ ఆపలేదు కదా?" అని మంత్రి వ్యతిరేక వర్గం వ్యక్తి వేదిక మీదకు దూసుకువచ్చి పరుష పదజాలంతో మాట్లాడారు. "నీవు చేసింది ఏంటి" అని విమర్శించడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయన అనుచరులు ఆ వ్యక్తిని చుట్టుముట్టి దాడి చేశారు. వీరిని అడ్డుకునేందుకు మరికొందరు కుర్చీలు విసిరారు. దీంతో వన సమారాధన రచ్చగా మారింది. పోలీసులు వచ్చి ఇరు వర్గాలకు సర్ది చెప్పారు. ఈ పరిణామంతో వనసమారాధన కాస్తా కుల సమారాధనగా మారి పార్టీల కుమ్ములాటలకు వేదిక అయిందన్న విమర్శలు వినిపించాయి.

పోలవరపు సాహిత్య సర్వస్వం

పోలవరపు కోటేశ్వరరావు సాహిత్య సర్వస్వం మూడవ భాగం ఆవిష్కరణ సభ నవంబర్ 18 సాయంత్రం 5గంటలకు 'దేవరాయ' సమావేశ మందిరం, 2వ అంతస్తు, హోటల్ దసపల్లా, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, గౌరవ అతిథి పరుచూరి గోపాలకృష్ణ, ఆత్మీయ అతిథి దూపాటి విజయ కుమార్, అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్.

లోక్‌నాయక్ ఫౌండేషన్

'కథా కచ్చీరు' విమర్శ పుస్తకం

వెల్దండి శ్రీధర్ సాహిత్య విమర్శ పుస్తకం 'కథా కచ్చీరు' ఆవిష్కరణ సభ దక్కన్ సాహిత్య సభ – మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 23 సాయంత్రం 5గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి వెల్దండ నిత్యానందరావు, ఆవిష్కర్త కె. శ్రీనివాస్, అధ్యక్షత సి. కాశీం.

టి.వి. నారాయణ

నచ్చకపోతే చింపేసేంత కోపం ఉండేది!

చదువు ముచ్చట

■ రిషి శ్రీనివాస్





ఆఖరుగా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

అరవింద్ అడిగ రాసిన 'ది వైట్ టైగర్'. భరించనలవికాని శోకాన్ని వ్యంగ్యంగా ఒకింత నవ్విస్తూ చెప్పడానికి చాలా నేర్పరితనం ఉండాలి రచయితకి. ఒక అణచివేయబడ్డ కులంలో పుట్టిన నిరుపేద వ్యక్తి అసమానతలను, అవినీతిని దాటి ఎలా ఎదిగాడన్నదే కథ. పీడితుల స్వరాన్ని దీనంగా వినిపించే సంప్రదాయానికి స్వస్తి పలికి చాలా కొత్త రకమైన టెక్నిక్‌తో పాఠకుడ్ని ఆకట్టుకుంటుంది ఈ నవల. నెట్‌ఫ్లిక్స్‌లో సినిమాగా తీసారు కానీ నాకు పుస్తకమే ఎక్కువ నచ్చింది.

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదివారు?

నా చిన్నతనంలో అకడమిక్ బుక్స్ కాకుండా న్యూస్‌పేపర్లు తప్ప వేరే పుస్తకాలు చదివిన జ్ఞాపకం లేదు. కానీ నేను ఏడవ తరగతిలో ఒక పాఠంగా చదువుకున్న శ్రీశ్రీ 'శైశవగీతి' కవిత బాగా నచ్చి 'మహాప్రస్థానం' కొనుక్కున్నాను. ఆ పుస్తకం, నాకు గుర్తున్నంత వరకు, నేను చదివిన మొట్టమొదటి సీరియస్ సాహిత్యం. "మీదే మీదే అనంత విశ్వం మీరే రేపటి భాగ్యవిధాతలు" అని గుంటల్ని పొగిడిన మొట్టమొదటి మహాకవి శ్రీశ్రీ!

మీరు ఎక్కువసార్లు చదివిన పుస్తకాలు?

పీవీ నరసింహారావు 'ద ఇన్‌సైడర్', తిలక్ 'అమృతం కురిసిన రాత్రి', సి. నారాయణరెడ్డి 'విశ్వంభర'.

ఒకప్పటికీ ఇప్పటికీ మీరు చదివే పద్ధతి ఎలా మారింది?

ఒకప్పుడు నేను చదివింది నచ్చకపోతే పుస్తకాన్ని చింపేసే (నిజ్జంగా) కోపం ఉండేది. ఇప్పుడు రచన కన్నా ముందు ఆ రచయిత సామాజిక/ ఆర్థిక/ రాజకీయ పరిస్థితుల్ని ముందు గ్రహించి, ఆ రచన సృజించబడ్డ కాలమాన పరిస్థితుల్ని గమనింపులో పెట్టుకుని పూర్తిగా అతని/ ఆమె షూస్ లోనికి నన్ను నేను ట్రాన్స్‌పోస్ చేసుకున్నాకే చదవడం మొదలు పెడుతున్నాను.


ఒకప్పుడు బాగా నచ్చి ఇప్పుడు అంతగా నచ్చని రచన/ రచయిత?

మీరు అడిగినదానికి పూర్తి వ్యతిరేకంగా జరిగింది. ఒకప్పుడు అస్సలు నచ్చని 'అసమర్థుని జీవయాత్ర' తరువాత కాలంలో నచ్చింది.

మీ ఆలోచనల్ని బాగా ప్రభావితం చేసిన పుస్తకం?

రావణాసురుడి దృష్టికోణంలో ఆనంద్ నీలకంఠన్ రాసిన 'అసుర'. అప్పటివరకు రావణుడ్ని విలన్‌గా ఏళ్ళ తరబడి బలపరచిన దృక్పథానికి ఒక కొత్త కన్విన్సింగ్ భాష్యం ఆ పుస్తకం.

> "ఒకప్పుడు అస్సలు నచ్చని 'అసమర్థుని జీవయాత్ర' తరువాత కాలంలో నచ్చింది."



ఏ గత కాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో, ఏం మాట్లాడతారు?

ఏ గతకాలపు రచయిత తోనూ కలిసి మాట్లాడాలన్న ఫ్యాంటసీ నాకు లేదు. కానీ తమిళ రచయిత సుజాత రంగరాజన్ ఈవీయంలు తయారుచేసే ఇంజినీరింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉంటూ, ఓ చేత్తో సినిమాలకు స్క్రీన్ ప్లేలు రాసి ఇంకో చేత్తో నవలలు/ కథలు/ నాటికలు రాయగలిగేంత నిబద్ధతతో ఒకే జీవిత కాలంలో రెండు జన్మలు బ్రతికారు. ఆయనతో మాట్లాడకుండా ఒక రోజంతా అతని దినచర్యని గమనించాలని ఒకప్పుడు ఉండేది.

(రిషి శ్రీనివాస్ కథా రచయిత)

స్వప్నం

ఇపుడీమె సర్వస్వతంత్ర

తన రూపసౌష్ఠవాలను తానే ఎంచుకొని
తన రెక్కలకు తానే పరిమళం అద్దుకొని
తెల్లని వెన్నెలలో వికసించిన రంగుల కలువ.

గూటిలో ఒదిగినప్పటి గువ్వతనం వదిలి
తన రెక్కలలో తానే బలం నింపుకొని
తన స్వరాన్ని తానే శృతి చేసుకొని
అపుడపుడు అందంగా పలకరించే వసంత కోకిల.

కనక సంపన్న కాకపోయినా
తన ఆశలు, ఆశయాలే
ఆభరణాలుగా ధరించిన
అపరంజి బొమ్మ.

ఇవ్వటం పుచ్చుకోవటం
ఒక వేడుక మాత్రమే!
తన సర్వస్వమూ తనకే సొంతం.

ఇపుడీమె
తన దారిని తానే నిర్మించుకొని
తన జీవితాన్ని తానే నిర్వచించుకొని
ఏనాడో బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టిన
పరిపూర్ణ మహిళ!

తను కోరుకున్న సంసార నౌక లోనికి అడుగుపెట్టడానికి
నా చేతిని ఊతగా అందించి
ధన్యమౌతాను.

అప్రయత్నంగా, అతిసహజంగా తలెత్తే
అన్ని భయసందేహాలను
కనురెప్పల క్రిందే అదిమిపెట్టి
తన కలల తీరానికి తప్పక చేరాలని
మనసులోనే మరీమరీ కోరుకొని
నెమ్మదిగా చెయ్యి ఊపుతూ
ఈవలి ఒడ్డునే నిలిచిపోతాను.

■ విన్నకోట రవిశంకర్
rvinnako@yahoo.com

ప్రతిభా పురస్కారం

దళిత సాహిత్య సాంస్కృతిక రంగంలో కృషి చేసిన మహిళకు ఇచ్చేందుకు కొత్తగా మొదలైన 'డా. శ్రీకాకుళపు జాయ్ అడిల్ మేరీరాయ్ స్మారక ప్రతిభా పురస్కారం' ఈ ఏడాదికి జూపాక సుభద్ర స్వీకరిస్తారు. పురస్కార ప్రదానం నవంబర్ 22న విజయవాడ ఎగ్జిక్యూటివ్ క్లబ్‌లో జరుగుతుంది.

జాన్సన్ చోరగుడి

'విజయ గాథ' స్వీయచరిత్ర

బోయి విజయ భారతి స్వీయ చరిత్ర 'విజయ గాథ' & విజయ భారతి స్మారక సంచిక ఆవిష్కరణ సభ నవంబర్ 23 సాయంత్రం 5.30 గంటలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లిలో జరుగుతుంది.

బొజ్జా తారకం ట్రస్ట్

'వేకువ' కథాసంపుటి

మజ్జి భారతి కథా సంపుటి 'వేకువ' ఆవిష్కరణ సభ నవంబర్ 24 ఉదయం 10గంటలకు విజయనగరం జిల్లా రాజాంలోగల శ్రీవిద్యా నికేతన్ పాఠశాలలో జరుగుతుంది. అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, పొట్నూరు కోటిబాబు అతిథులుగా పాల్గొంటారు.

గార రంగనాథం

రానున్నది కథల ఋతువు!

తెలుగులో ఇప్పుడు కథా సంకలనాల సీజన్ నడుస్తుంది. ఏటా వచ్చే వార్షిక కథా సంకలనాలతో పాటు ప్రత్యేక ఇతివృత్తాన్నో, సందర్భాన్నో ఎంపిక చేసుకొని త్వరలో కొన్ని కథా సంకలనాలు రాబోతున్నాయి. వాటిలో కొన్నింటికి సంపాదకత్వం వహిస్తున్నవారు ఆ సంకలనాల వివరాలు, ప్రత్యేకతల గురించి 'వివిధ'తో మాట్లాడారు.

దళిత ప్రేమ కథలు


సంపాదకత్వం: **మానస ఎండ్లూరి, అరుణ గోగులమండ**





ప్రేమ గొప్పదని చిన్నప్పటి నుంచీ చదువుతూ వింటూ పెరిగి, తీరా ఇదే సమాజంలో కులాంతర వివాహాలు చెల్లకపోవడం, పరువుహత్యల పేరుతో వేలమంది దళిత యువకులు హేయమైన రీతుల్లో చంపబడుతున్నా పెద్దగా మార్పు రాకపోవడం... ఇలా ఎన్నో నిర్భాంతపరిచే సంఘటనలను, మారని వ్యవస్థలను చూస్తూ– మేము ఈ దళిత ప్రేమకథల సంకలనానికి నడుం బిగించాం.

ఎక్కువగా ఆధిపత్య కులాల నుంచి, శరీరపు రంగులు చూసి, కలుపుకునే సంబంధాలకు ప్రేమ అనే పేరు పెట్టి అందంగా రాసిన రచనలనే విరివిగా అందరం చదివాం. ప్రేమల పేరిట వధించబడ్డ, అణచివేయబడ్డ అంటరాని కులాల యువత గురించీ, సమాజాన్ని ఎదిరించి కులాంతర వివాహాలు చేసుకొని ఇంటా బైటా నెగ్గుకు రాగలిగిన జంటల గురించీ, దళితులు ఇతర కులాలవారిని ప్రేమించి చేసుకున్న తర్వాత ఆ పెళ్ళిలో ఏ మాత్రం ప్రేమ మిగిలింది అన్న ప్రశ్నల గురించీ, క్యాస్ట్ అండ్ జెండర్ కోణాల గురించీ... పరిష్కారం దిశగా కాకపోయినా ఓ ముఖ్యమైన చర్చ జరగాలని ఈ దళిత ప్రేమకథల అంశాన్ని ఎంపిక చేశాం. ఎక్కువగా వర్ధమాన రచయితలు ఈ సంకలనానికి కథలు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఈ ప్రేమ కథలలో ఇతివృత్తం, నేపథ్యం ఏదైనా కావచ్చు కానీ ప్రేమజంటల పాత్రల్లో కనీసం ఒకరు దళితులు అయ్యుండాలన్న నియమం పెట్టాం. రచయితలు ఏ కులమత వర్గ ప్రాంతీయ జెండర్ వారైనా కావచ్చు.



అస్తిత్వ సాహిత్య పుస్తకాలు పెద్దగా ఆస్తులు కూడపెట్టకపోవచ్చు కానీ అస్తిత్వమే ఆస్తిగా బతుకుతున్న రచయితలుగా మేము సంపాదకులుగా కొత్త పాత్రలోకి వెళ్ళినప్పుడు మా రచయితలకు రూ.1000 గౌరవార్థం ఇస్తూ, ఐదు ప్రతులను బహూకరించాం. సంకలనాలు వేసిన సంపాదకులు రచయితల కథలతో సొమ్ము చేసుకుంటారనీ, కథా రచయితలకు ఒక పుస్తక ప్రతిని ఇవ్వడానికి కూడా పెద్ద మనసు ఉండదని నిందలు మోస్తూనే ఉంటారు. ఇవన్నీ చూస్తున్న వారిగా మా రచయితలకు మేము ఇచ్చిన చిరుసత్కారం ఇది.

ఆంధ్రలో అస్తిత్వవాద రచయిత్రులు పలుచబడిన ఈ కాలంలో ఆంధ్రా దళిత స్త్రీవాద రచయిత్రులుగా మేం దళిత ప్రేమకథలను సంకలనంగా తీసుకురావడం ఒక ప్రత్యేకమైన సందర్భం అని గట్టిగా చెప్పగలం. సమాజంలో ఇంతవరకూ పెద్దగా మాట్లాడని, మాట్లాడటానికి జంకిన, ప్రచురణ వరకూ రావడానికి అవకాశం లేకపోయిన ఎన్నో ప్రేమకథలకు జీవం పోస్తుందన్న ఆశతో ఈ ఈ సంకలనాన్ని మీ ముందుకు తెస్తున్నాం.


అపురూప – చింతన కథలు

సంపాదకత్వం: **బి. అజయ్ ప్రసాద్**



ఉదయిని అంతర్జాల పత్రిక కోసం నేను 'అపురూప కథ' పేరుతో శీర్షిక నడుపుతున్నాను. దాని కోసం గతంలో వచ్చిన ఆణిముత్యాల వంటి కథలను ఎంపిక చేసి వేస్తున్నాను. ఆ పనిలో భాగంగా గత పాతికేళ్ల కాలంలో నాకు బాగా గుర్తుండిపోయిన కథల జాబితా తయారు చేసుకున్నాను. అప్పుడే ఇలాంటి కథలతో ఒక సంకలనం తెస్తే బాగుంటుంది అన్న ఆలోచన కలిగింది. మధురాంతకం నరేంద్ర సంపాదకత్వంలో 2002లో 'తాత్త్విక కథలు' పేరిట ఒక కథా సంకలనం వచ్చింది. ఆ తరవాత గత ఇరవై ఏళ్ళ కాలంలో అటువంటి సంకలనం మరలా తెలుగులో రాలేదు. వచ్చిన సంకలనాలన్నీ చాలా వరకు నిర్దిష్ట భావజాల పరంపరలో వచ్చినవే. వార్షిక కథల సంకలనాలలో కూడా అటువంటి భావజాలానిదే పైచేయి. ఈ కారణంగా గత పాతికేళ్ల కాలంలో చెప్పుకోదగ్గ ఎన్నో కథలు వెలుగు లోకి రాకుండా పోయాయి. ఈ నేపథ్యంలో ఇటువంటి కథల సంకలనం వస్తే బాగుంటుంది అన్న ఆలోచన కలిగింది.

కథల ఎంపికలో నేను ఎటువంటి భావజాలాన్నీ పరిగణన లోకి తీసుకోలేదు. తెలుగునాట వచ్చిన అన్నిరకాల సామాజిక ఉద్యమాల మీద నాకు గౌరవం ఉంది. కానీ సాహిత్యం, కళలు విషయాలకి వస్తే నా ఆసక్తి వేరు. ఈ కథలన్నీ ఒక దగ్గర పెట్టి చూసుకున్నప్పుడు దాదాపు అన్ని కథలు అంతరంగ విశ్లేషణ, ఆత్మాన్వేషణ, జీవిత వాస్తవం, చిత్త భ్రాంతి, వర్తమానానికి ఉండే విలువ మొదలైన అంశాల మీద నడిచాయి. ఇతరత్రా అస్తిత్వ ఉద్యమ కథలు రాసే రచయితల కథలు కూడా ఇందులో చోటు చేసుకున్నాయి. కాబట్టి ఇందులో ముందుగా ఎంచుకున్న ప్రాతిపదిక అంటూ ఏదీ లేదు. ఈ సారాంశం కూడా ఎంపిక జరిగిన తరవాత గ్రహించినదే. ఇలాంటి కథల కోసం ఎదురు చూసే కొత్త తరం పాఠకులకు, అలాగే ఒక రకమైన కొత్త తరం రచయితలు పుట్టడానికి ఈ సంకలనం ఉపకరిస్తుందని నా నమ్మిక. ఏ పాతికేళ్ళకో ఇలాంటి అరుదైన కథల సంకలనం ఒకటి వస్తుంది. అది నా చేతులతో తేగలగడం గౌరవంగా భావిస్తున్నాను.







శీతాకాలం

మంచుతెల్లగా మేల్కొంటున్న ఉదయం
పల్లెలో పసికందు చేతివేళ్ళ స్పర్శలా ఉంటుంది
ఆ సుపరిచితమైన స్పర్శ కావాలి
ఆ శ్వాస పీల్చాలి
ఆ ఆకాశం చూడాలి
ఓ చలిమంట వేసుకోవాలి

ఇంకా ఎండుగడ్డిపైన తల్లికుక్క
తల్లికుక్కపైన కుప్పగా పడుకున్న దాని పిల్లలు
అదొక జీవన సంతులనం
రెక్కలకష్టం వినిపిస్తుంది శ్రామికుడిదీ, గువ్వలదీ
ఆ మంచుపూట ఎక్కడికెళుతుందీ గువ్వల గుంపు
గువ్వెగిరిపోగా ఊగుతున్న జొన్నకంకినవుతాను
నేను మంచుతెల్లగానూ, మంచులో పనిచేస్తున్న శ్రామికుడిలానూ,
శ్రామికుడి చేతిలోని పనిముట్టులానూ ఉండాలనుకుంటాను

ఒకవైపు మంచు
ఒకవైపు నిమ్మపువ్వులా వెలుతురు వికసం
జీవనసంధ్యా కరుణను పంచుతూ సూర్యుడు
గడ్డకట్టిన కొబ్బరినూనె కరుగుతూ ఉంటుంది
దుప్పటి వెచ్చటి వాసన వేస్తుంటుంది
రెండు నందివర్ధనం పువ్వులు త్రుంచి
చల్లగా కళ్ళకు తాకించి
ఒక శీతాకాలపు ఆనందంతో నడుస్తూ
అప్పటికి ఏ పాదం మోపని
మంచుతో నిండిన గడ్డిపైన నా పాదముద్రలు
నా జీవితం వైపుకు వెళ్ళేదారిలా వుంటుంది.


■ శాంతయోగి యోగానంద
✆ 91107 70545

ఈ కాలపు తెలుగు కథ

సంపాదకత్వం: **కుమార్ కూనపరాజు**



రెండు ప్రత్యేక సందర్భాలు నన్ను ఈ సంకలనం తేవడానికి పురికొల్పాయి. ఒకటేమిటంటే– అమెరికాలో నివసించే ఒకాయన అక్కడ ఇటీవల జరిగిన తెలుగు సభల్లో తెలుగు కథ అధోగతి వైపు ప్రయాణం చేస్తోందని ఓ తీవ్ర విమర్శ చేసాడు. ఇది తప్పని తెలియచెప్పడానికి, ఈ కాలపు తెలుగు కథలను సేకరించాను. అన్ని వర్గాలు, ప్రాంతాలు, వాదాల నుండి ప్రాతినిధ్యం వుండేలా చూసుకున్నాను. రెండో సందర్భం– ఒక ప్రఖ్యాత తమిళ రచయిత, తెలుగు నుంచి తమిళ బాషకు అనువదింపబడిన కథా సంపుటి గురించి వ్యాఖ్యానిస్తూ, తమిళంలో తెలుగు కథలు అందుబాటులో పెద్దగా లేవని అన్నారు. ఇది నిజమే అనిపించింది. సాహిత్య అకాడమీ ద్వారా మాత్రమే కొన్ని అనువాదమై ఇతర భాషల్లోకి వెళ్ళాయి. మంచి తెలుగు సమకాలీన కథను వీలైనన్ని భారతీయ భాషలలో తీసుకు వెళ్లాలన్న కోరిక కలిగింది. ఇందు కోసం కూడా ఈ సంకలనం చేసాం. ఈ సంకలనం లోని కథల ఎంపికకి ప్రాతిపదికగా– కథకులు వారి ప్రాంత, వర్గ, వర్ణ, జెండర్ అణచివేతలను ప్రభావవంతంగా చూపించిన కథా అంశాలనూ, కొన్ని తెలుగు జనరల్ అంశాలనూ పరిశీలించాము. ఆధునిక కాలం లోనూ కొనసాగుతున్న వివక్షనూ, అమానవీయ విషయాలనూ, మానవ హృదయ వేదననూ ఈ కథలు ఎత్తి చూపుతాయి.



ఉత్తమ రష్యన్ కథలు

సంపాదకత్వం: **అనిల్ బత్తుల**



మొదటగా నేను 'రాదుగ' పుస్తకాల అభిమానిని. గత ఇరవై యేళ్లుగా 'రాదుగ', 'ప్రగతి' ప్రచురణ సంస్థలు ప్రచురించిన ఎన్నో రష్యన్ తెలుగు అనువాద పుస్తకాలను సేకరిస్తూ వచ్చాను. వాటిలో అజరామరమైన నవలలు, నవలికలు, కథలు ఎన్నో ఉన్నాయి. వాటన్నిటినీ వీలున్నప్పుడల్లా మళ్ళీ మళ్ళీ చదువుతుంటాను. రష్యన్ అనువాద కథల్లో నాకు నచ్చిన కథలు ఎన్నో ఉన్నాయి. వాటన్నిటినీ ఒకచోట పెట్టి సంకలనంగా తెస్తే తెలుగు పాఠకులకు వెసులుబాటుగా ఉందనిపించింది. ఈ ఆలోచనే ఈ పుస్తకానికి నాంది. ఈ కథలన్నీ ఇప్పటికే కాలానికి నిలబడిన కథలు. అదే నేను ఎంచుకున్న ప్రామాణికత. ఇందులో పెద్ద కథలు, నవలికలంత నిడివి వున్న కథలు కూడా ఉన్నాయి. ఈ కథలన్నీ సుమారు నూట యాభైఏళ్ళ క్రితం రష్యాలో ప్రచురించబడినవే. రచయితలంతా టాల్‌స్టాయ్, చెఖోవ్, గోర్కీ వంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచినవారు. ఈ రచయితలకు ఎంత పేరుందో వాళ్ళ రచనలకూ అంతే పేరుంది. ఈ పుస్తకం ప్రత్యేకత– ప్రఖ్యాతిగాంచిన రష్యన్ కథలు ఒకేచోట ఉండటం. రాచమల్లు రామచంద్రారెడ్డి, ఆర్వీయార్, నిడమర్తి ఉమా రాజేశ్వరరావు, గిడుతూరి సూర్యం వంటి లబ్ధప్రతిష్టులైన అనువాదకులు అనువదించిన కథలన్నీ ఒకే సంకలనంలో చేర్చడం. అరుణా ప్రసాద్ వంటి వర్తమాన అనువాదకుల కథలు కూడా ఇందులో వున్నాయి. శాశ్వతంగా మనసు పొరలపై ముద్ర వేసే కథల సంకలనం ఇది.




ఆధునిక తెలుగు కథ: 2000–2024

సంపాదకత్వం: **అరిపిరాల సత్యప్రసాద్, వెంకట్ శిద్దారెడ్డి, మహి బెజవాడ**



తెలుగులో ఉత్తమ కథల కోసం వెతికే సాహితీ ప్రియులకు అందే మొదటి పది సజెషన్స్‌లో ఏడెనిమిది కథలు యాభై అరవై ఏళ్లకు ముందు రాసినవి అయ్యుంటాయి. అలాగే పుస్తకాల షాపుల్లోనూ, పుస్తక ప్రదర్శనలోనూ అడుగుపెట్టగానే మొదట కనపడే పది తెలుగు పుస్తకాల్లో ఏడెనిమిది పుస్తకాల రచయితలు గతించిపోయి దశాబ్దాలు దాటి ఉంటుంది. పూర్వపు రచయితల గొప్పదనాన్ని తక్కువ చెయ్యటం కాదు కానీ, వర్తమానంలో వస్తున్న కథలలో ఆ పాత కథలకు ఏ మాత్రం తీసిపోని కథలు ఉన్నాయి అన్నది మా గమనింపు. ఈ ఆలోచనే ఈ 'ఆధునిక తెలుగు కథ' పుస్తకానికి బీజం వేసింది. ఇతర భాషలలో వచ్చే ఉత్తమ సాహిత్యాన్ని కళ్లకద్దుకునే మనం, తెలుగులో వస్తున్న రచనలను కనీసం గుర్తించడానికి కూడా వెనుకాడటం మరో కారణం. అందువల్ల 2000 సంవత్సరం తరువాత రాయడం మొదలు పెట్టిన రచయితల కథలను సేకరించి, వాటిలో నుంచి ఎంచుకున్న ఉత్తమ కథలతో ఈ పుస్తకాన్ని రూపొందించాం. ఈ కథలను ఇతర భాషల పాఠకులకి అందించే ఉద్దేశం కూడా ఉంది కాబట్టి అనువాదానికి అనువైన కథలను ఎంచుకునేందుకు ప్రయత్నించాం. తూకం వేసి కథలను ఎంపిక చేయకపోయినప్పటికీ, ఇందులో అన్ని రకాల కథలకూ ప్రాతినిధ్యం కలిగిందనే నమ్మకం ఉంది. ఈ కథలన్నీ ఒక పుస్తకంగా చూసినప్పుడు వర్తమాన తెలుగు రచయితలలో ఆధునిక శైలీ శిల్పాలతోపాటు ప్రగతిశీల దృష్టి, సామాజిక చైతన్యం కూడా ఉన్నాయని నిరూపణ అయ్యింది. అదే ఈ పుస్తకం విలువని పెంచిందని అనుకుంటున్నాం. తెలుగు పాఠకులకి ఆధునిక తెలుగు కథ సుసంపన్నంగా ఉంది అని చెప్పడంతోపాటు, ఈ వైభవాన్ని తెలుగేతర పాఠకులకి చూపించేందుకు ఈ పుస్తకం అద్దంలా పనిచేస్తుందని మా విశ్వాసం.







మల్లవల్లి గ్రామానికి కేటాయించిన భూమిలో చదును చేస్తున్న జేసీబీ

మల్లవల్లి ఏపీఐఐసీ భూముల్లో మళ్లీ లొల్లి

గ్రామానికి కేటాయించిన వంద ఎకరాల భూమిని పారిశ్రామిక వాడలో కలుపుకోవడానికి ఏపీఐఐసీ యత్నం

* అభ్యంతరం తెలిపిన గ్రామస్తులు
* ముందుకు వస్తే అడ్డుకుంటామని హెచ్చరిక

హనుమాన్‌జంక్షన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మల్లవల్లి గ్రామ అవసరాలకు కేటాయించిన వంద ఎకరాల భూమిని తమ ఆధీనంలోకి తీసుకోవడానికి ఏపీఐఐసీ అధికారులు ఆదివారం చేపట్టిన చర్యలను గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామానికి కాకుండా ఆ భూమిని పారిశ్రామిక వాడలో కలపాలని చూస్తే సహించేది లేదని, ఖచ్చితంగా అడ్డుకుంటామని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అధికారులను హెచ్చరించారు. మల్లవల్లి ఆర్ ఎస్ నెం:11లో 1,460 ఎకరాల భూమిని 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పారిశ్రామిక వాడ అభివృద్ధికి ఏపీఐఐసీ కి అప్పగించింది. 1,460 ఎకరాల భూమిలో గ్రామ కమ్యూనిటీ అవసరాలకు 100 ఎకరాలు కేటాయించింది. మిగిలిన 1,360 భూమిలో ఏపీఐఐసీ లేఅవుట్ చేసి పరిశ్రమలకు కేటాయింపులు చేసింది. అయితే గ్రామానికి కేటాయించిన వంద ఎకరాల భూమిలో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జెడ్పీ హైస్కూల్‌కు ఐదు ఎకరాలు కేటాయించగా అందులో హైస్కూల్ నిర్మాణం చేపట్టారు. అందులోనే విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి కొంత భూమి, పేదల ఇళ్ల స్థలాలకు మరో 35 ఎకరాలు కేటాయించాలని ప్రతిపాదించారు. పెరికీడు, కె.సీతారాంపురం, బొమ్ములూరు తదితర గ్రామాల పేదలకు కూడా మల్లవల్లిలోని ఆ వంద ఎకరాల భూమిలో స్థలాలు కేటాయించాలని రెవెన్యూ అధికారులు అనుకున్నారు. గుట్టలు, లోయలుగా ఉన్న ఆ భూమిని చదును చేసి రాళ్లు కూడా పాతారు. ఏ ఊరి పేదలకు ఆ ఊర్లోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ ముందుకు రావడంతో ఇళ్ల స్థలాల పంపిణీ నిలిచిపోయింది. ఇంత వరకు మల్లవల్లి గ్రామంలో పేదలకు స్థలాలు పంపిణీ జరగలేదు.

పారిశ్రామికవాడలో కలుపుకొనేందుకు..



ఆదివారం ఏపీఐఐసీ జెడ్ఎం కె.బాబ్జీ గ్రామానికి కేటాయించిన వంద ఎకరాల భూమిని లెవలింగ్ చేసి పారిశ్రామిక వాడలో కలుపుకునేందుకు చర్యలు చేపట్టారు. హైస్కూల్ భవనం నిర్మించిన ఏరియాతో పాటు మరి కొంత భూమి దాదాపు 18 ఎకరాలను వదిలిపెట్టి మిగిలిన 82 ఎకరాల భూమిని లెవలింగ్ చేయడానికి జేసీబీలతో పనులు చేపట్టారు. గ్రామానికి కేటాయించిన వంద ఎకరాలు చుట్టూ ఉన్న ఇనుప ముళ్ల కంచెను కూడా తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ టీడీపీ నాయకులు అక్కినేని కృష్ణారావు, అలూరి సురేష్, వేముల కానులు, వేముల నాగరాజు, సరదల పుల్లయ్య, చిన్నాల మంగయ్య తదితరులు వెళ్లి అడ్డుకున్నారు. 2016 అక్టోబరులో రాష్ట్ర ప్రభుత్వం వందెకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, దానిని తిరిగి ఇప్పుడు పారిశ్రామిక వాడలో కలుపుకోవడానికి పూనుకోవడం అన్యాయమని అభ్యంతరం వ్యక్తం చేశారు. జెడ్ఎంకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు కాపీని అందజేసి వివరించారు. గ్రామ అవసరాలకు కేటాయించిన భూమి జోలికి రావద్దని విజ్ఞప్తి చేశారు. కాదని ముందుకు వెళితే ఎమ్మెల్యే యార్లగడ్డ సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఖచ్చితంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. దీంతో అక్కడ చేపట్టిన పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.

ఏపీఐఐసీకి అప్పగించింది 1200 ఎకరాలే!

రెవెన్యూ రికార్డులు ప్రకారం ఏపీఐఐసీకి అప్పగించింది 1,360 ఎకరాలు, కాని భూమిగా 1200 ఎకరాలు కూడా లేదని తెలుస్తోంది. అందుకే ఏపీఐఐసీ అధికారులు ప్రభుత్వ ఉన్నతాధికారుల సహకారంతో గ్రామానికి కేటాయించిన వందెకరాల భూమిని కూడా పారిశ్రామిక వాడలో కలుపుకోవడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సర్వే చేసి పారిశ్రామిక వాడ బౌండరీ ఫిక్స్ చేశారు. రికార్డులు ప్రకారం 1,360 ఎకరాల లేకపోవడంతో గ్రామానికి కేటాయించిన వంద ఎకరాల భూమిని కూడా పారిశ్రామిక వాడలో కలుపుకునే ప్రయత్నంలో భాగమే ఆదివారం చేపట్టిన పనులేనని పలువురు భావిస్తున్నారు.

ప్రవచన కార్యక్రమానికి హాజరైన భక్తులు. ఇన్‌సెట్‌లో గరికపాటి





మంత్రశక్తి వైజ్ఞానికం

గరికపాటి నరసింహారావు ప్రవచనం

6లో



నున్న మామిడి తోటలో మ్యూజికల్ చైర్

వన భోజనం

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భవానీ ద్వీపం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. భారీగా తరలివచ్చిన యాత్రికులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. బోటు షికారు, మ్యూజికల్ చైర్ తదితర ఆటల్లో పాల్గొని ఉల్లాసంగా గడిపారు. పచ్చని చెట్ల నీడలో స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనాలు చేశారు. నున్న శివారులోని మామిడి తోటల్లో వనసమారాధనలు విరివిగా జరిగాయి.



భవానీ ద్వీపంలో చిన్నారుల ఆటలు



భవానీ ద్వీపంలో వనభోజనాలు

చెక్ రిపోర్టుల సొమ్ము స్వాహా!

సరిహద్దు ప్రాంతాల్లో ట్రాన్స్‌పోర్టు వాహనాల తనిఖీ సమయంలో రవాణాశాఖ అధికారులు డ్రైవర్ల బలహీనతలను ఆసరాగా చేసుకుని తీవ్రస్థాయిలో అవినీతికి పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. నిబంధనల పేరుతో జరిమానాలు రాస్తున్న అధికారులు ఆ డబ్బులను డ్రైవర్ల వద్ద నుంచి తీసుకుని కార్యాలయంలో జమ చేయకుండా దారిమళ్లిస్తున్నట్లు సమాచారం. దీంతో వాహనదారులు నగదు చెల్లించినా కూడా వారి వాహనాలపై చెక్ రిపోర్టులో పెండింగ్ కేసులు చూపుతూనే ఉన్నాయి. ఇలాంటి కేసులు భారీగా పేరుకుపోవడంపై రవాణాశాఖ ఉన్నతాధికారులు ఆరా తీస్తే చెక్ రిపోర్టుల సొమ్ము స్వాహా విషయం బయటకు వచ్చినట్లు సమాచారం.



రవాణాశాఖ అధికారుల మాయాజాలం

* సరిహద్దుల్లో తనిఖీలు.. వాహనదారులకు జరిమానాలు
* కాంపౌండింగ్ ఫీజు కార్యాలయంలో కట్టమని చెల్లిస్తున్న డ్రైవర్లు
* కట్టకుండానే జేబులో వేసుకుంటున్న అధికారులు
* చెక్ రిపోర్టులో పెండింగ్ కేసులపై ఆరా తీస్తున్న ఉన్నతాధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రవాణా వాహనాలైన లారీలు, ట్రాలీలు, కంటైనర్లు, ట్యాంకర్లను సరిహద్దు ప్రాంతంలో రవాణాశాఖ అధికారులు ఆపి వాటిని పరిశీలిస్తారు. నిబంధనల ప్రకారం డాక్యుమెంట్స్ ఉన్నాయా.. ఓవర్ లోడ్ వేస్తున్నారా.. వాహనంలో ఏమైనా లోపాలు ఉన్నాయా.. వంటివి పరిశీలిస్తారు. ఏవైనా గుర్తిస్తే కాంపౌండింగ్ ఫీజుల పేరిట జరిమానాలు విధిస్తారు. ఇలా జరిమానాలు విధించిన విషయాన్ని ఆన్‌లైన్‌లో ప్రస్తావిస్తూ చెక్ రిపోర్టు రాయాల్సి ఉంటుంది. పలాన నంబర్ కలిగిన వాహనంలో గుర్తించిన లోపాలను ప్రస్తావిస్తూ దీనికి ఎంత జరిమానా విధించారో పొందుపరచాల్సి ఉంటుంది. ఈ జరిమానాలను వాహనదారులు రవాణా శాఖ కార్యాలయాల్లో చెల్లించాల్సి ఉంటుంది. జరిమానా చెల్లిస్తేనే చెక్ రిపోర్టులో పెండింగ్ లేదని వస్తుంది. జరిమానా చెల్లించకపోతే చెక్ రిపోర్టులో పెండింగ్ అని చూపిస్తుంది. జరిమానా చెల్లించని వాహనాన్ని మళ్లీ ఏదైనా సందర్భంలో వాహన తనిఖీ అధికారులు తనిఖీలు చేసేటపుడు పాత కేసులు కూడా చెక్ చేస్తారు. అప్పుడు చెక్ రిపోర్టులో పెండింగ్ అని చూపిస్తోంది. అంటే ఆ వాహనదారుడు డబ్బులు కట్టలేదని అర్థం. ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. ఇక్కడ వాహనదారులు డబ్బులు కట్టేసినా అవి మాత్రం రవాణా శాఖకు జమ కావటం లేదు.

రవాణా శాఖ అధికారులు దాదాపుగా రాత్రి సమయంలోనే తనిఖీలు నిర్వహిస్తుంటారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీలను తనిఖీ చేసి జరిమానా విధించినపుడు ఆఫీసు ఉండదు కనుక ఆ సమయంలో వారు డబ్బులను రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లి కట్టలేరు. మరుసటి రోజు పదిన్నర గంటల వరకు లారీ ఇక్కడే పెట్టుకుని వేచి ఉండలేరు. ఇలాంటి సందర్భంలో జరిమానా డబ్బులను మీరే కట్టమని వాహన తనిఖీ అధికారులకు ఇచ్చేస్తున్నారు. ఈ డబ్బులను తనిఖీ అధికారులు కట్టడం లేదని తెలుస్తోంది. ఇదేదో మంచి ఆదాయ వనరుగా ఉందన్న ఉద్దేశంతో పలువురు అవినీతి ఇన్‌స్పెక్టర్లు చెక్ రిపోర్టులలోకే ఎక్కించటం లేదని సమాచారం. వాహనాల లోపాలను చూపి కాంపౌండింగ్ ఫీజులు వసూలు చేస్తున్నట్టుగా వాహనదారుల ముందు బిల్డప్ ఇచ్చి వారి దగ్గర డబ్బులు తీసుకుంటున్నారని తెలిసింది. ఈ డబ్బులు వారి సొంత జేబుల్లోకి వెళ్లిపోతున్నాయి. కాంపౌండింగ్ ఫీజులకు సంబంధించి నిర్దేశిత టార్గెట్లను చేరుకునేందుకు పనిచేశామని చెప్పుకోవటానికి కొన్ని చెక్ రిపోర్టులలో పేర్కొంటున్నా.. వసూలు చేసిన డబ్బులను కట్టడం లేదు. ఇతర రాష్ట్రాల వారు కావటంతో వారిని గుర్తించటం, అడగటం కూడా కష్టం. ఆయా వాహనాల ఓనర్లను గుర్తించి నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. రవాణా శాఖ అధికారులతో సమస్య ఎందుకులే అని వారు కిమ్మనకుండా మిగిలిన సొమ్మును కట్టేస్తున్న దాఖలాలు కూడా ఉన్నాయి.

రాత్రి వేళ కావడంతో డబ్బులిచ్చి వెళ్తున్న డ్రైవర్లు

ఉన్నతాధికారుల దృష్టికి విషయం

ఇప్పటి వరకు ఈ చెక్ రిపోర్టు వ్యవహారంపై అధికారికంగా ఎలాంటి ఫిర్యాదులు రానప్పటికీ.. ఈ స్కామ్ జరిగిందనటానికి ఇతర మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లకు ఆధారాలు కూడా లభించాయి. ఇటీవల కాలంలో తనిఖీల సందర్భంలో ఇతర రాష్ట్రాలకు చెందిన కొన్ని వాహనాలకు చెక్ రిపోర్టులలో జరిమానాలు కట్టలేదని తెలిపేలా పెండింగ్‌లో చూపిస్తున్నాయి. పెండింగ్ జరిమానాల గురించి ప్రశ్నిస్తే కార్యాలయం పనిచేయదు కాబట్టి.. జరిమానా డబ్బులను పలాన ఇన్‌స్పెక్టర్లకు చెల్లించామని చెబుతున్నారు. ఇటీవల కాలంలో తనిఖీలకు సంబంధించిన చాలా కేసులలో ఆయా రవాణా వాహనదారుల నుంచి ఇదే సమాధానం వస్తోంది. దీంతో కొంతమంది వాహన తనిఖీ అధికారులు ఈ విషయాన్ని రవాణా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టుగా తెలుస్తోంది. దీంతో రవాణా శాఖ ఉన్నతాధికారులు కూడా చెక్ రిపోర్టుల అంశాన్ని పరిశీలిస్తే భారీగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిసినట్లు సమాచారం. దీనిపై ఒకరిద్దరు ఇన్‌స్పెక్టర్లను అడగ్గా.. వారు జరిమానాలు కట్టకపోతే తమకు సంబంధం ఏమిటని ఎదురు ప్రశ్నించినట్టుగా తెలుస్తోంది.

డ్రైవర్ల బలహీనతను ఆసరాగా చేసుకుని..

రాత్రుళ్లు తనిఖీలు చేసేటపుడు జరిమానాకు గురైన రవాణా వాహనదారులు ఆఫీసులకు వెళ్లి కట్టలేరు. రవాణ వాహన డ్రైవర్, క్లీనర్‌కు చదువు లేకపోవటం వల్ల ఆన్‌లైన్‌లో కట్టే విధానం తెలియక పోవచ్చు. ఒక వేళ చదువుకున్నా.. దాని విధానం తెలియక గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంటుంది. ఏ రవాణా వాహనదారుడు కూడా తన వాహనాన్ని కార్యాలయం తెరిచే వరకు అక్కడే ఉంచే సాహసం చేయడు. ఒక వేళ వగటి సమయంలోనే తనిఖీ చేశారనుకున్నా.. ఇతర రాష్ట్రాల వాహనదారులకు రవాణా కార్యాలయాలు ఎక్కడ ఉంటాయో తెలియదు. భాష తెలియకపోవటం రకరకాల సమస్యల వల్ల ఆ డబ్బులను మోటారు వాహన తనిఖీ అధికారులకే ఇచ్చేసి వెళ్లిపోతున్నారు. లారీ యజమానులు కూడా ఇలాంటి ఇబ్బందులు ఉంటాయన్న ఉద్దేశంతో తమ డ్రైవర్లు, క్లీనర్ల చేతికి కొంత డబ్బు ఇచ్చి పంపిస్తుంటారు. దీంతో వారు ఇలాంటి తనిఖీల సందర్భంలో డబ్బులు కట్టేయమని డబ్బులు ఇచ్చేసి వెళ్లిపోతుంటారు. దీనిని ఆసరాగా చేసుకుని అనధికారికంగా కాంపౌండింగ్ ఫీజులను నొక్కేయటం, చెక్ రిపోర్టులలో చూపిన వాటికి రవాణా వాహన సిబ్బంది నుంచి పుచ్చుకున్న డబ్బులను కూడా స్వాహా చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ అంతులేని అవినీతిపై రవాణా శాఖ ఉన్నతాధికారులు విచారణ జరపాల్సిన అవసరం ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి సొమ్మును వెదజల్లి నచ్చిన చోట పోస్టింగ్‌లు వేయించుకున్న కొంతమంది మోటారు వాహనాల తనిఖీ అధికారులే ఈ కుంభకోణానికి పాల్పడ్డారన్న ఆరోపణలు వస్తున్నాయి.

బ్యాంకర్ల తీరు మారేనా!

సైబర్ నేరాల నియంత్రణలో బ్యాంకర్ల సహకారం అంతంత మాత్రమేనని పోలీస్ శాఖ నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. భారీగా నగదు బదిలీ చేస్తున్న ఖాతాదారుల నుంచి వివరాలు సేకరించాలని సమీక్షా సమావేశాల్లో విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదు. ఫలితంగా మూడు రోజుల కిందట ఓ ఎన్‌ఆర్ఐ మహిళ సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి కోట్ల రూపాయలు పోగొట్టుకుంది.

* సమీక్షా సమావేశాల్లో ఒక తీరు
* విధి నిర్వహణలో మరో తీరు
* సైబర్ కేసుల్లో పోలీసులకు సహకరించని బ్యాంకర్లు!



(ఆంధ్రజ్యోతి,విజయవాడ) : "సైబర్ నేరాలను అరికట్టడానికి సమష్టి కృషి అవసరం. బ్యాంకులకు వచ్చిన ఖాతాదారులు భారీ మొత్తంలో నగదును ఎవరికైనా పంపితే వారిని ఆరా తీయండి. ఎందుకోసం పంపుతున్నారో ప్రశ్నించండి. ఖాతాదారులు జరిగిన విషయం చెప్తే వారిని సైబర్ నేరం నుంచి తప్పించ వచ్చు" కొద్దిరోజుల కిందట జరిగిన సమీక్షా సమావేశం లో బ్యాంకర్లకు పోలీస్ కమిషనర్ చేసిన విజ్ఞప్తి ఇది.

* గురునానక్ కాలనీకి చెందిన ఓ ఎన్‌ఆర్ఐ మహిళకు డిజిటల్ అరెస్టు కాల్ వచ్చింది. సైబర్ నేరగాడు ఆమెతో నాలుగు గంటల పాటు వీడియోకాల్ మాట్లాడాడు. తర్వాత ఆమె గాయత్రీ నగర్‌లోని ఎస్‌బీఐ ఎన్ఆర్ఐ బ్రాంచ్‌కు వెళ్లింది. ఆర్టీజీఎస్ (రియల్ టైం గ్రాస్ సెటిల్‌మెంట్) దరఖాస్తును పూర్తి చేసి రూ.1.25 కోట్లు పంపింది. ఇది మూడు రోజుల క్రితం జరిగిన ఘటన.

నగరంలో ఒకరి తర్వాత మరొకరు సైబర్ నేరాల్లో భారీగా నగదును పోగొట్టుకుంటున్నారు. ఈ నేరగాళ్లకు చెక్ పెట్టడానికి పోలీసు శాఖ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. మరోపక్క సైబర్ సిటిజన్లను తయారు చేసే ప్రణాళికను అమలు చేస్తోంది. దీనితో పాటు బ్యాంకర్ల సహకారాన్ని తీసుకోవాలని భావించారు. ఇందులో భాగంగానే పోలీసులు బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహి స్తున్నారు. సైబర్ నేరాలు ఏవిధంగా జరుగు తున్నాయో వివరించడంతో దర్యాప్తులో సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావిస్తున్నారు. బ్యాంకర్లు, పోలీసులు సమన్వయంతో పట్టాలపై ప్రయాణం చేసినప్పుడు ఈ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని పోలీసుశాఖ భావిస్తుంది. పోలీసులతో నిర్వహించే సమావేశంలో రకరకాల ప్రశ్నలు వేసి ఆ క్షణం నుంచే సైబర్ క్రైంను నియంత్రించడానికి కంకణం కట్టుకున్నట్టు వ్యవహరించిన బ్యాంకర్లు ఆ తర్వాత షరా మామూలుగానే ప్రవర్తిస్తున్నారు. సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో పోలీసులు అడిగిన సమాచారం ఇవ్వడం లేదన్న ఆరోపణ చాలాకాలంగా ఉంది. పోలీసు కమిషనర్ కొద్దిరోజుల క్రితం బ్యాంకర్లతో ప్రత్యేకంగా ఒక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖాతాదారులు సైబర్ నేరగాళ్ల విసిరిన వలలో చిక్కకుండా ఏం చేయాలన్న దానిపై కొన్ని సూచనలు చేశారు. వాటిని కచ్చితంగా అమలు చేస్తామని బ్యాంకర్లు చెప్పారు. ఇందులో ప్రధానమైనవి రెండు అంశాలు ఉన్నాయి. ఎవరైనా ఖాతాదారులు వచ్చి భారీ మొత్తం నగదును వేరే ఖాతాకు బదిలీ చేయమని కోరినప్పుడు ఆ వివరాలను తెలుసుకోవాలని సూచించారు. అదేవిధంగా అంతకుముందు ఈ ఖాతాదారులు ఏమైనా ఎక్కువ మొత్తంలో లావాదేవీలు చేశారా అన్న విషయాన్ని పరిశీలించాలని చెప్పారు. సమావేశం ముగిసి బయటకు వచ్చిన తర్వాత బ్యాంకర్లు ఈ రెండు విషయాలను గాలికొదిలేశారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణే గురునానక్ కాలనీకి చెందిన ఎన్ఐఆర్ మహిళ రూ1.25 కోట్లను ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేయడం.

సమాచారం ఇవ్వడానికి నాన్చుడు

సైబర్ క్రైం పోలీసులు నమోదు చేసిన కేసుల్లో దర్యాప్తు మొత్తం సాంకేతికంగా ఉంటుంది. బాధితులు పోగొట్టుకున్న డబ్బులు ఏ ఖాతా నుంచి ఏయే ఖాతాలకు వెళ్లాయి అన్న వివరాలు బ్యాంకర్ల వద్ద మాత్రమే ఉంటాయి. సైబర్ కేసుల్లో బాధితులకు వివిధ రకాల బ్యాంకుల్లో ఖాతాలు ఉంటాయి. బాధితులు ఆన్‌లైన్‌లో బదిలీ చేశారా, గూగుల్, ఫోన్‌పేల ద్వారా బదిలీ చేశారా, నేరుగా అకౌంట్లో జమ చేశారా అన్న వివరాలు తెలుసుకుని పోలీసులు బ్యాంకర్లకు లేఖలు రాస్తారు. ఆయా అకౌంట్‌లకు సంబంధించి సమాచారం ఇవ్వాలని అడుగుతారు. ఆ ఖాతాల నుంచి డబ్బులు ఏవిధంగా ఏయే ఖాతాలకు వెళ్లాయో సమాచారం ఇవ్వాలని అడుగుతారు. ఈ సమాచారం ఇవ్వడానికి బ్యాంకర్లు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఒక అకౌంట్ లావాదేవీల వివరాలు ఇవ్వడానికి నెలల తరబడి సమయం తీసుకుంటున్నారు. దీనితో సాంకేతికంగా సాగాల్సిన దర్యాప్తు మందగిస్తోంది. ఒకపక్క బాధితులు తమకు న్యాయం చేయాలని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు.

గోల్డెన్ అవర్‌లో కాల్ చేస్తే మేలు

గుండెపోటుతో కుప్పకూలిపోయిన రోగిని సకాలంలో ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకుంటాడు. దీన్నే గోల్డెన్ అవర్‌గా వైద్యులు వ్యవహరిస్తారు. అటువంటి గోల్డెన్ అవర్ సైబర్ నేరాల్లో ఇరుక్కున్న బాధితులకు ఉంది. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వెంటనే 1930కి కాల్ చేయాలి. డబ్బులు పంపిన తర్వాత మోసపోయామని తెలియగానే ఈ పని చేయాలి. అప్పుడు అకౌంట్లు ఫ్రీజ్ అయి, డబ్బులు తిరిగి వచ్చే అవకాశం ఉంటుంది. 1930కి ఫోన్ చేసి వెంటనే సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.





చదువొక్కటే బాల్యం కాదు

* సృజనను పెంచుకోవాలి : ఎమ్మెల్సీ లక్ష్మణరావు
* ముగిసిన అమరావతి బాలోత్సవం

6లో

చైతన్యపరిచేదే ఉత్తమ సాహిత్యం

* ఎక్స్‌రే అవార్డుల ప్రదానోత్సవంలో సాహితీవేత్త ప్రసాద్

భక్తజన కీలాద్రి

6లో

* దుర్గామల్లేశ్వరుల దర్శనానికి పోటెత్తిన భక్తులు


ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

భక్తజన కీలాద్రి

» దుర్గామల్లేశ్వరుల దర్శనానికి పోటెత్తిన భక్తులు

వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో ఆదివారం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కార్తీకమాసం కావటంతో దుర్గా మల్లేశ్వరస్వామిని భక్తులు దర్శించుకు



న్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. చండీహోమం, శ్రీచక్ర నవావరణార్చన, లక్ష కుంకుమార్చన, ఖడ్గమాల, శాంతి కళ్యాణం తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. ఈవో రామారావు ఆదేశాల మేరకు అధికారులు భక్తుల శీఘ్ర దర్శనానికి ఏర్పాట్లు చేశారు.

దుర్గమ్మ సేవలో గరికపాటి నరసింహారావు



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ఆదివారం ప్రవచనకర్త, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు దర్శించుకున్నారు. ఆయనకు ఈవో రామారావు, అర్చకులు సాదర స్వాగతం పలికారు.

అన్నవితరణకు విరాళం

హైదరాబాద్ కూకట్‌పల్లి సాయిబాబానగర్‌కు చెందిన మోటుపల్లి సురేశ్ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దుర్గమ్మను దర్శించుకుని అన్నవితరణ నిమిత్తం రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో అధికారులకు అందజేశారు.

అమ్మవారికి కాసులపేరు కానుక



విజయవాడ గొల్లపూడి నివాసి ఎ.సూరిబాబు కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారికి అలంకరణ నిమిత్తం 65 గ్రాముల బంగారు కాసుల పేరు కానుకగా అందజేశారు.

అఖండ ధ్యాన యజ్ఞం

దుర్గగుడిలో ఆదివారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు 12 గంటల పాటు అఖండ ధ్యానయజ్ఞ కార్యక్రమం జరిగింది. ధ్యాన యజ్ఞంలో పలువురు మహిళలు, పురుషులు పాల్గొన్నారు.

సూర్యోపాసన సేవ



లోకక్షేమం కోరుతూ సకల జనుల ఆయురారోగ్యాలను కాపాడలంటూ సంకల్పం చెప్పి దేవస్థానం అర్చకులు, వేదపండితులు ఆదివారం సూర్యోపాసన సేవ చేశారు. సూర్యనారాయణ మూర్తికి అర్చనలు చేశారు. మంత్రపుష్పం, హారతులు సమర్పించి భక్త జనులకు ఆశీస్సులు అందజేశారు.



కళా వేదిక పై శాస్త్రీయ నృత్యం

కళావేదికపై ఆదివారం విశాఖపట్నానికి చెందిన నవ్యా నాట్యమండలి బృందం శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేసింది. మహాగణపతి, విజయకనకదుర్గ, నవదుర్గా, అష్టలక్ష్మీ, ప్రణవలయ తదితర కీర్తనలకు చక్కని అభినయంతో ఆహుతులను అలరించారు. కళాకారులను ఈవో అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు.


కనకదుర్గానగర్‌లో దేవస్థానానికి చెందిన షాపు

షాపు ఖాళీచేయమంటే కోర్టుకు ..

» దుర్గగుడికి రూ. 6 లక్షలకు పైగా అద్దె బకాయి

వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానానికి చెందిన షాపు లీజు పూర్తికావడంతో ఖాళీ చేయమన్నందుకు అద్దెదారుడు కోర్టుకు వెళ్లాడు. దేవస్థానానికి చెల్లించాల్సిన అద్దె కూడా చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాడు. దుర్గగుడి అధికారులు 2021 సంవత్సరం చివరిలో కనకదుర్గానగర్‌లో అల్పాహారం, టీ, కాఫీ, కూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్స్, ఐస్‌క్రీమ్‌లను మొబైల్ వాహనం ద్వారా విక్రయించుకునేందుకు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంలో విశాఖపట్నం మరిడిమాంబ ఆలయ సమీపంలోని కనకాల వీధికి చెందిన సూరిశెట్టి గణేశ్ ఏడాదికి రూ.11.25 లక్షల అద్దె, అదనంగా జీఎస్టీ 18 శాతం దేవస్థానానికి చెల్లించే విధంగా రెండేళ్ల పాటు లీజుకు పాడుకున్నాడు. రెండో సంవత్సరానికి మొదటి సంవత్సరం లైసెన్స్ సొమ్ముపై పదిశాతం అదనంగా చెల్లించాలి. సుమారు మూడు నెలల క్రితం అతడి లీజు కాలపరిమితి ముగియడంతో అధికారులు షాపు ఖాళీ చేయాలని సూచించారు. అద్దెదారుడు షాపు ఖాళీ చేయకుండా కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఈ ఏడాది డిసెంబరు 31 వరకు షాపు నిర్వహించుకునేందుకు గడువు ఇచ్చింది. అయితే బకాయి పడ్డ సుమారు రూ.6లక్షలకు పైగా చెల్లించకుండా అద్దెదారుడు కాలయాపన చేస్తున్నాడు. ఈ వ్యవహారంపై ఈవో కేఎస్ రామారావును వివరణ కోరగా, షాపు అద్దెదారుడు లీజు కాలపరిమితి ముగియటం వాస్తవమేనని, దేవస్థానానికి బకాయి చెల్లించాలని తెలిపారు. ఈ వ్యవహారం కోర్టులో ఉన్నందున లీగల్‌గా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చదువొక్కటే బాల్యం కాదు

» పిల్లల్లో సృజనాత్మకత పెంచాలి

» వారి వికాసానికి ప్రత్యేక మండలి ఏర్పాటు చేయాలి

» ఎమ్మెల్సీ లక్ష్మణరావు డిమాండ్

మొగల్రాజపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నేటి పోటీ ప్రపంచంలో చదువు ప్రధానం అయిందని, కానీ పిల్లల్లో మానసిక వికాశం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెరగాలంటే వారిని క్రీడలు, సాంస్కృతిక కళారంగాల్లో ప్రతిభను నిరూపించుకునే విధంగా అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సహించాలని శాశనమండలి



సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు సూచించారు. ఇందుకు తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు, ప్రభుత్వాలు కూడా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వాలుచేయాల్సిన పనిని బాలోత్సవ కమిటీలు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాల్లో కంటే ప్రభుత్వ పాఠశాల్లో చదువుకునే పిల్లలే ఎక్కువగా ఉన్నారని, వారిని చదువుతో పాటు వివిధ రంగాల్లో ప్రోత్సహించేలా ప్రత్యేక మండలిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. అమరావతి బాలోత్సవం 7వ పిల్లల పండుగ మూడు రోజుల కార్యక్రమం ఆదివారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 78 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో, 37 లక్షల మంది ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారని చెప్పారు. కొత్త గూడెం బాలోత్సవ వ్యవస్థాపకులు వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ, ప్రతిమనిషి జీవితంలో బాల్యం ఒక అపురూప ఘట్టం అని అన్నారు. బాల్యం మొత్తం చదువు అంశమే ఉంటే వారిలో సృజనాత్మక శక్తి ఉండదన్నారు. ఒకపుడు ఆటలు, చదువు రెండూ బాల్యంలో ఉండేవని చెప్పారు. పెద్దలంతా కలిసి ఇపుడు బాలోత్సవం పేరిట నిర్వహిస్తుంటే తమ బాల్య స్మృతులు గుర్తుకు వస్తున్నాయన్నారు. బాలోత్సవంలో పాల్గొనే పిల్లల్లో మార్పు వస్తుందని, జీవితం పట్ల ఒక దృక్పథం ఏర్పడుతుందని, భవిష్యత్‌ను నిర్మించుకోవడంలో మంచి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కాకినాడ క్రియ పిల్లల పండగ అధ్యక్షులు ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు మాట్లాడుతూ, పిల్లలకు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు లేకుండా చదువులో ఏకాగ్రత, పరిపూర్ణత ఉండదన్నారు. కెనరాబ్యాంకు జీఎం సీజే విజయలక్ష్మి, ఏపీ యంఎస్‌యంతఃఈ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు బాయన వెంకట్రావు తదితరులు మాట్లాడారు. మూడోరోజు మాప్, సైన్సు ఎగ్జిబిషన్, డిబేట్, క్విజ్, తెలుగులో మాట్లాడటం, పద్య భావం, కథ చెప్పడం, మెమరీ టెస్ట్, నాటకీకరణ, ఇన్‌స్ట్రుమెంట్‌మ్యూజిక్, ఏకపాత్రాభినయం, జానపదగీతాలాపన,కోటాలటం మూకాభినయం పోటీలు నిర్వహించారు. బాలోత్సం అధ్యక్షులు ఎస్వీ రామరాజు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావులు విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో 400 పాఠశాలల నుంచి 12వేలమంది పిల్లలు, యాజమాన్యాలు పాల్గొన్నాయి.


పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

మంత్రశక్తి వైజ్ఞానికం

» పద్మశ్రీ గరికపాటి నరసింహారావు



వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మంత్రశక్తి పూర్తిగా వైజ్ఞానికమని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు అన్నారు. ఎస్కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ, దుర్గామల్లేశ్వర దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో గరికపాటి నరసింహారావు ప్రవచన కార్యక్రమాలను రెండు రోజులపాటు నిర్వహించారు. కేబీఎన్ కళాశాల వేదికగా సాగిన ఈ కార్యక్రమంలో ఆదివారం ఆయన కనకదుర్గానందలహరిపై ప్రవచనం చేశారు. అనేక అంశాలపై ఆయన మాట్లాడుతూ, మంత్రశక్తి పూర్తిగా వైజ్ఞానికమైనదని, మంత్ర, తంత్ర, యంత్రాలలో ఉన్న రహస్యాలను సోదాహరణంగా వివరించారు. విశాలాక్షి, కామాక్షి, కనకదుర్గ, ఇలా ఎన్నో పేర్లతో అవతారాలు దాల్చినప్పటికీ లోక రక్షణకోసమేనని సోదాహరణంగా వివరించారు. తల్లి రూపంలో జగన్మాత సృష్టిలో సమస్త ప్రాణులను కాపాడుతున్నదన్నారు. పరమ భాగవతాదులకు ఇబ్బందులు కలిగినప్పుడు ఆమె అనేక రూపాల్లో వచ్చి రక్షించిన తీరును ఆయన పేర్కొన్నారు. పురుషులు ఎంత గొప్ప వారైనప్పటికీ భార్య లేనిదే పుణ్యం సంపాదించుకోలేడని, దాంపత్య జీవనంలో భార్యాభర్తల శరీరాలు వేరైనప్పటికీ, మనస్సులు మాత్రం ఒక్కటిగానే ఉంటాయని చెప్పారు. బిడ్డనుంచి తల్లి ఏమీ ఆశించకుండా ప్రేమను ఎలా పంచుతుందో శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు కూడా భక్తులైన తన పిల్లలకు ప్రేమ పంచుతుందని చెప్పారు. అమ్మవారు తల్లితో సమానమని, జగన్మాతను ఆరాధించిన ఆదిశంకరాచార్యులు, భక్త పోతన, కాళిదాసు వంటి వారు రాసిన పద్యాలను, వాటి అర్థాలను వివరించారు. ముగింపు కార్యక్రమంలో గరికపాటిని సుముచిత రీతిన సత్కరించారు. దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు, కేబీఎన్ కాలేజీ సెక్రటరీ టి.శ్రీనివాస్, హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రెసిడెంట్ టి.శేషయ్య, గోళ్ల బాబ విజయకుమార్, దుర్గగుడి అధికారులు, నరసింహారావును సత్కరించిన వారిలో ఉన్నారు.


మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులతో సినీ హీరో, వైఎంకే చైర్మన్ సుమన్

ఆత్మరక్షణపై యువత దృష్టి పెట్టాలి

» సినీ నటుడు సుమన్

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆత్మరక్షణ విద్యలపై విద్యార్థులు, యువత దృష్టిపెట్టాలని సినీ హీరో, వైఎంకే అకాడమి చైర్మన్ సుమన్ అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని గుజ్జుల సరళాదేవి కళ్యాణ మండపంలో వైఎమ్‌కే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. కార్యక్రమానికి సుమన్ ముఖ్యతిథిగా హాజయయ్యారు. కరాటే, కుంగ్‌ఫూ, టైక్వాండో, మార్షల్ ఆర్ట్స్ విభాగాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సుమన్ మహుమతులు, సర్టిఫికెట్‌లు, బెల్ట్‌లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను తాను రక్షించుకోవడానికి కరాటే వంటి మర్మకళలు నేటి సమాజంలో అవసరమని అన్నారు. కార్యాక్రమ నిర్వాహకులు వైఎమ్‌కే అకాడమీ టీమ్ ప్రముఖులు రూఫాస్ పాల్, డీ శ్రీనివాస్, జీ ప్రకాశ్‌రావులను ఆయన అభినందించారు.

ప్రజల్ని చైతన్యపరిచేదే ఉత్తమ సాహిత్యం

విజయవాడ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్ని నిద్రావస్థ నుంచి మేల్కొలిపి చైతన్యపరిచే రచనలు రావాలని, అవి ఉత్తమ సాహిత్యంగా ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలుస్తాయని ప్రముఖ సాహితీవేత్త, ఐఆర్ఎస్ అధికారి మొండెపు ప్రసాద్ అన్నారు. ఆదివారం ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్వర్యంలో ఎక్స్‌రే మాసపత్రిక జాతీయస్థాయిలో నిర్వహించిన కవితల పోటీ విజేతలకు అవార్డుల బహుకరణ సభ విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాలులో జరిగింది. సభలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, కవి సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. కాలక్షేపం కోసం కవిత్వం కాదు, జీవితపు లోతుల్ని దర్శించేలా కవిత్వం వుండాలన్నారు. జిల్లా సెషన్స్ న్యాయాధికారి మంగారి రాజేందర్ (జింబో) ప్రసంగిస్తూ కవి అధ్యయనం ద్వారా మంచి సాహితీ సృజన జరుగుతుందన్నారు. కవితల పోటీల్లో ప్రధాన విజేత కరీంనగర్‌కు చెందిన నామని సుజనా దేవిని రూ.12 వేల నగదు, శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఉత్తమ అవార్డు గ్రహీతలుగా కోరాడ అప్పలరాజు (అనకాపల్లి), చొక్కర తాతారావు (విశాఖపట్నం), ఎస్.లహరి, రాధశ్రీ (హైదరాబాద్) రేపాక రఘునందన్ (తిరువూరు), వెంకు సనాతని (బాపట్ల), పోతూరి సీతారామరాజు (కాకినాడ), కమలేష్ (శంకరపల్లి, రంగారెడ్డి జిల్లా), రమాదేవి (స్టేషన్ ఘనాపూర్), జగన్నాధం రామమోహన్ (కొత్తూరు, నెల్లూరు)లను సత్కరించారు. సంచికను శ్రీశ్రీ సాహిత్యనిధి కన్వీనర్ సింగంపల్లి అశోక్ కుమార్ ఆవిష్కరించారు. ఎక్స్‌రే మాసపత్రిక సంపాదకులు కొల్లూరి సభకు అధ్యక్షత వహించారు. సంస్థ ఉపాధ్యక్షులు కందికొండ రవికిరణ్, ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు, కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య, పొత్తూరి సీతారామారావు పాల్గొన్నారు.


కవులను సత్కరిస్తున్న మొండెపు ప్రసాద్, జిల్లా న్యాయాధికారి మంగారి తదితరులు

రామ్మూర్తినాయుడు మృతి పార్టీకి తీరని లోటు

» వేర్వేరు చోట్ల టీడీపీ నేతల నివాళి

వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడుకు పలువురు టీడీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్మూర్తినాయుడు చేసిన సేవలను కొనియాడారు. ఆదివారం ఆటోనగర్‌లోని


రామ్మూర్తినాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్

జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యానిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ తదితరులు రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నేతలు పి.కిషోర్ బాబు, యార్లగడ్డ రమేష్, సీహెచ్ కిషోర్, ఎం.విజయకుమార్, డి.వెంకటేశ్వరరావు, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

● గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, ఎస్సీసెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ కరిముల్లా తదితరులు నారా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గంపలగూడెం మండల తెలుగుయువత అధ్యక్షుడు మాని కొండ రామకృష్ణ, పటమట సతీష్ చంద్ర, పి.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

● హనుమాన్‌పేటలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి గన్నేప్రసాద్ రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 52వ డివిజన్ కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, యలమంచిలి శ్రీనివాసరావు, కరణం జగన్మోహన్, బి.డి. ప్రసాద్, బి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఆటోనగర్ జిల్లా టీడీపీ కార్యాలయంలో..

● వించిపేటలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ నారా రామ్మూర్తి నాయుడుకు ఘన నివాళులు సమర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బి.కనకారావు, బి.సాయి సుధాకర్, అబ్దుల్ సత్తార్, ఎ.మోహన్‌రావు, ఎస్.భానుప్రకాష్, దేవర కొండ చక్రవర్తి, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మహోన్నత వ్యక్తిని కోల్పోయింది

భవానీపురం : టీడీపీ కుటుంబం మహోన్నత వ్యక్తి



నారా రామ్మూర్తినాయుడును కోల్పోయిందని, ఆయన ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్ అన్నారు. విజయవాడ పశ్చిమలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పత్తి నాగేశ్వరరావు, బొడ్డుపల్లి శ్రీనివాసరావు, కొనికి కొండయ్య, ముదిగొండ శివాజీ, జాలాది వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకులు వీవీకే నరసింహారావు, తుమ్మలపెంట శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరరావు తదితరులు నివాళి అర్పించారు.

రామ్మూర్తినాయుడు మృతి విచారకరం..

ధర్నాచౌక్ : నారా రామ్మూర్తినాయుడు మృతిపట్ల ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు, రామ్మూర్తి నాయుడు కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆయన ఎనలేని సేవ చేశారన్నారు. ప్రజల సంక్షేమానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు.


కానుమోలు వద్ద దగ్ధమవుతున్న కారు

రోడ్డుపై కారు దగ్ధం!

» ప్రయాణికులకు తప్పిన ప్రాణాపాయం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటల్లో ఓ కారు (ఏపీ 28 సీజీ 5649) చిక్కుకుని దగ్ధమైన ఘటన బాపులపాడు మండలం కానుమోలు గ్రామం వద్ద ఆదివారం జరిగింది. విజయవాడకు చెందిన తండ్రీ కొడుకులు ఏలూరులోని స్నేహితుడి వద్ద కారు తీసుకొని పెదన పెళ్లికి వెళ్లారు. తిరిగి పెదన నుంచి ఏలూరు వెళుతుండగా కానుమోలు వద్ద కారులోంచి మంటలు చెలరేగాయి. దీంతో తండ్రీకొడుకులిద్దరు కారు దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. జంక్షన్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. జంక్షన్ ఎస్సై-2 లక్ష్మీనరసింహమూర్తి ట్రాఫిక్ పునరుద్ధరించారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

చిట్టినగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : ఇనుప చువ్వలను తీసుకు వెళుతుండగా విద్యుత్ తీగలు తగలడంతో వ్యక్తిదుర్మరణం చెందాడు. వైఎస్సార్ కాలనీ బ్లాక్ నంబరు172కి చెందిన చల్లా రత్నకుమార్(25) కూలీ పనులు చేస్తుంటాడు. రెండు రోజులుగా బ్లాక్‌లో ప్లంబింగ్ పనులు చేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇనుప పైపులు పైకి తీసుకెళ్తుండగా 11కేవీ విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురయ్యాడు. ఘటనలో రత్నకుమార్ అక్కడికక్కడే చనిపోయాడు. కేసును కొత్తపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ కార్యకర్తపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

వన్‌టౌన్ : అనంతపురం జిల్లా, బొమ్మనహాల్ మండలం, చంద్రగిరి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కృష్ణమూర్తి శెట్టిపై వేటకొడవళ్లతో దాడిచేసి హత్యాప్రయత్నించిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినశిక్ష పడేవిధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం పోలీసు అధికారులను కోరారు. ఈ మేరకు విజయవాడలోని రాష్ట్ర కార్యాలయం నుంచి ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణమూర్తి శెట్టి కుటుంబం ధైర్యంగా ఉండాలని, ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. కృష్ణమూర్తి శెట్టిపై అత్యంత పాశవికంగా దాడిచేసిన ఘటనలో పాత్రదారులు, సూత్రదారులు అందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణమూర్తి శెట్టికి మెరుగైన వైద్యం అందించాలన్నారు.

ప్రభుత్వానికి, న్యాయవ్యవస్థకు మధ్య విభజన రేఖ అవసరం

» హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.సుధ

ధర్నాచౌక్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, సామ్యవాదం, లౌకిక వాదం రాజ్యాంగంలో మౌలిక అంశాలని ఈ మధ్య దీనికి విరుద్ధంగా ఉన్నత న్యాయస్థానాలు తీర్పునిస్తున్నాయని మానవ హక్కుల వేదిక(హెచ్ఆర్ఎఫ్) రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.సుధ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వేదిక ఉమ్మడి కృష్ణాజిల్లా ఆరో మహాసభలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వానికి, న్యాయ వ్యవస్థకు మధ్య స్పష్టమైన విభజన రేఖ ఉండాలన్నారు. దీన్ని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రాథమిక విద్యారంగం సంక్షోభంలో ఉందని హెచ్ఆర్ఎఫ్ సభ్యురాలు, విద్యారంగ నిపుణురాలు ఎం.శ్రావ్య అన్నారు. ప్రైవేట్ రంగానికి పెద్దపీట వేయడమే దీనికి కారణమన్నారు. ప్రభుత్వమే ప్రాథమిక విద్యారంగాన్ని నడుపుతూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్యను పెంచడం ద్వారా ఈ రంగాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్ల డం సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి వై.రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నేత టి.అంజనేయులు, కవి మొహి ద్దీన్, ఉషా డానీ, వేదిక సభ్యులు జి.రోహిత్, శ్రావణి, రోహిత్‌చంద్ర పాల్గొన్నారు.

'అంతరంగ వీక్షణం' ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఠాగూర్ గ్రంథాలయంలో మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్వర్యంలో కొమ్మవరపు విల్సన్‌రావు సాహితీవేత్తలతో నిర్వహించిన ముఖాముఖీల సంకలనం 'అంతరంగ వీక్షణం' గ్రంథావిష్కరణ చేశారు. సభకుసాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ అధ్యక్షత వహించారు.

యోగా మార్గంతో శాంతి, సౌభాగ్యాలు

» రీజనల్ ఇన్‌చార్జి రాజయోగిని బ్రహ్మకుమారి సవిత

మచిలీపట్నం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపిత బ్రహ్మకుమారి యోగమార్గం అనుసరించడం ద్వారా శాంతి, సౌభాగ్యాలు చేకూరుతాయని వరంగల్, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల రీజనల్ ఇన్‌చార్జి రాజయోగిని బ్రహ్మకుమారి సవిత అన్నారు. మచిలీపట్నం ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాఖ 40వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం సుమ కన్వెన్షన్ హాలులో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల బ్రహ్మకుమారిలు, యోగసాధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజయోగిని బ్రహ్మకుమారి సవిత మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో ఎంత ధనమున్నా శాంతికి దూరంగా ఉన్నారన్నారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయంలో నేర్పే యోగసాధన వల్ల మానవాళికి శాంతియుత జీవనం చేకూరుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వందలాది శాఖల్లో నిర్వహిస్తున్న ఈశ్వరీయ విశ్వవిద్యాలయాల్లో ప్రతి రోజూ రాజయోగాన్ని బోధిస్తున్నారన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు వ్యాపారులు, విద్యావేత్తలు రాజయోగాన్ని అభ్యసిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుకుమారి శాంతతో పాటు సుధాకరమూర్తి తదితరులు ప్రసంగించారు. కేకులు కట్ చేశారు. ఈ సత్సంగంలో ధ్యాన మార్గంపై పలువురు ప్రసంగించారు.


జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభిస్తున్న బ్రహ్మకుమారీలు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 565

చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం

పటమట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ టీచర్స్ కాలనీ ఫన్‌టైమ్స్ క్లబ్‌లో ఆదివారం పీకబూ చిల్డ్రన్స్ క్లినిక్, గిగిల్స్ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో చిన్నారులకు ఆరోగ్యపరీక్షలు, వృద్ధి విలువల అంచనా, దంతపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అందరికీ ఆరోగ్యమైన భవిష్యత్ కల్పించాలన్న లక్ష్యంతో ఇలాంటి ఉచిత శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు పీకబూ చిల్డ్రన్స్ క్లినిక్ వైద్యురాలు డాక్టర్ అడుసుమిల్లి గౌతమి, గిగిల్స్ డెంటల్ కేర్ వైద్యురాలు డాక్టర్ హనీష తెలిపారు. ఈ శిబిరంలో విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలకు తీసుకుని పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరి సమస్య అయి ఉండాలి.

మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602

సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి

ముఠా కార్మికుడి ఇంట్లో చోరీ

వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఊర్మిళానగర్‌లో ఉంటున్న ముఠా కార్మికుడి ఇంటిలో చోరీ జరిగిందని ఆదివారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఊర్మిళానగర్ ఆటో స్టాండ్ సమీపంలో తాటి గురవయ్య కుటుంబం ఉంటోంది. గురవయ్య ముఠా కార్మికుడు. అతని భార్య స్వాతి భవానీపురంలోని సమోసా తయారీ కంపెనీలో పని చేస్తోంది. శనివారం ఉదయం గురవయ్య కూలి పను లకు వెళ్లగా, స్వాతి పిల్లలను స్కూల్‌కు తీసుకు వెళుతూ ఇంటికి తాళం వేసి, ఆ తాళాన్ని వరండా లోని స్కూల్ షూలో భద్రపరిచింది. సాయంత్రం 5 గంటలకు ఇంటికి వెళ్లి బంధువుల శుభకార్యక్రమానికి వెళ్లటానికి బీరువా తెరచి చూడగా బట్టలు చిందర వందరగా పడి ఉన్నాయి. బీరువాలో భద్రపరచిన బంగారపు నెక్లెస్, నానుతాడు, రెండు చిన్న ఉంగ రాలు, జత చెవిదిద్దులు చోరీ అయినట్టు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రామ్మూర్తినాయుడు చిరస్మరణీయుడు




రామ్మూర్తినాయుడి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గద్దె దంపతులు, ఏపీఐఐసీ కాలనీ వాసులతో గద్దె

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు చిరస్మరణీయుడని, ఆయన్ని టీడీపీ కార్యకర్తలు ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం రామ్మూర్తినాయుడు చిత్రపటానికి గద్దె రామ్మోహన్ దంపతులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గద్దె మాట్లాడుతూ ఆయన ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు తానూ కూడా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాయని గుర్తు చేశారు. ఏనాడు ముఖ్యమంత్రి తమ్ముడిననే భావం ఆయనలో ఉండేది కాదన్నారు. జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ మాట్లాడుతూ రామ్మూర్తినాయుడు మరణం పార్టీకి తీరని లోటన్నారు. దయాల శిరీష, గాంధీ, చలసాని రమణ, తలపాటి ప్రసాద్, కొండేటి వెంకట్రావు, నడికుప్పల రవి, తెంటు రాజేష్ పాల్గొన్నారు.

సురేష్‌కు జీవితకాల సభ్యత్వం

స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం అయప్పనగర్‌కు చెందిన పోతినేని సురేష్ రూ.లక్ష చెల్లించి టీడీపీ జీవితకాల సభ్యత్వాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చేతులమీదుగా తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని గద్దె అభినందిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాపాడేది టీడీపీయేనని, సభ్యత్వ నమోదు ఒక ప్రపంచ రికార్డు



సభ్యత్వం తీసుకుంటున్న పోతినేని, కొప్పోలు

సృష్టించిందని, తక్కువ సమయంలో అత్యధిక సభ్యత్వాలు తీసుకున్నారన్నారు. గద్దె క్రాంతికుమార్, పోతినేని శ్రీనివాస్, మేదరమెట్ల నారాయణ పాల్గొన్నారు.

కార్యకర్తల బలమే టీడీపీకి వెన్నెముక

రాణిగారితోట: కార్యకర్తల బలమే తెలుగుదేశం పార్టీకి వెన్నుముక అని తెలుగుదేశం పార్టీ యువనేత గద్దె క్రాంతి అన్నారు. రాణిగారితోట 17వ డివిజన్‌లో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్న వారికి సభ్యత్వ కార్డులు అందజేశారు. డివిజన్ నేతలు రాయి రంగమ్మ, ముని పోలిపల్లి, కొప్పోలు శ్రీనివాస చౌదరి, పల్లా సాగర్, మొకర ఆదిబాబు, మందుల వీరాస్వామి, మొకర సోమినాయుడు, పుట్ల రమణ పాల్గొన్నారు.

ఏపీఐఐసీ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

భారతీనగర్: నియోజకవర్గ పరిధిలోని 4వ డివిజన్ ఏపీఐఐసీ కాలనీలోని సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆదివారం ఏపీఐఐసీ కాలనీలో ఆయన పర్యటించి కాలనీ వాసుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాగుతూ కాలనీలోని ఇళ్లస్థలాల రెగ్యులైజేషన్ గురించి అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా ఆ ప్రక్రియను పూర్తయ్యేలా చూస్తామన్నారు. కాలనీ అధ్యక్షుడు పాతూరి సాంబశివరావు, గొల్లపూడి నాగేశ్వరరరావు, రెడ్డి బాబు, అయ్యప్ప రెడ్డి, కత్రి నెహ్రూ, అబ్దుల్ కలామ్, సురేష్ పాల్గొన్నారు.



బస్టాండా.. పార్కింగ్ స్థలమా..!

భారతీనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుణదల మద్ది రావమ్మతల్లి గుడి సెంటర్ వద్ద ఉన్న బస్టాండ్ అక్రమ పార్కింగ్ స్థలంగా మారింది. బస్టాండ్ సమీపంలోని పలువురు తమ వాహనాలను బస్టాండ్‌కు ఎదురుగా పార్కింగ్ చేస్తున్నారు. ఈ వాహనాలు బస్టాండ్‌లోకి ప్రయాణికులు వెళ్లడానికి అడ్డంగా ఉండడంతో చేసేది లేక ప్రయాణికులు ఎండలో నిలబడాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఐదో నెంబర్ రోడ్డులోనూ..

5వ నెంబర్ రోడ్డులో అక్రమ పార్కింగ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సర్వీస్ రోడ్డు రమేష్ జంక్షన్ నుంచి సున్నపుబట్టీల సెంటర్ వరకు ఉంది. నగరంలోని ప్రధాన రోడ్లలో ఐదో నెంబర్ రోడ్డు ఒకటి. ఈ రోడ్లో వరలక్ష్మీ నగర్, ఎల్ఐసీ కాలనీలకు ప్రధాన రహదారి కావడంతో పలు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలున్నాయి. దీంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డులో 5వ నెంబరు బస్ రాకపోకలు సాగిస్తోంది. రమేష్ ఆసుపత్రికి వైద్య కోసం కోసం వచ్చే వారు తమ వాహనాలను ఈ ప్రాంతంలో రోడ్డుకిరువైపుల నిలిపేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఈ వాహనాలు గంటల తరబడి ఉండడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.





అమరావతి వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బొప్పన భవకుమార్, నిమ్మల జ్యోతిక

సామాజిక సేవను బాధ్యతగా తీసుకోవాలి

● మెడికల్ క్యాంపు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ఆదివారం 21వ డివిజన్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు వీఎంసీ ఉన్నత పాఠశాల ఆవరణలో అమరావతి వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును ఎమ్మెల్యే గద్దె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్కూల్ గ్రౌండ్‌లో ఉదయం పూట వాకింగ్ చేసేవారు ఒక సంఘంగా ఏర్పడి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అమరావతి వాకర్స్‌క్లబ్ అధ్యక్షురాలు నిమ్మల జ్యోతిక ఆధ్వర్యంలో సంఘం సభ్యులు వాకింగ్ చేయడమే కాకుండా ఈ గ్రౌండ్‌కు పరిశుభ్రమైన వాతావరణం ఏర్పాటు చేసి స్థానికులందరికీ ఉపయోగపడేలా మైదానాన్ని తయారు చేశారని కొనియాడారు. మణిపాల్ హాస్పటల్ వారు ఇలా మల్టీస్పెషాలిటీ సేవలను కృష్ణలంక వాసులకు ఉచితంగా అందజేయడానికి ఈ మెడికల్ క్యాంపును నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ సహకారంతో స్కూల్ గ్రౌండ్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. టీడీపీ నేత బొప్పన భవకుమార్, అమరావతి వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మల జ్యోతిక, జనసేన పార్టీ తూర్పు నియోజకవర్గ కన్వీనర్ అమ్మిశెట్టి వాసు, ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తొండెపు హనుమంతరావు, టీడీపీ నేతలు జి.నామేశ్వరరావు, కొర్రా అప్పన్న, కేశనం భావన్నారాయణ, జనసేన నేతలు పోతిరెడ్డి అనిత, పోతిరెడ్డి రమణ, ముళ్లపూడి నాగేశ్వరరావు, వెన్నా శంకర్, పసుపులేటి నాగేశ్వరరావు, మట్టా భాస్కరరావు, బాసా రవికుమార్, అయితా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాలధారులకు మహాప్రసాదం

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: కార్తీకమాసంలో భక్తులు అయ్యప్ప మాలధారణ చేస్తుంటారు. వీరి ఆహార అవసరాలు తీర్చటాన్ని ఎంతోమంది అదృష్టంగా భావిస్తుంటారు. దాతలు, శ్రీ ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో పటమట రైతుబజార్ ఎదురుగా వేలాది మంది మాలధారులకు పదేళ్లుగా అన్నవితరణ చేస్తున్నారు. ఇక్కడ ఉదయం అల్పహారానికి 3వేల మంది, మధ్యాహ్నం భోజనానికి 5 నుంచి 6వేల మంది మాలధారులకు నిత్యాన్నదానం (భిక్ష రూపంలో) నిర్వహిస్తుండటం విశేషం. ఇందుకోసం నిర్వాహకులు ప్రత్యేకంగా మండపాన్ని నిర్మించి వంద మంది స్వాములతో పీఠాన్ని ఏర్పాటు చేశారు. తమ ఆకలి తీర్చేందుకు కృషి చేస్తున్న శ్రీ ధర్మశాస్త్ర సేవా సమితి సహకారం మరువలేనిదని మాలధారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మాలధారులకు కడుపు నింపడమే లక్ష్యమని గురుస్వామి కంఠమనేని వేణుగోపాల్ అన్నారు. స్వామివారి కరుణ తమపై ఉండడంతో ఆకలి అని వచ్చిన ప్రతి మాలధారుడి కడుపు నింపడమే శ్రీ ధర్మశాస్త్ర సేవా సమితి పదేళ్లుగా ఆచరిస్తున్న నియమం అని అన్నారు.

రాణిగారితోటలో ఘనంగా అయ్యప్ప పడిపూజ

రాణిగారితోట: స్థానిక ఫిలిప్స్ రోడ్డులో అయప్ప స్వామి పడిపూజ ఆదివారం ఘనంగా నిర్వహించారు. వెంకట్రావు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అయప్ప మాలాధారణ చేసిన స్వాములు, భక్తులు భారీగా పాల్గొన్నారు. 18 మెట్ల అలంకరణతో అత్యంత ఘనంగా పూజ నిర్వహించగా టీడీపీ నేతలు కొక్కిర తిరుపతయ్య, కొప్పోలు శ్రీనివాస చౌదరి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములకు సద్ది ఏర్పాటు చేశారు.



నిత్యాన్నదానంలో పాల్గొన్న మాలధారులు



డాక్టర్ కొండా వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఇంపికప్స్ డైరెక్టర్ డాక్టర్ వేముల భానుప్రకాష్

ఘనంగా ఆయుర్వేద సద్వైద్య సంభాషా

ఆటోనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యులు తమ ప్రాక్టీసులోని గ్రంథస్థం కాని అనుభవ చికిత్సలను విద్యార్థులకు చెప్పడం వల్ల విజ్ఞాన సముపార్జనకి దోహదపడుతుందని ఇంపీకప్స్ డైరెక్టర్ డాక్టర్ వేముల భాను ప్రకాష్ అన్నారు. ఆదివారం ది మెడికల్ ప్రాక్టీషనర్స్ కో-ఆపరేటివ్ ఫార్మసీ అండ్ స్టోర్స్ ఆధ్వర్యంలో ఇంపికప్స్ పంచకర్మ హాస్పిటల్‌లో ఆయుర్వేద సద్వైద్య సంభాషా పరిషద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య పరిజ్ఞానంతో నైపుణ్యం పొందడం, ప్రాక్టీసులో సందేహాలు నివృత్తి చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కేరళ తరహాలో ఆయుర్వేద టూరిజాన్ని మన రాష్ట్రంలో అభివృద్ధి చేస్తే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోందని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు అన్నారు. సమన్వయకర్తగా డాక్టర్ పమ్మి సూర్య కుమార్ వ్యవహరించారు. డాక్టర్ ఆదర్శ్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ జాబిల్లి, ఆయుర్వేద విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సెంటినీ సిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ మొవ్వ పద్మ

ప్రజలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

● సీఎంఈలో సెంటినీ సిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ మొవ్వ పద్మ

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు సెంటినీ సిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ మొవ్వ పద్మ తెలిపారు. సెంటినీ సిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో కరెంట్ మెడికల్ అప్డేట్-1 సీఎంఈ నిర్వహించారు. ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ నవీన్ తోట నేతృత్వంలో నగరంలోని ఫార్చ్యూన్ మురళీ పార్క్ నందు ఆదివారం జరిగిన సదస్సులో డాక్టర్ మొవ్వ పద్మ మాట్లాడారు. ఈప్రాంత ప్రజలకు ప్రపంచస్థాయి వైద్య చికిత్సలను చేరువ చేసేందుకు సీఎంఈ దోహదం చేస్తోందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో న్యూరాలజీ, కార్డియాలజీ, గ్యాస్ట్రో, ఎంటరాలజీ విభాగాల్లో ఆధునిక చికిత్సతో పాటు పార్కిన్సన్స్ వ్యాధికి సంబంధించిన అత్యాధునిక వైద్య చికిత్సల గురించి కరెంట్ మెడికల్ అప్డేట్-1 సీఎంఈలో సమగ్రంగా చర్చ జరిపారు. 470 మంది వైద్యులు పాల్గొన్న ఈ సదస్సులో వివిధ విభాగాల నిపుణులు ప్రసంగించారు. ఆధునిక చికిత్సా పద్ధతులు, చికిత్సల్లో ఎదురయ్యే సవాళ్ల గురించి తమ ప్రసంగాల్లో వివరించారు. సీఎంఈ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ తోట నవీన్ మాట్లాడుతూ ఆధునిక చికిత్సా విధానాలు, నవీన ఆవిష్కరణలు గురించి అధ్యయనం చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఈ సీఎంఈ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక ఆవిష్కరణలు వెలుగులోకి వచ్చాయని డాక్టర్ పద్మ తెలిపారు. నగరంలోని సెంటినీ సిటీ హాస్పిటల్స్‌లో అత్యాధునిక పార్కిన్సన్స్ వ్యాధి చికిత్సా విభాగం అందుబాటులో ఉందన్నారు. నవీన ఆవిష్కరణలను అందిపుచ్చుకొని రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తామని డాక్టర్ నవీన్ తోట వెల్లడించారు. సెంటినీ సిటీ హాస్పిటల్ ఛైర్మన్ మొవ్వ ఆనంద్, డైరెక్టర్ మొవ్వ విష్ణు పాల్గొన్నారు.

పవర్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కేబీఎన్ విద్యార్థుల ప్రతిభ



వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ పోటీల్లో కేబీఎన్ విద్యార్థులు ప్రతిభ కనబ రిచారు. పతకాలు సాధించిన వారిని ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ జి.కృష్ణవేణి, హిందూ హైస్కూల్స్ విద్యా సంస్థల పరిపాలనా అధికారి వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పి.ఎల్.రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ, క్రీడావిభాగాధిపతి హేమచంద్రరావు అభినందించారు. పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కళాశాల గెలుచుకుంది. పి.భరత్‌కుమార్ పవర్ లిఫ్టింగ్‌లో కృష్ణాయూనివర్సిటీ స్ట్రాంగ్‌మెన్‌గా వరసగా నాలు గోసారి టైటిల్‌ను గెలుచుకున్నారు. వి.రక్షిత 87 కిలోల విభా గంలో వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లలో బంగారు పతకం, పి.అరుణ నాగదుర్గ 81 కిలోల విభాగం వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం, 50 కిలోల విభాగంలో బి.సత్య వెయిట్ లిఫ్టింగ్‌లో, పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం, వి.సుప్రియ 50 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్, వి.లోకేశ్వరి వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్యం, పవర్ లిఫ్టింగ్‌లో బ గారు పతకం, 57 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో ఎ.నందిని గోల్డ్, పవర్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్స్, 66 కిలోల విభాగం పవర్ లిఫ్టింగ్‌లో 635 కిలోల విభాగంలో పి.భరత్ కుమార్ గోల్డ్‌మెడల్స్ సాధించాడు. గుల్ బర్గా విశ్వవిద్యాలయంలో ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారు. మహిళల విభాగంలో వి.రక్షిత, ఏఎన్‌యూ సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. పురుషుల విభాగంలో బెస్ట్ ఫిజిక్ పోటీల్లో యశ్వంత్ 70 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, ఎం.శ్రీనివాస్ రజతం, కె.హరికృష్ణ 65కేజీల విభాగంలో రజతం, 75కేజీల విభాగంలో కిరణ్‌కుమార్ కాంస్యం సాధించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం ● 18 నవంబరు 2024



హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. భూల్ భులాయా (భూల్ భులాయా3)
3. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
4. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
5. జా రాంఝున్ (దో పత్తీ)
6. ఆయీ నై (స్త్రీ-2)
7. సాజ్‌నీ రే (లా పతా లేడీస్)
8. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
9. అపనా బనాలే (భేడియా)
10. మిలియనీర్ (గ్లోరీ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

సెలబ్ టాక్

దేనికైనా రెడీ..!



**బాలీవుడ్‌లోకి మరో వారసురాలు వచ్చింది.
ఆమె ఎవరో కాదు... హీరో వరుణ్ ధావన్ అన్న కూతురు...
'బిన్ని అండ్ ఫ్యామిలీ' కథానాయిక... అంజినీ ధావన్.
వెండితెరపై వెలిగిపోవాలన్న ఆశయంతో... కొన్నేళ్లు పరిశ్రమలోనే పని చేసి... అనుభవం గడించింది.
తొలి చిత్రంతోనే మంచి హిట్ సొంతం చేసుకోవడమే కాదు... అగ్ర నటుల ప్రశంసలు కూడా అందుకుంది.**

అంజినీ ఇంట్లో అందరూ సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్నవారే. తాతయ్య అనిల్ ధావన్ వెటరన్ నటుడు. ఆయన కుమారుడు, అంజినీ తండ్రి సిద్ధార్థ్ ధావన్ బుల్లితెర నటుడు. హిట్ చిత్రాల దర్శకుడు డేవిడ్ ధావన్ పినతాత. డేవిడ్ తనయుడు, ప్రముఖ హీరో వరుణ్ ధావన్ ఆమెకు వరుసకు బాబాయి. చిన్నప్పటి నుంచీ సినీ వాతావరణంలోనే గడిపిన అంజినీకి సాధారణంగానే నటనపై మక్కువ పెరుగుతూ వచ్చింది. ముంబయిలో పుట్టి పెరిగిన ఆమె... డిగ్రీ తరువాత కెరీర్‌పై పూర్తి శ్రద్ధ పెట్టింది. అయితే కుటుంబ నేపథ్యం, ఇంట్లోవాళ్ల ప్రోత్సాహం ఉన్నా... తొలుత తనను తాను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని అనుకుంది. ఆ తరువాతే తెర మీద కనిపించాలనే పట్టుదలతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పరిశ్రమలో అడుగుపెట్టింది. వరుణ్ ధావన్ 'కూలీ నంబర్-1'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసింది. అప్పుడప్పుడూ బామ్మ రష్మీ ధావన్ యాక్టింగ్ స్కూల్లోని విద్యార్థులతో కలిసి నటనలో మెళకువలు కూడా నేర్చుకుంది. ఇలా ఎక్కడ అవకాశం దొరికినా దాన్ని ఉపయోగించుకొంటూ... తనలోని నటికి మరిన్ని వన్నెలద్దింది. వీటన్నిటి ఫలితం తొలి చిత్రం 'బిన్ని అండ్ ఫ్యామిలీ'లోనే కనిపించింది. సినిమా చూసినవారందరూ... ఆమెకు అది మొదటి సినిమా అనుకోలేదట. అంతలా అదరగొట్టింది నటనలో. ఇక ఎంతో సహజంగా నటించిందనేది విమర్శకుల మాట.

▸▸ వేరొక ఆడిషన్‌లో చూసి...

'బిన్ని అండ్ ఫ్యామిలీ'లో అవకాశం కూడా విచిత్రంగా వచ్చింది అంజినీకి. "వేరొక సినిమా కోసం ఏడాదిగా ఆడిషన్లు ఇస్తున్నా. అది సంజయ్ త్రిపాఠీ దృష్టిలో పడింది. తను తీయబోయే చిత్రంలో 'బిన్ని' పాత్రకు నేనైతే సరిగ్గా సరిపోతానని ఆయన భావించారట. వెంటనే నన్ను ఆడిషన్స్‌కు పిలిచారు. నా నటన నచ్చింది. అలా 'బిన్ని అండ్ ఫ్యామిలీ'లో అవకాశం రావడమే కాదు... నటిగా నా కెరీర్ కూడా ప్రారంభమైంది" అంటూ ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది అంజినీ.



▸▸ 'నా జీవితానికి దగ్గరైన పాత్ర'...

ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను లండన్‌లో చిత్రీకరించాడు సంజయ్. నెల రోజులపాటు సాగిన ఆ షెడ్యూల్‌లో 'పంకజ్ కపూర్, హిమని శివ్‌పురి, రాజేష్‌కుమార్ లాంటి సీనియర్లతో కలిసి పని చేయడంవల్ల ఎంతో నేర్చుకొనే అవకాశం లభించింది. అంతా ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారు. నెల రోజులూ ఎంతో సరదాగా గడిచిపోయాయి. అదీకాకుండా 'బిన్ని' పాత్ర నిజ జీవితంలో నాకు చాలా దగ్గరగా ఉంటుంది. కొన్ని సన్నివేశాలు చేస్తున్నప్పుడు, ముఖ్యంగా బామ్మ పాత్రధారి నా చిరిగినట్లుండే ఫ్యాషన్ జీన్స్ చూసి ఇదేంటని ప్రశ్నించినప్పుడు మా నాన్న గుర్తుకువచ్చారు. ఆయన కూడా ఇంట్లో నా డ్రెస్‌లు చూసి జోకులు వేసేవారు' అంటూ తన అనుభవాలు పంచుకుంది అంజినీ. డేవిడ్, వరుణ్ ధావన్ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటారు. ముఖ్యంగా ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల్లోనే కాకుండా, షూటింగ్ సమయంలో కూడా వరుణ్ అంజినీకి మద్దతుగా నిలిచాడు. తన ఇన్‌స్టా, ఎక్స్ ఖాతాల్లో ఆమె గురించి, ఆమె చిత్రం గురించిన విశేషాలను పంచుకున్నాడు. సినిమా విడుదల తరువాత కూడా అంజినీని ప్రత్యేకంగా అభినందించాడు.

▸▸ నిరూపించుకొంటేనే...

"నా సినిమా విడుదలకు ముందు కొందరు 'బాలీవుడ్‌లో బంధుప్రీతికి మరో నిదర్శనం' అంటూ కించపరిచేలా నాపై వ్యాఖ్యలు చేశారు. పరిశ్రమలో పరిచయాలవల్ల కష్టపడకుండానే మొదట్లో ఒకటి రెండు అవకాశాలు వస్తాయేమో! కానీ మనలో సామర్థ్యం లేకపోతే ఇక్కడే కాదు, ఏ రంగంలోనూ నిలదొక్కుకోలేము. మనల్ని మనం నిరూపించుకొంటేనే మనుగడ. నటిగా తెరమీద కనిపించడానికి ముందు సినీ నిర్మాణంలో ప్రతి క్రాఫ్ట్ గురించీ తెలుసుకోవాలని అనుకున్నాను. అందుకే తొలుత బాబాయి సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. షూటింగ్ స్పాట్‌కు ఉదయాన్నే వెళ్లిపోయేదాన్ని. కెమెరా, లైటింగ్, లొకేషన్లు... ఇలా అన్నిటి మీద ఒక అవగాహన వచ్చాకనే నటన గురించి ఆలోచించాను" అంటుంది అంజినీ.

మంచి స్నేహితులు...

'కూలీ నంబర్-1' షూటింగ్‌లో వరుణ్, ఆ చిత్ర కథానాయిక సారా అలీఖాన్‌తో ఎంతో సరదాగా గడిచిపోయేదని, తారలపై వచ్చే గాసిప్స్ మీద మాట్లాడుకొని నవ్వుకొనేవారమని చెప్పింది ఇరవై నాలుగేళ్ల అంజినీ. 'వరుణ్‌ను ఎప్పుడూ బాబాయిగా చూడలేదు. అన్నయ్యలాగా భావిస్తాను. తను నన్ను ఎంతో గారాబంగా చూసుకొంటాడు' అంటున్న అంజినీకి సంజయ్ కపూర్ కుమార్తె, నటి షనయ కపూర్, బోనీ- శ్రీదేవిల చిన్న కూతురు ఖుషీ కపూర్ మంచి మిత్రులు. 'నా సినిమా ప్రివ్యూ నుంచి బయటకు వచ్చేటప్పుడు వాళ్ల కళ్లు చెమర్చాయి. నా నటన బాగుందని అభినందించారు' అంటూ తన ఆనందాన్ని పంచుకుంది అంజినీ.

అన్నీ చెయ్యాలి...

మొదటి చిత్రంతోనే మంచి నటిగా ప్రశంసలు అందుకున్న అంజినీ... భవిష్యత్తులో అన్ని రకాల పాత్రలూ చేయాలని అనుకొంటోంది. 'యాక్షన్, కామెడీ, ప్రేమ కథలు, సైకో థ్రిల్లర్లు అనే తేడా లేకుండా ప్రతి పాత్రా పోషించాలి. విలక్షణ నటిగా ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలి'... అని కోరుకొంటున్న అంజినీ ఏ పాత్రకైనా రెడీ అంటోంది. ఆమెకు ఇన్‌స్టాలో ఫాలోవర్స్ కూడా తక్కువేంలేరు. ఫ్యాషన్ ఐకాన్‌గా తెరంగేట్రానికి ముందే లక్షలమంది అభిమానులను సంపాదించుకున్న ఆమె... తరచూ వెరైటీ డ్రెస్సుల్లో ఫొటోలు అప్‌లోడ్ చేస్తుంటుంది. వాటికి లైక్‌లూ లక్షల్లోనే. ఫిట్‌గా ఉండటానికి యోగా, జిమ్నాస్టిక్స్‌ను తన దినచర్యల్లో భాగంగా చేసుకుంది.

నవ్య | చిత్రజ్యోతి

ఆ స్వేచ్ఛ మాకూ ఉంది

- విష్వక్‌సేన్


'ఒక సినిమా బాగోగుల గురించి విమర్శకులు, సమీక్షకులు ఎంతటి విశ్లేషణ అయినా చేయవచ్చు కానీ ఆ వంకతో వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా ఉండకూడదు. మీలాగా మాకూ భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని గుర్తుంచుకోవాలి' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథా



నాయికలు. రామ్ తాళ్లూరి నిర్మాత. ఈ నెల 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ "మెకానిక్ రాకీతో మా నిర్మాత రామ్ గర్వపడేలా చేస్తా. పది సినిమాల అనుభవంతో చెబుతున్నా మంచి సినిమా తీశాం. ఐదు నిమిషాలు కూడా బోర్‌కొట్టదు. మా సినిమాను ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు. రామ్ తాళ్లూరి మాట్లాడుతూ 'విష్వక్‌సేన్ కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలున్నాయి. మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. యువతను, మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో తెరకెక్కిన చిత్రమిదని మీనాక్షి చౌదరి తెలిపారు. సందేశం, వినోదం కలబోతగా రూపొందిన చిత్రమిదని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పారు.

కొత్తగా...

రిమాండ్‌కు కస్తూరి



తమిళ నాడులో నివసిస్తున్న తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నటి కస్తూరికి ఎగ్మోర్ మెట్రోపాలిటన్ కోర్టు 12 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆమెను పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. 'అధికార దుర్వినియోగాన్ని ముగింపు పలికి న్యాయాన్ని గెలిపించాల'ని కోర్టు వెలుపల కస్తూరి మీడియాతో అన్నారు. మధురై కోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో హైదరాబాద్‌లో తలదాచుకున్న కస్తూరిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకొని తమిళనాడుకు తరలించిన విషయం తెలిసిందే.



పట్నాలో పుష్ప రూల్

'నేను మొదటిసారి బిహార్‌కు వచ్చాను. నా హిందీ అంత బావుండదు. తప్పులు మాట్లాడితే క్షమించండి. ఎవరికీ తలవంచని పుష్ప నేడు మీ ముందు తలవంచుతున్నాడు. మీ అభిమానమే 'పుష్ప 2: ది రూల్' లాంటి మంచి చిత్రాన్ని తీయడానికి మాకు ప్రేరణ' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పుష్ప 2'. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని బిహార్ రాజధాని పట్నాలో భారీ జనసందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ "పుష్ప' చిత్రాన్ని పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఆ సినిమా సూపర్‌హిట్ అయ్యిందంటే ఆ గొప్పదనం నాది కాదు, ప్రేక్షకులదే. మీ ప్రేమే 'పుష్ప 2: ది రూల్' చిత్రాన్ని ఇంత గొప్పగా తీయడానికి కారణమైంది. డిసెంబర్ 5న మీ ముందుకు రాబోతోంది. తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది. మీ సమక్షంలో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'ఇంతమంది అభిమానులు 'పుష్ప' ప్రపంచంలోకి వచ్చినందుకు నాకు సంతోషంగా ఉంది. రెండు సంవత్సరాలుగా అభిమానులు ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. మీ అందరి అంచనాలకు మించి సినిమా ఉండబోతోంది' అని తెలిపారు. 'పట్నా ప్రజల నుంచి ఈ స్థాయి ఆదరణను ఊహించలేదు. ఈ గొప్పదనం అల్లు అర్జున్, సుకుమార్‌కు దక్కుతుంది' అని నిర్మాత యలమంచిలి రవి, నవీన్ యెర్నేని తెలిపారు. 'పుష్ప 2' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం భారీ ఎన్నికల ప్రచార సభను తలపించింది. దేశవ్యాప్తంగా ఉన్న అల్లు అర్జున్ అభిమానులు తరలివచ్చారు. గాంధీ మైదానం జనాలతో కిటకిటలాడిపోయింది. ఈ కార్యక్రమానికి సుమారు రెండు లక్షలమంది హాజరయ్యారని అంచనా. "పుష్ప అంటే ఫైర్ కాదు వైల్డ్ ఫైర్' అంటూ ఆయన చెప్పిన డైలాగ్‌లకు అభిమానుల కేరింతలతో సభాప్రాంగణం మార్మోగింది. బిహార్ డిప్యూటీ సీఎం విజయ్ సేన సాహెబ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశుపాలకుడిగా ప్రణవ్



వెండితెరపైన సాదా సీదా పాత్రలను అద్భుతంగా పోషించే తారలు నిజ జీవితంలో అలా జీవించగలరా? అంటే 'కష్టమే' అని చెప్పాలి. కానీ మలయాళ మెగా స్టార్ మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ మాత్రం స్టార్‌డమ్‌ను పక్కన పెట్టి దేశం కాని దేశంలో అనామకంగా జీవిస్తున్నాడు. ప్రస్తుతం స్పెయిన్‌లో 'వర్క్ అవే' అనే కార్యక్రమంలో భాగంగా ఆయన ఓ పొలంలో కష్టపడి పనిచేస్తున్నారు. పశుపాలకుడిగా గొర్రెలు, మేకలు, గుర్రాలను కాస్తున్నారు ప్రణవ్. నటుడిగా పోషించాల్సిన విభిన్న పాత్రల్ని తన కొడుకు నిజజీవితంలో పోషిస్తున్నారని ప్రణవ్ తల్లి సుచిత్ర ఓ ఇంటర్వ్యూలో చెప్పడంతో ఈ విషయం అందరికీ తెలిసింది. ఒక సూపర్‌స్టార్‌కి కొడుకు, ఆగర్భ శ్రీమంతుడు అయినా విలాసవంతమైన జీవన శైలిని వదిలి ఇలా సాదాసీదాగా గడుపుతున్న ప్రణవ్‌ను నెటిజన్లు అభినందిస్తున్నారు. 2002లో 'ఒన్నమన్' అనే సినిమాతో బాలనటుడిగా అరంగేట్రం చేసిన ప్రణవ్.. 'పునర్జనీ' చిత్రంతో ఉత్తమ బాలనటుడిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డు అందుకున్నారు. 2018లో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో 'ఆది' అనే చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు. ఈ సినిమా ఆ ఏడాది అత్యధిక వసూళ్లు అందుకున్న చిత్రంగా నిలవడమే కాకుండా ప్రణవ్‌కు ఉత్తమ నటుడిగా సైమా అవార్డునూ తెచ్చిపెట్టింది. ప్రణవ్ కేవలం నటుడిగానే కాకుండా ప్లేబ్యాక్ సింగర్‌గా, పాటల రచయితగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు.

గాయకుడు అనురాగ్ కులకర్ణి, గాయని రమ్య బెహర వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ వేడుకకి సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరలవుతున్నాయి. కొద్దిమంది కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి చిన్న కుమారుడు శ్రీ సింహా, సీనియర్ నటుడు మురళీ మోహన్ మనవరాలు రాగ వివాహం త్వరలోనే జరగనుంది. ఆదివారం గోల్కొండ రిసార్ట్స్‌లో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ వేడుకలో ఆంధ్రజ్యోతి గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ స్పీకర్ రఘురామకృష్ణరాజు సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.



రూ. పదికోట్ల వీడియో ఫ్రీగా చూడండి



నటి నయనతార బయోపిక్‌గా నెట్‌ఫ్లిక్స్ తెరకెక్కించిన డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్'. దీనికోసం 'నానుమ్ రౌడీ దాన్' సినిమా సమయంలో షూట్ చేసిన మూడు సెకన్ల క్లిప్‌ను వాడుకున్నందుకు రూ.పది కోట్లు ఇవ్వాలని నటుడు, నిర్మాత ధనుష్ కోరారని.. ఇందుకు ఆయనని విమర్శిస్తూ నయనతార ఓ బహిరంగ లేఖ రాసిన సంగతి తెలిసిందే. అయితే నయనతారను సపోర్ట్ చేస్తూ ఆదివారం ఆమె భర్త విఘ్నేష్ శివన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రెండు పోస్టులు పెట్టారు. అందులో ఒక దాంట్లో.."కేవలం మూడు సెకన్లకు ధనుశ్ రూ.పది కోట్లు డిమాండ్ చేసిన వీడియో ఇదే. మీరంతా ఫ్రీగా చూసేయ్యండి" అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. అంతటితో ఆగకుండా... మరో పోస్ట్‌లో.. 2017లో 'సక్క పోడు పోడు రాజా' సినిమా ఆడియో ఫంక్షన్‌లో ధనుశ్ మాట్లాడిన వీడియోను కూడా షేర్ చేశారు. అందులో ప్రేమను పంచడం గురించి.. నటీనటులు పనిచేసే చోట ఉండాల్సిన వాతావరణం గురించి ధనుశ్ మాట్లాడారు. ఆ వీడియోకి కౌంటర్‌గా "జీవించండి.. ఇతరులని స్వేచ్ఛగా జీవించనివ్వండి. ప్రేమను పంచండి.. ఓం నమః శివాయ. మీరు చెప్పినవి ముందు మీరు పాటించండి. కనీసం మీ అభిమానుల కోసమైనా" అని పేర్కొన్నారు. అయితే ఈ పోస్టులను కొద్దిసేపటికే విఘ్నేష్ శివన్ తొలగించడం గమనార్హం. మరోవైపు గాయని సుచిత్ర, ధనుశ్ ఎంతో మంది హీరోయిన్లను వేధించారని ఆరోపించారు.

బిజినెస్

నేటి నుంచి బ్యాంక్ ఆఫ్ ఇండియా సంఝౌతా ఔట్‌రీచ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మొండి బకాయిల (ఎన్‌పీఏ) పరిష్కారం లక్ష్యంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) సోమవారం నుంచి శుక్రవారం వరకు సంఝౌతా ఔట్‌రీచ్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఎన్‌పీఏ ఖాతాలున్న వారికి ఈ ఐదు రోజుల్లో బకాయిల చెల్లింపునకు ఆకర్షణీయమైన తగ్గింపులతో ఏకకాల సెటిల్మెంట్ (ఓటీఎస్) అవకాశం కల్పిస్తారు. ఏదైనా న్యాయబద్ధమైన కారణంతో రుణ బకాయిలు సకాలంలో చెల్లించలేకపోయిన కస్టమర్లు సంబంధిత బ్యాంకు శాఖను సందర్శించి ఏకకాల పరిష్కారం పొంది రుణవిముక్తులు కావాలని బ్యాంకు పిలుపు ఇచ్చింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	545	విజయవాడ	575
వరంగల్	547	గోదావరి	565
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెంకాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	109
వరంగల్	90	గుంటూరు	103
కరీంనగర్	90	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	99
కర్నూలు	90	నెల్లూరు	99
విశాఖపట్నం	103		
గోదావరి	109	అనంతపురం	99

కారు మరింత స్మార్ట్ గురూ

ఇక రూ.20 లక్షల కారుకూ 5జీ ఎం2ఎం టెక్నాలజీ



న్యూఢిల్లీ: దేశంలో ఆటోమొబైల్ రంగం ముఖచిత్రం 2025లో పూర్తిగా మారిపోతోంది. 5జీ ఎం2ఎం కనెక్టివిటీ (ఇంటర్నెట్ సహాయంతో డివైస్‌ల మధ్య పరస్పరం డేటా మార్పిడి చేసుకునే టెక్నాలజీ), అడ్వాన్స్‌డ్ ఏఐ టెక్నాలజీలతో కూడిన కార్ల రాకతో మరింత అధునాతనమైన "స్మార్ట్ శకం"లోకి భారత్ అడుగు పెట్టబోతోంది. టెక్‌ఆర్క్ ఇండియా కనెక్టెడ్ కన్స్యూమర్ నివేదిక ఈ తాజా వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. మన దేశంలో ఆటోమోటివ్ రంగం 4జీని తోసి రాజని 5జీ సెల్యులార్ టెక్నాలజీని వినియోగించేందుకే మొగ్గు చూపుతోంది. వినియోగదారులు కూడా లెక్కకు మించి డివైస్‌ల వినియోగాన్ని పక్కన పెట్టి చక్కని ఫీచర్లతో సరికొత్త అనుభవాన్ని అందించడం ద్వారా తమ సొమ్ముకు విలువ సమకూర్చే టెక్నాలజీలపై ఎంతైనా ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఆ సర్వేలో తేలింది. తాము డివైస్‌ల సంపూర్ణ సామర్థ్యాన్ని తాము వినియోగించుకోవాలనుకుంటున్నట్టు 22 శాతం మంది చెప్పారు. అందులోనూ 55 శాతం మంది స్మార్ట్/కనెక్టెడ్ కార్లపై అధిక మక్కువ ప్రదర్శించారు. సర్వేలో భాగంగా మొత్తం 4500 కనెక్టెడ్ వినియోగదారులను ప్రశ్నించారు. స్మార్ట్‌ఫోన్ ఒక్కటే కాకుండా మరో 3 డివైస్‌లున్న వారిని "కనెక్టెడ్ వినియోగదారులు"గా నిర్వచించారు.

సగటు జీవి కారుకూ ఆధునిక ఫీచర్లు

2025 నుంచి అధిక శాతం కార్లు 5జీ ఎం2ఎం కనెక్టివిటీ, ఆన్ డివైస్ జెనరేటివ్ ఏఐ, క్లౌడ్ కనెక్టివిటీతో రానున్నాయి. దీంతో విభిన్న ధరల శ్రేణుల్లోని కార్లకు ఈ ఫీచర్లు అందుబాటులో ఉంటాయి. డ్రైవర్లకు మద్దతుగా రియల్ టైమ్ డేటా ప్రాసెసింగ్‌కు వీలుగా వాహనాల్లో ఇన్ వెహికల్ కంప్యూటింగ్, జెనరేటివ్ ఏఐ, క్లౌడ్ అప్లికేషన్లు తప్పనిసరి అవసరాలు కానున్నాయి. ఇప్పటివరకు విలాసవంతమైన కార్లకే అందుబాటులో ఉన్న ఈ ఫీచర్లన్నీ రూ.20 లక్షలు, ఆ పైబడిన ధరల శ్రేణిలోని కార్లన్నింటికీ సర్వసాధారణం కాబోతున్నాయి. ఆటోమోటివ్ చిప్‌సెట్ కంపెనీల ఆదాయాలు ఇప్పటికే 150 కోట్ల డాలర్లు దాటాయి. క్వాల్‌కామ్, మీడియా టెక్ ఇందులో అగ్రగాములుగా ఉన్నాయి. రాబోయే కాలంలో ఆటోమొబైల్ రంగం భవిష్యత్తును కనెక్టివిటీ, టెక్నాలజీలే నిర్దేశించనున్నాయని టెక్‌ఆర్క్ ఆటోటెక్ అనలిస్ట్ సాదత్ అహంగర్ అన్నారు.

5జీ ఎం2ఎంలోనూ మనదే పైచేయి

ప్రస్తుతం దేశంలో 22 ఆటోమొబైల్ తయారీ కంపెనీలు ఏటా 50 లక్షల కార్లు ఉత్పత్తి చేస్తున్నాయి. రాబోయే కొద్ది సంవత్సరాల్లో ప్రపంచ 5జీ ఎం2ఎం మార్కెట్లో మనదే అగ్రస్థానం కాబోతున్నదని టెక్‌ఆర్క్ నివేదిక తెలిపింది. ప్రస్తుతం కనెక్టెడ్ కార్ల విభాగంలో ఎంజీ మోటార్స్‌దే అగ్రస్థానమని 21 శాతం మంది అన్నారు. కియా మోటార్స్ (18 శాతం), టాటా మోటార్స్ (15 శాతం) తర్వాతి స్థానాల్లో ఉండగా హ్యుండాయ్, మారుతి టాప్ 5 బ్రాండ్లలో స్థానం దక్కించుకున్నాయి.

ఎలక్ట్రానిక్స్‌పై పట్టు పెంచుకుంటున్న టాటా

పెగాట్రాన్ ప్లాంట్‌లో 60 శాతం వాటా!



న్యూఢిల్లీ: ఐ ఫోన్ల అసెంబ్లింగ్‌పై టాటా గ్రూప్ పట్టు బిగిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా పెగాట్రాన్ చెన్నై ప్లాంట్ ఈక్విటీలో 60 శాతం వాటా టాటా ఎలక్ట్రానిక్స్ కొనుగోలు చేసింది. అయితే రెండు కంపెనీలు ఈ విషయాన్ని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. పెగాట్రాన్ ఈ ప్లాంట్‌లో యాపిల్ కంపెనీ కోసం ఐఫోన్లు అసెంబ్లింగ్ చేస్తుంటుంది. గత ఏడాది కర్ణాటకలోని విస్ట్రాన్ కంపెనీని తైవాన్ కంపెనీ నుంచి రూ.1,000 కోట్లకు టాటా ఎలక్ట్రానిక్స్ ఇందుకోసమే కొనుగోలు చేసింది. వీటికి తోడు యాపిల్ కంపెనీకి చెందిన వివిధ ఉపకరణాల అసెంబ్లింగ్ కోసం తమిళనాడులోని హోసూరు వద్ద ప్రత్యేక ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. పెగాట్రాన్ చెన్నై ప్లాంట్‌తో కలిపితే ఐఫోన్ల అసెంబ్లింగ్ కోసం టాటా గ్రూప్ మూడు ప్లాంట్లు కలిగి ఉండబోతోంది.

విదేశీ ఆస్తులు వెల్లడించకపోతే రూ.10 లక్షల జరిమానా



న్యూఢిల్లీ: పన్ను ఎగవేతదారులపై ఆదాయ పన్ను శాఖ ఉచ్చు బిగిస్తోంది. ఐటీ రిటర్నులు ఫైల్ చేసే వ్యక్తులు ఇక తప్పనిసరిగా విదేశాల్లో తాము సంపాదించిన స్థిర, చరాస్తులు, బ్యాంకు ఖాతాలు, ఆదాయాల వివరాలను తమ రిటర్నుల్లో వెల్లడించాలి. లేకపోతే నల్లధన నిరోధక చట్టం కింద వారిపై రూ.10 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించింది. 2024-25 అసెస్‌మెంట్ ఇయర్ (ఏవై) నుంచే ఈ నిబంధన అమల్లోకి వచ్చినట్టు తెలిపింది. రిటర్నులు ఫైల్ చేసే వారి దేశీయ ఆదాయం పన్ను పరిధి కంటే తక్కువగా ఉన్నా సరే, వారు విదేశాల్లోని తమ స్థిర, చరాస్తులు, బ్యాంకు ఖాతాలు, వాటిల్లోని డిపాజిట్లు, విదేశాల నుంచి సంపాదించిన సంపాదన వివరాలు తప్పనిసరిగా వెల్లడించాలని స్పష్టం చేసింది. అంతర్జాతీయ ఒప్పందాలు, ద్వైపాక్షిక ఒప్పందాల ద్వారా ఇలాంటి ఘరానా పెద్దల వివరాలను ఐటీ శాఖ ఎప్పటికపుడు సేకరిస్తోంది. ఒకవేళ ఎవరైనా తమ 2024-25 అసెస్‌మెంట్ ఇయర్ రిటర్న్‌లో ఈ వివరాలు తెలపకపోతే, వచ్చే నెలాఖరులోగా సవరించిన రిటర్న్ ఫైల్ చేయాలని కోరింది.

23850 పైన బుల్లిష్

(నవంబరు 18-22 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో వ్యూ

గత వారం నిఫ్టీ: 23533 (-615)

నిఫ్టీ గత వారం 24337-23484 పాయింట్ల మధ్యన కదలాడి 615 పాయింట్ల నష్టంతో 23533 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23850 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23740, 24042, 24129, 24482 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 23950 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23100

నిరోధ స్థాయిలు: 23750, 23850, 23950 (23650 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 23300, 23200, 23100 (234250 దిగువన బేరిష్)

మద్దతు స్థాయిలు 23500, 23350

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత సోమవారం 24000 వద్ద మైనర్ రికవరీతో ప్రారంభమైనా ఆ స్థాయిలో నిలదొక్కుకోలేక వారం మొత్తం డౌన్‌ట్రెండ్‌లోనే ట్రేడయి చివరికి వారం కనిష్ఠ స్థాయిల్లో క్లోజయింది. వారం మొత్తం మీద 615 పాయింట్ల నష్టంతో 23530 వద్ద ముగిసింది. టెక్నికల్‌గా గత ఆరు వారాల డౌన్‌ట్రెండ్ కొనసాగుతోంది. నిఫ్టీ గరిష్ఠ స్థాయి 26000 నుంచి సుమారు 2500 పాయింట్లు నష్టపోయింది. గత వారంలో మిడ్‌క్యాప్ సూచీ 2300 పాయింట్లు, స్మాల్‌క్యాప్ సూచీ 850 పాయింట్ల భారీ నష్టంతో ముగిశాయి. గత శుక్రవారం అమెరికన్ మార్కెట్ల ధోరణిని బట్టి ఈ వారం మన మార్కెట్ అప్రమత్తంగానే ప్రారంభం కావచ్చు. గత ఆరు సెషన్లలో నిట్టనిలువుగా పతనమైన నిఫ్టీ ప్రస్తుతం కీలక స్థాయి 23500 వద్ద ఉంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ ప్రస్తుతం కీలక మానసిక మద్దతు స్థాయి 23500 సమీపంలో ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం రాబోయే రెండు రోజుల్లో ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన నిరోధం 23750. ఆ పైన 24000. మార్కెట్లో తీవ్ర ఆటుపోట్లు నెలకొన్నందు వల్ల ట్రెండ్‌లో స్పష్టత కోసం కనీసం కొద్ది రోజుల పాటు నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: 23500 వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 23350 (జూన్ 24న ఏర్పడిన కనిష్ఠ స్థాయి). ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనత ఏర్పడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 23000.

బ్యాంక్ నిఫ్టీ: గత వారంలో కూడా డౌన్‌ట్రెండ్‌లోనే ట్రేడయిన ఈ సూచీ వారం మొత్తం మీద 1400 పాయింట్లు నష్టపోయి ప్రధాన మానసిక అవధి 50000 సమీపంలో క్లోజయింది. సానుకూలత కోసం ఇక్కడ కన్సాలిడేట్ అయి తీరాలి. గత ఐదు నెలల కాలంలో ఇదే స్థాయిలో కొన్ని ప్రధాన బాటమ్‌లు ఏర్పడ్డాయి. అందుకే ఇది కీలక స్థాయిగా మారింది. రికవరీ బాట పడితే సానుకూలత కోసం ప్రధాన నిరోధం 50600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 51000. కీలక స్థాయి 50000 వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 49400.

పాటర్న్: నిఫ్టీ ప్రస్తుతం 200 డీఎంఏ సమీపంలో ఉంది. సానుకూలత కోసం ఇక్కడ కన్సాలిడేట్ కావాలి. 23500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే మరింత బలహీనత ప్రదర్శిస్తుంది. మార్కెట్ ప్రస్తుతం ఓవర్‌సోల్డ్ స్థితిలో ఉంది. కనిష్ఠ స్థాయిల్లో స్వల్పకాలిక ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం సోమవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	23,610, 23,660
మద్దతు	23,460, 23,400

ఈ వారమూ అనిశ్చితే...

ఈ వారంలో కూడా స్టాక్ మార్కెట్ ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం కనిపిస్తోంది. డోనాల్డ్ ట్రంప్ గెలుపుతో అమెరికా డాలర్ బలం పుంజుకుంటోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ, బులియన్ మార్కెట్లు నేల చూపులు చూస్తున్నాయి. ఎఫ్‌పీఐల అమ్మకాలు, డాలర్‌తో రూపాయి బలహీనత ఇందుకు మరింత దోహదం చేస్తున్నాయి. చైనా ఉద్దీపన ప్యాకేజీతో పెద్దగా ప్రయోజనం లేదని తేలిపోయింది. దీంతో ఎఫ్‌పీఐలు మళ్లీ త్వరలోనే మన మార్కెట్‌కు తిరిగి వస్తాయనే అంచనాలు పెరుగుతున్నాయి. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత మార్కెట్ స్థిరపడే అవకాశం ఉంది.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు...

ఇండియన్ హోటల్స్: డల్ మార్కెట్‌లోనూ ఈ షేర్లు చురుగ్గా ట్రేడవుతున్నాయి. తాజా త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుండడంతో, ఈ కౌంటర్‌పై ఇన్వెస్టర్ల ఆసక్తి మరింత పెరిగింది. ప్రస్తుతం ఈ షేర్లలో డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్స్ కూడా పెరుగుతున్నాయి. గత వారం రూ.741 వద్ద ముగిశాయి. రూ.800/840 టార్గెట్‌తో రూ.720 వద్ద మదుపరులు ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.700ను గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పాలసీ బజార్: జీవిత కాల గరిష్ఠ స్థాయి నుంచి ఈ కౌంటర్‌లో 18 శాతం దిద్దుబాటు జరిగింది. ప్రస్తుతం రూ.1,650-1,740 మధ్య కన్సాలిడేట్ అవుతోంది. మార్కెట్ దిద్దుబాటుకు లోనవుతున్నా, ఈ కౌంటర్‌లో మాత్రం పెద్దగా ఆటుపోట్లు లేవు. నిఫ్టీతో పోలిస్తే ఈ షేర్లు మెరుగ్గా ట్రేడవుతున్నాయి. గత వారం రూ.1,724 వద్ద ముగిశాయి. రూ.1,850 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,700 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.1,670ను కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గ్లాండ్ ఫార్మా: ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు 200 సింపుల్ మువింగ్ యావరేజ్ (ఎస్‌ఎంఏ) కంటే దిగువన ట్రేడవుతున్నాయి. తాజా ఆర్థిక ఫలితాలు బాగుండంతో, ఈ కౌంటర్‌లో ఇటీవల ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్స్ గణనీయంగా పెరిగాయి. గత వారం రూ.1,774 వద్ద ముగిశాయి. రూ.1,850/1,920 టార్గెట్‌తో మదుపరులు రూ.1,750 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.1,710ను గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

నౌకరి: జీవిత కాల గరిష్ఠ స్థాయి తర్వాత ఈ కౌంటర్‌లో 10 శాతం వరకు దిద్దుబాటు జరిగింది. మార్కెట్ సెంటిమెంట్ బలహీనంగా ఉన్నా, ఈ కంపెనీ షేర్లు జోరుగా ట్రేడవుతున్నాయి. ప్రస్తుతం కన్సాలిడేషన్ దశలో ఉన్నాయి. గత వారం రూ.7,768 వద్ద ముగిశాయి. ఇన్వెస్టర్లు రూ.7,840/7,900 టార్గెట్‌తో రూ.7,700 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.7,670ను కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా పవర్: ఈ కంపెనీ షేర్లు కూడా జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి 20 శాతం వరకు దిద్దుబాటుకు లోనయ్యాయి. ప్రస్తుతం రూ.400 వద్ద కీలక మద్దతు లభిస్తోంది. దీంతో ఈ షేర్లపై మదుపరుల ఆసక్తి పెరిగింది. రూ.470/510 టార్గెట్‌తో రూ.400 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.370ను గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

స్పోర్ట్స్

ఓపెనర్..రాహుల్!

జురెల్, నితీశ్‌కు చాన్స్
బుమ్రాకు పగ్గాలు

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ



పెర్త్

మరో నాలుగు రోజుల్లో ఆస్ట్రేలియాతో తొలి టెస్టు జరగాల్సి ఉండగా టీమిండియాను గాయాల బెడద వేధిస్తోంది. శుభ్‌మన్ గిల్ బొటన వేలికి ఫ్రాక్చర్ కావడంతో విశ్రాంతి అవసరం కాగా, కెప్టెన్ రోహిత్ కుటుంబ కారణాలరీత్యా అందుబాటులో ఉండడం లేదు. దీంతో 22 నుంచి జరిగే ఈ మ్యాచ్‌లో వైస్‌కెప్టెన్ బుమ్రా ఆధ్వర్యంలో టీమిండియా బరిలోకి దిగనుంది. డిసెంబరు 6 నుంచి జరిగే రెండో టెస్టులో రోహిత్ ఆడనున్నాడు. అయితే ఇంట్రా స్క్వాడ్ వామప్‌లో మోచేతి గాయానికి గురైన కేఎల్ రాహుల్ ఫిట్‌నెస్ సాధించడం భారత్‌కు సానుకూలాంశం. అతను పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ ఓవర్‌లో శుక్రవారం గాయపడ్డాడు. వెంటనే మైదానం వీడిన రాహుల్ తిరిగి బ్యాట్ పట్టలేదు. అయితే ఆదివారం మాత్రం ఎలాంటి ఇబ్బందీ లేకుండా బ్యాటింగ్ చేయడంతో టీమ్ మేనేజ్‌మెంట్ ఊపిరి పీల్చుకుంది. అలాగే మూడు గంటల పాటు జరిగిన నెట్స్‌లోనూ చురుగ్గా పాల్గొన్నాడు. దీంతో యశస్వీ జైస్వాల్‌కు జతగా రాహుల్‌ను ఓపెనర్‌గా దించాలన్న ఆలోచనలో ఉన్నారు. తాను కూడా తొలి టెస్టు ఆడేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్నట్టు రాహుల్ తెలిపాడు. సోమవారం విశ్రాంతి దినం. మ్యాచ్ జరిగే ఓప్టస్ స్టేడియంలో జట్టు మంగళవారం ప్రాక్టీస్ సాగించనుంది.

ఆరో నెంబర్‌లో జురెల్!

ఆస్ట్రేలియా 'ఎ'తో జరిగిన రెండో అనధికార టెస్టులో విశేషంగా రాణించిన ధ్రువ్ జురెల్ పెర్త్ టెస్టులో ఆడనున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే రిషభ్ పంత్ ప్రధాన కీపర్‌గా ఉండడంతో జురెల్‌ను స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆరో నెంబర్‌లో బరిలోకి దించే అవకాశం ఉందని మీడియా కథనం. కెప్టెన్ రోహిత్, గిల్ లేకపోవడంతో జట్టు జురెల్ వైపు మొగ్గు చూపుతోంది. దీనికి తోడు ఇన్‌స్టాలో టీమిండియా జెర్సీ వేసుకుని జురెల్ ఫొటో పోస్ట్ చేయడం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది.

మనోడి అరంగేట్రం ఖాయమా?

తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ కూడా టెస్టు అరంగేట్రం చేసే అవకాశం కనిపిస్తోంది. కోచ్ గంభీర్ కూడా అతడిపై ఆసక్తి చూపుతున్నాడు. హార్దిక్ తరహాలో బ్యాటింగ్‌లోనే కాకుండా నాలుగో పేసర్‌గా జట్టుకు ఉపయోగపడగలడని భావిస్తున్నారు. నితీశ్ భారత్ తరఫున బంగ్లాదేశ్‌పై ఇప్పటికే టీ20ల్లో ఆడాడు. అలాగే ఇటీవల భారత్ 'ఎ' తరఫున ఆసీస్ 'ఎ'పై ఆడినా పెద్దగా రాణించలేదు. ఇక, రెండు అనధికార టెస్టుల్లో ఒక వికెట్ మాత్రమే తీశాడు. కానీ మొత్తంగా 23 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో నితీశ్ 56 వికెట్లు తీయడం విశేషం.

హర్షిత్, ప్రసిద్ధ్ మధ్య పోటీ

తొలి టెస్టులో మూడో పేసర్ బెర్త్ కోసం ప్రసిద్ధ్ కృష్ణకు హర్షిత్ రాణా గట్టి పోటీనే ఇస్తున్నాడు. నిలకడగా గంటకు 140 కి.మీ వేగంతో బంతులు విసిరే రాణా అదనపు బౌన్స్‌తో బ్యాటర్లను ఇబ్బంది పెట్టగలడు. పెర్త్ గ్రౌండ్‌లో భారత బ్యాటర్లకు కూడా తన పదునైన పేస్‌తో సవాల్ విసిరాడు. హర్షిత్ ఇటీవల భారత్ 'ఎ' జట్టు తరఫున రెండు అనధికార టెస్టుల్లోనూ ఆకట్టుకున్నాడు.

ఆసీస్‌లోనే దేవ్‌దత్

ముందు జాగ్రత్తగా టాపార్డర్ బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్‌ను ఆస్ట్రేలియాలోనే ఉంచనున్నారు. భారత్ 'ఎ' తరఫున ఆడిన అతడిని బ్యాటింగ్ బ్యాకప్‌గా భావిస్తున్నారు. నెట్స్‌లో బుమ్రా బౌలింగ్‌ను దేవ్‌దత్ మెరుగ్గా ఎదుర్కొన్నాడని, అలాగే పేసర్లు ముకేశ్, ఖలీల్, సైనీ కూడా టీమిండియాతోనే ఉంటారని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.

షమి ఇప్పుడే వెళ్లడు!

బెంగాల్ తరఫున రంజీ ట్రోఫీలో పేసర్ మహ్మద్ షమి ఏడు వికెట్లతో రాణించాడు. దీంతో అతడిని ఆసీస్ టూర్‌కు పంపుతారని అంతా భావించారు. అయితే వెంటనే కాకుండా సిరీస్ ద్వితీయార్థంలో షమీ అక్కడికి వెళ్లే అవకాశం ఉందని సమాచారం. ఒక్క మ్యాచ్‌తో అంచనా వేయకుండా మరింత ప్రాక్టీస్ కోసం షమిని సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో కూడా ఆడించాలని భావిస్తున్నారు. అప్పుడే షమి ఫిట్‌నెస్‌పై పూర్తి స్థాయి అవగాహనకు రాగలమని బోర్డు వైద్య సిబ్బంది చెబుతున్నారు.

శ్రీనివాస్ 'ట్రిపుల్'



క్యారమ్స్ ప్రపంచ కప్

హైదరాబాద్: తెలుగు ఆటగాడు కె. శ్రీనివాస్ క్యారమ్స్ ప్రపంచకప్‌లో అదరగొట్టాడు. అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగిన ఈ మెగా ఈవెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ ఏకంగా మూడు విభాగాల్లో విజేతగా నిలిచి 'ట్రిపుల్' ఘనతను అందుకున్నాడు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో శ్రీనివాస్ సింగిల్స్ ఫైనల్లో భారత్‌కే చెందిన హకీమ్‌ను ఓడించి చాంపియన్‌గా అవతరించాడు. అంతేకాదు.. పురుషుల డబుల్స్‌తో పాటు టీమ్ చాంపియన్‌షిప్ టైటిళ్లు కూడా శ్రీనివాస్ కైవసం చేసుకున్నాడు. ఇలా, ఈ మెగా టోర్నీలో ఒకేసారి ట్రిపుల్ సాధించిన భారత క్యారమ్స్ ఆటగాడిగా శ్రీనివాస్ రికార్డు సృష్టించాడు. మరో తెలుగు క్రీడాకారుడు ఆదిత్య స్విస్ లీగ్‌లో సింగిల్స్ కాంస్యం, డబుల్స్‌లో రజతం, టీమ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో మూడు పతకాలు కొల్లగొట్టాడు.

జ్యోతి సురేఖకు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వరల్డ్ ఇండోర్ ఆర్చరీ సిరీస్ టోర్నమెంట్‌లో తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ పసిడి పతకంతో మెరిసింది. ఆదివారం లక్సెంబర్గ్‌లో జరిగిన కాంపౌండ్ విభాగం ఫైనల్లో సురేఖ 147-145తో పాస్‌మీరి మారిటా (బెల్జియం)పై నెగ్గి, విజేతగా నిలిచింది. పురుషుల విభాగంలో అభిషేక్ వర్మ స్వర్ణం కొల్లగొట్టాడు.

కార్ల్‌సన్ కమాల్



బ్లిట్జ్ టైటిల్ కూడా మాగ్నస్‌దే
అర్జున్‌కు మూడో స్థానం
టాటా చెస్ మహిళల చాంపియన్ లగ్నో

కోల్‌కతా: ప్రపంచ నెంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్ టాటా స్టీల్ చెస్ టోర్నీలో అదరగొట్టాడు. శుక్రవారంనాడు టోర్నమెంట్ ర్యాపిడ్ టైటిల్‌ను సొంతం చేసుకున్న ఈ నార్వే దిగ్గజం.. తాజాగా బ్లిట్జ్ విభాగంలోనూ విజేతగా నిలిచి డబుల్ ధమాకా మోగించాడు. 18రౌండ్ల బ్లిట్జ్ విభాగంలో మొదటి తొమ్మిది రౌండ్లు ముగిసేసరికి కార్ల్‌సన్ అగ్రస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఆదివారం జరిగిన చివరి తొమ్మిది రౌండ్లలో.. ఒక్క 17వ రౌండ్‌లో మినహా మిగిలిన అన్ని రౌండ్లలోనూ కార్ల్‌సన్ జోరు ప్రదర్శించాడు. ఈ రౌండ్‌లో కార్ల్‌సన్‌కు అర్జున్ ఇరిగేసి షాకిచ్చాడు. శనివారం జరిగిన ఎనిమిదో రౌండ్‌లోనూ కార్ల్‌సన్‌పై అర్జున్ నెగ్గడం విశేషం. ఇక.18వ రౌండ్‌లో విదిత్ గుజరాతీపై విజయం సాధించిన మాగ్నస్ మొత్తం 13 పాయింట్లతో టైటిల్ అందుకొన్నాడు. దాంతో ఈ టోర్నమెంట్‌లో రెండోసారి అతడు రెండు టైటిళ్లను దక్కించుకున్నట్టయ్యింది. 2019 లోనూ కార్ల్‌సన్ ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాలలో చాంపియన్‌గా నిలిచాడు. అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో (11.5) రెండో స్థానం కైవసం చేసుకోగా, అర్జున్ (10.5) మూడో స్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో.. మూడుసార్లు విజేత కాటెరినా లగ్నో (రష్యా) 11.5 పాయింట్లతో టైటిల్ చేజిక్కించుకుంది. తెలుగు గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి (9) నాలుగో, హారిక (8.5) ఐదో స్థానంలో నిలిచారు.

హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ సందడి



రాత్రి 7.30 నుంచి స్పోర్ట్స్ 18లో..

నేడు గచ్చిబౌలి స్టేడియంలో భారత్‌తో మలేసియా ఫ్రెండ్లీ మ్యాచ్

హైదరాబాద్: భాగ్యనగరంలో అంతర్జాతీయ ఫుట్‌బాల్ సందడి నెలకొంది. గచ్చిబౌలి స్టేడియంలో సోమవారం జరిగే ఫిఫా స్నేహపూర్వక మ్యాచ్‌లో మలేసియాతో భారత్ తలపడనుంది. రాత్రి 7.30కి మొదలయ్యే ఈ మ్యాచ్‌కు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. కాగా ఈ ఏడాది 10 మ్యాచ్‌లు ఆడిన భారత్.. ఒక్క దాంట్లోనూ నెగ్గలేదు. గాయం కారణంగా పది నెలలపాటు ఆటకు దూరమైన సీనియర్ ఆటగాడు సందేశ్ జింగన్ జట్టులోకి పునరాగమనం చేస్తుండడం జట్టు బలాన్ని పెంచేదే. ఇక.. ఇరుజట్లు గతంలో 32 సార్లు తలపడగా.. చెరో 12 మ్యాచ్‌ల్లో విజయం సాధించాయి.

హరియాణా ధమాకా


హరియాణా, తలైవాస్ మ్యాచ్ దృశ్యం

నోయిడా: ప్రొ. కబడ్డీ లీగ్ (పీకేఎల్) తాజా సీజన్‌లో హరియాణా స్టీలర్స్ జోరు కొనసాగిస్తోంది. ఎనిమిదో విజయంతో పాయింట్ల పట్టికలో తన అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా 36-29 స్కోరు తేడాతో తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 30-28తో పుణెరి పల్టన్‌ను ఓడించింది. సోమవారం జరిగే పోరులో తెలుగు టైటాన్స్‌తో హరియాణా స్టీలర్స్ బెంగళూరు బుల్స్‌తో యు ముంబా తలపడనున్నాయి.

విజేత రుత్విక జోడీ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సీఎం ట్రోఫీ ఇండియా ఇంటర్నేషన్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో గద్దె రుత్విక శివానీ జోడీ మిక్స్‌డ్ డబుల్స్ ట్రోఫీ సొంతం చేసుకుంది. ఆదివారం రాయ్‌పూర్‌లో జరిగిన ఫైనల్లో రుత్విక-రోహన్ కపూర్ ద్వయం 21-16, 19-21, 21-12తో భారత్‌కే చెందిన సూర్య-అమృత జంటపై నెగ్గింది.

విండీస్ రికార్డు ఛేదన

5 వికెట్లతో ఇంగ్లండ్ ఓటమి

గ్రోస్ ఐస్‌లెట్ (సెయింట్ లూయిస్): లూయిస్ (68), హోప్ (54) చెలరేగడంతో.. స్వదేశంలో వెస్టిండీస్ అత్యధిక లక్ష్యాన్ని ఛేదించింది. శనివారం రాత్రి జరిగిన నాలుగో టీ20లో వెస్టిండీస్ 5 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. తొలుత ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 218 పరుగుల భారీ స్కోరు చేసింది. బెథల్ (62 నాటౌట్), సాల్ట్ (55) దూకుడుగా ఆడారు. ఛేదనలో వెస్టిండీస్ 19 ఓవర్లలో 221/5 స్కోరు చేసి గెలిచింది. 2017లో భారత్‌పై 191 పరుగుల లక్ష్యఛేదనే ఇప్పటి వరకు సొంతగడ్డపై విండీస్ అత్యధికం.

అమ్మాయిలు అజేయంగా..

రాజ్‌గిర్ (బిహార్): డ్రాగ్‌ఫ్లికర్ దీపిక డబుల్ ధమాకాతో.. ఆసియా చాంపియన్స్ ట్రోఫీ లీగ్ దశను భారత మహిళల హాకీ జట్టు అజేయంగా ముగించింది. ఈపాటికే సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకొన్న భారత్.. ఆదివారం జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో 3-0తో జపాన్‌ను చిత్తు చేసింది. దీపిక రెండు, నవనీత్ కౌర్ ఒక గోల్ చేశారు. మంగళవారం జరిగే సెమీస్‌లో జపాన్‌తో భారత్, మలేసియాతో చైనా జట్లు తలపడనున్నాయి.

ఈ సాగు

చాలా స్పెషల్ గురూ!



ఖర్జూరం అనగానే మనకు ఠక్కున గుర్తుకు వచ్చేది ఎడారి ప్రాంతం అరబ్ దేశాలు. ఇప్పుడు మన రాష్ట్రంలోనే ఈ ఎడారి పంటను సాగు చేస్తున్నారు. ఒకప్పుడు విదేశాల్లో మాత్రమే పండే డ్రాగన్ ఫ్రూట్‌ను ప్రస్తుతం మన రాష్ట్రంలోని మన్యం నుంచి రాయలసీమ వరకు విరివిగా పండిస్తున్నారు. అంతేనా... స్ట్రాబెర్రీ, అవకాడో, గ్యాక్ ఫ్రూట్, చైనాలో ఎక్కువగా పండే మకడమియను కూడా మన రాష్ట్రంలో సాగు చేస్తున్నారు. ఈ పండ్లలో ఔషధ గుణాలు, పోషకాలు పుష్కలంగా ఉండటంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఈ విదేశీ పండ్ల మొక్కల సాగుకు అనువైన వాతావరణాన్ని బట్టి ఆయా ప్రాంతాల్లో నాటుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో డ్రాగన్‌ఫ్రూట్‌తో పాటు స్ట్రాబెర్రీ, అవకాడో సాగు చేస్తున్నారు. ఏపీలో స్ట్రాబెర్రీ, అవకాడో పంటలకు ఈ ప్రాంతం ప్రత్యేకత. అలాగే ఖర్జూరపు చెట్లు పెరగడానికి రాయలసీమ ప్రాంతం అనువుగా ఉంది. నీటి వినియోగం చాలా తక్కువగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటే చాలు. పోలవరం దగ్గర వినూత్నంగా గ్యాక్ ఫ్రూట్‌ను, అనంతపురం జిల్లాలో ప్రయోగాత్మకంగా మకడమియ మొక్కలు వేశారు. ఏటా పండించే సంప్రదాయ పంటలకు భిన్నంగా కొందరు ఔత్సాహిక రైతులు విదేశీ పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి మొక్కలను తెప్పించి సాగు చేస్తున్నారు. పెట్టుబడి ఎక్కువైనా అధిక ఆదాయం వస్తుందని ఈ పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో విదేశీ పండ్ల మొక్కల సాగు విస్తీర్ణం క్రమేణా పెరుగుతోంది.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

రాష్ట్రంలో విరివిగా 'వలస' పండ్లు..
విస్తరిస్తున్న విదేశీ పంటల సాగు
మన్యంలో స్ట్రాబెర్రీ, అవకాడో..
సీమ నుంచి మన్యం వరకు డ్రాగన్ ఫ్రూట్
'అనంత' ప్రత్యేకం మకడమియ ..
మార్కెట్‌లో కిలో ధర రూ.4 వేలు
కరువు సీమలో ఎడారి ఖర్జూరం సాగు

మన్యంలో కొత్త ఉద్యాన శోభ

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివాసీ రైతులు స్ట్రాబెర్రీ, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా వీటి సాగును ప్రోత్సహిస్తోంది. అరకులోయ, అనంతగిరి, లంబసింగి పరిసర ప్రాంతాల్లో దాదాపు 350 ఎకరాల్లో ఈ ఉద్యాన పంటలు ఉన్నాయి. కొన్ని చోట్ల దిగుబడులు కూడా వస్తున్నాయి. చింతపల్లి మండలంలో 2004లో కేంద్ర కాఫీ బోర్డు అధికారులు కాఫీ పంటకు నీడ కోసమని అవకాడో మొక్కలను కొంతమంది రైతులకు పంపిణీ చేశారు. ఈ మొక్కలు ఆరేళ్లుగా దిగబడులను ఇస్తున్నాయి. రైతులు కిలో రూ.120 ధరకు విక్రయిస్తున్నారు.



అల్లూరి జిల్లా రాజుపాకలులో స్ట్రాబెర్రీ మొక్క



అనంతపురం జిల్లా గుత్తి మండలం మామిళ్లచెరువులో ఖర్జూరం పంటను చూపుతున్న రైతు మహబుబ్‌బాషా

కరువు సీమలో లాభాల సిరి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి, మామిడి తోటల మీది నుంచి ఇటీవల డ్రాగన్‌ఫ్రూట్ సాగు వైపు రైతులు దృష్టి మళ్లిస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో పాటు ఒకసారి మొక్క నాటితే 20 నుంచి 25 ఏళ్ల పాటు దిగుబడి వస్తుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 70 ఎకరాల దాకా ఈ పంట సాగు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 30 ఎకరాల్లో, ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రుద్రవరం, బత్తలూరు, చాగలమర్రి గ్రామాల్లో 12 ఎకరాల్లో పంటను సాగు చేశారు. ఉమ్మడి కడప జిల్లాలో ఖర్జూరం పంట సాగు విస్తీర్ణం క్రమేణా పెరుగుతోంది. అట్లూరుకు చెందిన సునీల్‌కుమార్‌రెడ్డి 24 ఎకరాల్లో సాగు చేశారు. ఎకరాకు 75 మొక్కలు నాటారు. ఒక్కో మొక్కకు దాదాపు రూ.5వేలు పడింది. ఇలా 24 ఎకరాలకు దాదాపు రూ.90 లక్షలు ఖర్చు పెట్టారు. మొత్తం పెట్టుబడినే సుమారు రూ.2 కోట్లు వచ్చినట్లు రైతు వెల్లడించారు. ఐదేళ్ల తర్వాత పంట దిగుబడి బాగా వస్తుందని అంటున్నారు. ఖర్జూరపు పంట ఒక్కసారి సాగు చేస్తే 80 ఏళ్లకు పైగా దిగుబడి వస్తుంది. ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులు ఈ పండ్ల సాగువైపు మొగ్గు చూపుతున్నారు. అనంతపురం జిల్లాలోని 22 మండలాల్లో 134 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగవుతోంది. ఈ పంటకు ఉద్యాన శాఖ హెక్టారుకు రూ.30 వేలు చొప్పున ఒక్కో రైతుకు రెండు హెక్టార్ల వరకు సబ్సిడీ ఇస్తోంది.

కోస్తాలో విస్తరిస్తున డ్రాగన్ ఫ్రూట్

కోస్తాంధ్రలోనూ డ్రాగన్ ఫ్రూట్ సాగు విస్తరిస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరిలోని మెట్ట ప్రాంతంలో సాగు చేపడుతున్నారు. జగ్గంపేట మండలం నరేంద్రపట్నంలో ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఓ డాక్టర్ కలిసి డ్రాగన్‌ఫ్రూట్ పండిస్తున్నారు. పదెకరాల్లో రెండు దశల్లో ఈ సాగు చేపడుతున్నారు. నెల్లూరు జిల్లాలో కొంతమంది ఔత్సాహికులు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా డ్రాగన్ ఫ్రూట్, ఖర్జూరం, ఆయిల్ పామ్ వంటి పంటలకు ప్రాధాన్యమిస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌ను జిల్లాలో సుమారు 60 ఎకరాల్లో, ఖర్జూరం పంటను సుమారు 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఆయిల్ పామ్ దాదాపు 590 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రకాశం జిల్లాలోనూ డ్రాగన్ ఫ్రూట్ పండిస్తున్నారు.



సామర్లకోట-రంగంపేట ఏడీబీ రోడ్డు పక్కనే డ్రాగన్ ఫ్రూట్ అమ్మకాలు

అనంతలో మకడమియ



ప్రపంచంలో అత్యధికంగా చైనాలో పండే మకడమియ పంటను అనంతపురం జిల్లా గుమ్మఘట్ట మండలం బేలోడు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నారు. 40 డిగ్రీల వరకు ఎండను తట్టుకునే సామర్థ్యం ఉన్న ఎడారి మొక్కను సాగుచేసి రెండేళ్లు అవుతోంది. మన దేశంలో మకడమియ పంటను అసోంలో ఎక్కువగా సాగు చేస్తారు. ఇటీవల దక్షిణ భారతదేశంలో కూడా సాగు చేయడం ప్రారంభించారు. మొక్కలు నాటిన నాలుగేళ్ల నుంచి పంట చేతికొస్తుంది. మెట్టు గోవిందరెడ్డి ఏడెకరాల విస్తీర్ణంలో ఈ మొక్కలను నాటారు. ఈ పంట మధ్యలో శ్రీగంధం మొక్కలను కూడా నాటారు. ఎకరానికి 300 మకడమియ మొక్కలను నాటుకునే వీలుంది. కానీ ఆయన 250 మాత్రమే నాటారు. మిగిలిన 50 మొక్కలను శ్రీగంధం పెట్టారు. ఒక్కో మకడమియ మొక్కకు 20 కేజీల వరకు దిగుబడి వస్తుంది. 30 నుంచి 50 సంవత్సరాల పాటు పంటను తీసుకోవచ్చు. మార్కెట్‌లో కిలో మకడమియ పండ్లు రూ.2 వేల నుంచి రూ.4 వేల దాకా పలుకుతున్నాయి.

డ్రాగన్‌ఫ్రూట్... భళా

డ్రాగన్ ఫ్రూట్ సాగులో 25ఏళ్ల పాటు దిగుబడి వస్తుంది. ఎకరాకు ఐదు నుంచి పది టన్నుల దిగుబడి ఉంటుంది. టన్ను రూ.50 వేల నుంచి రూ.90 వేలు ధర పలుకుతోంది. మొక్కల వయస్సు పెరిగే కొద్ది దిగుబడి బాగుంటుంది. యాజమాన్య పద్ధతులు పాటిస్తే మొదటి ఏడాదే పెట్టిన పెట్టుబడి వస్తుంది. 15 రోజులకొకసారి పండ్లు కోతకు వస్తాయి. డ్రాగన్ పండ్లలో పోషకాలు మెండుగా ఉంటాయి. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఉంటాయి. ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, విటమిన్ సీ, ఐరన్, మెగ్నీషియం వంటి విలువైన పోషకాలు కూడా ఉంటాయి. రక్తహీనత, మధుమేహం నివారణ, బరువు నియంత్రణకు ఉపయోగపడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

సిరుల పంట గ్యాక్ ఫ్రూట్



ఏలూరు జిల్లా మామిడిగొందిలో గ్యాక్ ఫ్రూట్‌తో బొరగం వెంకట్

ఒక్కసారి సాగు చేస్తే ఏడాది పొడవునా ఫలసాయం అందించి 30 ఏళ్ల పాటు దిగుబడి రావడం గ్యాక్ ఫ్రూట్ ప్రత్యేకం. ఏలూరు జిల్లా పోలవరం మండలం మామిడిగొంది పునరావాస గ్రామానికి చెందిన యువకుడు బొరగం వెంకట్ యూట్యూబ్‌లో ఇతర దేశాల్లో పండించే పంటలు, పద్ధతులు, దిగుబడులను నిశితంగా పరిశీలించి గ్యాక్‌ఫ్రూట్ సాగు ఎంచుకున్నాడు. మన దేశంలో గ్యాక్ ఫ్రూట్ కేరళలో సాగు చేస్తున్నారు. అక్కడి నుంచి ఒక్కొక్కటి రూ.300 చొప్పున 300 మొక్కలను దిగుమతి చేసుకున్నాడు. వెంకట్ అర ఎకరం భూమిలో 300 మొక్కలు నాటాడు. 10 నెలల క్రితం సాగు చేపట్టగా 6 నెలల తరువాత మొదటి దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు సుమారు రూ.50 వేలు పెట్టుబడి పెట్టాడు. ప్రస్తుతం ఒక్కొక్క తీగ నుంచి 50 నుంచి 100 పండ్ల దిగుబడి సాధించాడు. ఒక్కొక్క పండు రూ.500 ధర పలుకుతోంది.



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యాపారికి రూ.31 లక్షలు

» బీమా కంపెనీకి ట్రైబ్యునల్ ఆదేశం

రాణె, నవంబరు 17: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యాపారికి రూ.31.39 లక్షల పరిహారం చెల్లించాలని బీమా కంపెనీని మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రైబ్యునల్ ఆదేశించింది. ఈ ప్రమాదం 2019లో జరగగా, అయిదేళ్ల అనంతరం ఇటీవల తీర్పు ఇచ్చింది. గోపీచంద్ శంకర్ పాటిల్ (38) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వేగంగా వచ్చిన కారు ఆయనను ఢీకొంది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవరు పరారు కావడంతో వివిధ సెక్షన్ల కింద పోలీసులు అతడిపై కేసు మోపారు. పరిహారం కోసం బాధితుడు ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాడు. ప్రమాదం కారణంగా 40 శాతం అంగవైకల్యం సంభవించిందని, సంపాదించే అవకాశాలను కోల్పోయానని తెలిపాడు. తనకు రూ.5 లక్షల వార్షిక ఆదాయం ఉందని, దాన్ని నష్టపోయానని పేర్కొన్నాడు. విచారణ జరిపిన ట్రైబ్యునల్ అంగవైకల్యం కారణంగా సంపాదించే శక్తిని కోల్పోయినందుకు రూ.25.65 లక్షలు, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3.74 లక్షలు మొత్తం రూ.31.39 లక్షలు పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది.

వ్యవసాయ అనుబంధశాఖల్లో బదిలీలెప్పుడో?

జిల్లా, రాష్ట్ర ప్రధాన కార్యాలయాల్లో ఏళ్ల తరబడి తిష్ఠ

» కీలక విభాగాలన్నీ ఒకరిద్దరు అధికారుల చేతిలోనే..
» స్వప్రయోజనాల కోసం అక్కడికక్కడే సీట్ల మార్పు
» గత ప్రభుత్వం బదిలీలకు అనుమతించి మొండిచేయి
» ఇప్పుడు ఉద్యోగుల హేతుబద్ధీకరణ సాకు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ, వాటి అనుబంధ శాఖల్లో ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వాలు అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నాయి. ఈ శాఖల్లో డిప్యుటేషన్ పైనో, లేదా ప్రమోషన్ ఇస్తేనో బదిలీ అవుతున్నారు తప్ప.. రెండేళ్లుగా సాధారణ బదిలీలు లేవు. ఇది కొందరు అధికారులకు బాగా కలిసొచ్చి.. జిల్లా, రాష్ట్ర ప్రధాన కార్యాలయాల్లో ఏళ్ల తరబడి తిష్ఠ వేశారు. వ్యక్తిగతంగా ప్రయోజనకరమైన స్థానాల కోసం కొందరు పైరవీలు చేసి, అక్కడక్కడే సీట్లు మారుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, సహకార, పశుసంవర్ధక, మత్స్యశాఖలు, వాటి అనుబంధ విభాగాల్లోనూ ఇదే తీరు నెలకుంది. ఆయా శాఖల్లో కీలక విభాగాలన్నీ ఒకరిద్దరు అధికారుల కిందే ఉంటున్నాయి. దీంతో బదిలీలు, డిప్యుటేషన్లు, ఎంక్వైరీలు, ఆర్థిక ప్రయోజనాల మంజూరు వంటి అంశాల్లో ఆయా అధికారులు పెద్ద ఎత్తున ప్రయోజనాలు పొందుతున్నట్లు ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వంలో నియమితులైన గ్రామ వ్యవసాయ, ఉద్యాన, పట్టు, మత్స్య, పశుసంవర్ధక సహాయకులు నాలుగేళ్లుగా బదిలీలు లేక అయిష్టంగా ఉండాల్సి వస్తోంది. గత ప్రభుత్వంలో బదిలీలకు అనుమతించినా ఈ-క్రాప్ నమోదు సాకుతో బదిలీలు పూర్తిచేయలేదు. ప్రస్తుత ప్రభుత్వమూ వాటి ఊసెత్తడంలేదు. క్షేత్రస్థాయి ఉద్యోగుల హేతుబద్ధీకరణ పేరుతో బదిలీలు చేపట్టడంలేదు.

మాతృశాఖలో వ్యవసాయ సహాయకుల విలీనం ఎప్పుడు?

మరో వైపు గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులను మాతృశాఖలో విలీనం చేయాలని ప్రభుత్వం ఆదేశించినా.. ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. విత్తన పంపిణీ, ఈ-క్రాప్ నమోదు, పొలంబడి, పంట కోత ప్రయోగాలు, ధాన్యం కొనుగోలు వంటి కార్యక్రమాలతో అధికారులు ఎప్పటికప్పుడు బదిలీల అంశాన్ని దాటవేస్తున్నారని గ్రామ వ్యవసాయ సహాయకులు పెదవి విరుస్తున్నారు. వ్యవసాయశాఖలో 6,500 మందికి పైగా గ్రామ వ్యవసాయ సహాయకులున్నా.. గత ప్రభుత్వం కేవలం 449 మందికే వ్యవసాయ విస్తరణాధికారులుగా పదోన్నతి కల్పించింది. అలా ఖాళీ అయిన స్థానాల్లో గ్రామ సహాయకులను ఇన్‌చార్జిలుగా నియమించి బాధ్యతలు అప్పగించడంతో వీరికి పనిభారం పెరిగిందని వాపోతున్నారు. గతంలో పంట కోత ప్రయోగాలకు ప్రతి గ్రామంలో ప్రైమరీ వర్కర్ పేరుతో కాంట్రాక్టు సిబ్బంది ఉండేవారు. గత ప్రభుత్వం ఆ వ్యవస్థను తీసేసి, గ్రామ సహాయకులతోనే ఆ పనులన్నీ చేయించింది. దీంతో మహిళా గ్రామ సహాయకులు పంట కోత ప్రయోగాలు చేయాలంటే ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, రెవెన్యూ, ప్లానింగ్, సివిల్ సప్లయిస్ శాఖలకు సంబంధించిన పనులన్నీ వ్యవసాయ అనుబంధశాఖల సహాయకులతో చేయిస్తుండటంతో పని ఒత్తిడికి గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి ఇప్పటికైనా మాతృశాఖలో విలీనం చేసి, బదిలీలు చేపట్టాలని వీరు కోరుతున్నారు.

చిన్న తప్పు.. పెద్ద దండన!

» విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు.. ఆపై టీసీ ఇచ్చి ఇంటికి
» సౌండ్ బాక్స్ జాక్ తొలగించడమే కారణం

కలిగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆ విద్యార్థి చేసింది చిన్న తప్పిదమే. కానీ ఆ ఉపాధ్యాయుడు మాత్రం కోపోద్రిక్తుడైపోయాడు. విద్యార్థి జుట్టు పట్టుకొని ఈడ్చి ఈడ్చి కాళ్లతో తంతూ.. చేతులతో కొడుతూ, అసభ్య పదజాలంతో దుర్భాషలాడాడు. అంతేకాదు.. సహోపాధ్యాయుడి అండతో విద్యార్థికి టీసీ ఇప్పించి పంపించేశాడు. బాధితుల కథనం మేరకు.. అంబేడ్కర్ నగర్‌కు చెందిన చేవూరి అభిషేక్ స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. 14న బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో సౌండ్ బాక్సులు ఏర్పాటు చేశారు. తెలిసో తెలియకో అభిషేక్ ఆ సౌండ్ బాక్స్ వెనుక ఉన్న జాక్‌ను తొలగించాడు. అంతే, తెలుగు ఉపాధ్యాయుడు మన్నం శ్రీనివాసులు ఆగ్రహంతో ఊగిపోయాడు. విద్యార్థి జుట్టు పట్టుకొని, చెయ్యి మెలితిప్పి, బెంచ్‌పై పడేసి విపరీతంగా కొట్టాడు. సహోపాధ్యాయుడైన వీరరాఘవులుకు చెప్పి.. బలవంతంగా టీసీ ఇప్పించి ఇంటికి పంపించేశారు. విద్యార్థి తండ్రి ఆనంద్ శనివారం పాఠశాలకు వచ్చి హెచ్ఎం భీమేశ్వరరావుని కలవగా, ఈ విషయంలో తానేమీ చేయలేనని, సదరు ఉపాధ్యాయుడు వద్దకు వెళ్లి తేల్చుకోమని సూచించాడు. దీంతో శ్రీనివాసులు వద్దకు వెళ్లగా, ఆయన విద్యార్థి తండ్రి ఎదురుగానే తిట్ల పురాణం ఎత్తుకున్నాడు. దళిత సామాజిక వర్గమని 10మందిని వెనకేసుకొని వస్తే.. తాను తన పలుకుబడిని ఉపయోగించి 50 మందితో మీ పిల్లల్ని కొట్టి చంపేస్తానని బెదిరించాడు. దీంతో మన్నం శ్రీనివాసులు నుంచి తనకు, తన పిల్లలకి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ ఆనంద్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న పలువురు ఆ ఉపాధ్యాయుడి వ్యవహారశైలితో తమ పిల్లలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పోలీసుల వద్ద వాపోయారు.

క్షామాన్ని జయిద్దాం!

వరద జలాలను ఒడిసిపడదాం

కరువులోనూ అందుబాటులో నీరు
జల విధానం రూపకల్పనలో కూటమి సర్కార్
రాష్ట్రంలో అందరికీ తగినంత జలాలు అందడమే లక్ష్యం



అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): క్షామాన్ని జయించేలా జల విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్ర జల వనరుల శాఖ సిద్ధమైంది. వరద సమయంలో జలాలను ఒడిసిపట్టి.. రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నింపుతూ.. భూగర్భంలోనూ జలాలను నిల్వపెట్టే విధానం అమలుకు కార్యాచరణను సిద్ధం చేసింది. రాష్ట్రంలో కరువు నివారణ చర్యల కోసం బహుళార్థ ప్రణాళికలను జల వనరుల శాఖ రూపొందించింది. రాష్ట్ర జల యాజమాన్య నిర్వహణను సమర్థవంతంగా, సుస్థిరతను సాధించేలా నీటి వినియోగం ఉండేలా జల విధానాన్ని తీసుకువస్తోంది.

జల విధానం లక్ష్యాలు ఇవీ..

రాష్ట్రంలో ఆహార భద్రత తరహాలో జలభద్రతనూ కల్పించాల్సిన అవసరం ఉందని జల వనరుల శాఖకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో బుధవారం జరిగిన సమీక్షలో గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానంతోపాటు జల విధానంపైనా కూలంకషంగా చర్చించారు. రాష్ట్రంలో అందరికీ తగినంత జలాలు అందాలన్న లక్ష్యంతో జల విధానం-2024ను రూపొందించాలని జల వనరుల శాఖను సీఎం ఆదేశించారు. ప్రతి ఎకరాకూ నీరందేలా, ప్రతి గ్రామానికీ తాగునీరు చేరేలా జల విధానాన్ని రూపొందించాలని నిర్దేశించారు. గృహావసరాలు, తాగునీరు, వ్యవసాయం, పరిశ్రమలు, చేపలు, రొయ్యలు, పర్యాటకం, జల విద్యుత్ రంగాలకు తగినంత నీటిని అందించేలా జల విధానం-2024 లక్ష్యాలను నిర్దేశించుకుంది.

976 మి.మీ. సగటు వర్షపాతం

రాష్ట్రంలో సగటున 976.17 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతోంది. ఇందులో ఈశాన్య రుతుపవనాల సమయంలో 24 శాతం, నైరుతి రుతుపవనాల సమయంలో 66 శాతం వర్షపాతం నమోదవుతోంది. రాష్ట్రంలో ఉత్తరాది ప్రాంతంలో 45 నుంచి 61 రోజులపాటు సుమారు 2.5 మి.మీ. వర్షపాతం నమోదవుతుంటే.. ప్రకాశం, నెల్లూరులో కొంత భాగం, కడప, కర్నూలులో 40 నుంచి 45 రోజుల పాటు, అనంతపురంలో అతితక్కువగా 40 రోజులు మాత్రమే వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది అక్టోబరు నాటికి రాష్ట్రంలోని జలవనరుల్లో 332.5 టీఎంసీల జలాలు నిల్వ ఉండగా, ఎగువ నుంచి భారీగా వచ్చిన జలాలు రావడంతో ప్రస్తుతం 1425 టీఎంసీల జలాలు రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయి. భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల్లో 85.44 శాతం మేర జలాలు పెరిగి 840.25 టీఎంసీల నిల్వ ఉన్నట్టు జలవనరుల శాఖ రికార్డులు వెల్లడించాయి. మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో 88.21 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. అలాగే భూమిలో తేమ రూపంలో 488.23 టీఎంసీలు ఉన్నాయి.



రోజంతా నీటి సరఫరా..

గ్రామాల్లోనూ, నగరాల్లోనూ రోజంతా నీటి సరఫరా జరిగేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నీటి వృథాను అరికడుతూ.. జలాలను పునర్వినియోగం చేసేలా చర్యలు చేపట్టనున్నారు. వ్యవసాయానికి, పశుసంపదకు సమర్థ నీటివినియోగం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనికోసం సాంకేతికతను వినియోగించనున్నారు. నీటివనరులు సురక్షితంగా ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. భూగర్భజలాల పరిరక్షణకు బలమైన చట్టాలు రూపొందించేలా ఆలోచనలు చేస్తున్నారు. వరద జలాలను నిల్వచేస్తూ రాష్ట్రమంతా ప్రవాహాలు, నిల్వలు ఉండేలా చర్యలు చేపడుతున్నారు. వరద జలాల పరిరక్షణలో మహిళలనూ భాగస్వామ్యం చేయాలని జలవనరుల శాఖ నిర్ణయించింది.



రాష్ట్రంలో 19 లక్షల వ్యవసాయ పంపుసెట్లు..

రాష్ట్రంలో 19 లక్షల వ్యవసాయ పంపుసెట్లను రైతులు వాడుతున్నారు. రాష్ట్రంలోని 49 మండలాల పరిధిలోని 2,552 గ్రామాలు భూగర్భజలాలు లేని సమస్యను ఎదుర్కొంటున్నాయి. దీంతో భూగర్భజలాల వినియోగంపై కఠిన చర్యలు, ఆంక్షలు విధించాలని నిర్ణయించారు. గ్రామీణ రక్షిత మంచినీటి పథకాన్ని సమర్థ యాజమాన్య విధానంలో నిర్వహించాలని, డ్యామ్ సేఫ్టీ యాజమాన్య నిర్వహణను సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించారు. నీటి వనరులను ఆక్రమణల నుంచి రక్షించడానికి బలమైన చట్టాలను ఉపయోగించాలని జల విధానంలో పేర్కొన్నారు. నీటి పొదుపు విధానాలపై సాంకేతికతను జోడించాలని నిర్ణయించారు. నీటి సంరక్షణలో లబ్ధిదారులను భాగస్వాములను చేస్తారు.

మాజీ మంత్రి కొడాలి నానిపై కేసు

- సీఎం చంద్రబాబు, లోకేశ్‌పై అసభ్య వ్యాఖ్యలు
- విశాఖ పోలీసులకు ఏయూ విద్యార్థిని ఫిర్యాదు



విశాఖపట్నం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ మంత్రి కొడాలి వెంకటేశ్వరరావు(నాని)పై విశాఖ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌పై గతంలో ఆయన అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు అసభ్య పదజాలంతో గతంలో దూషించిన వీడియోలు వైరల్‌గా మారాయి. వీటిపై ఏయూలో న్యాయవిద్య అభ్యసిస్తున్న సత్యాల అంజనాప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వీడియోలను చూసి, దూషణలను విని ఒక మహిళగా తీవ్ర మనస్తాపం చెందానని, కొడాలి నానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు. ఈ మేరకు నానిపై సీఐ రమణయ్య కేసు నమోదు చేశారు.

హోంమంత్రి అనితపై అనుచిత పోస్టులు

- అనకాపల్లిలో వ్యక్తి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు
- కదిరిలో వైసీపీ కార్యకర్త ఇంటికి మరో నోటీసు




దేవరాపల్లి(అనకాపల్లి)/కదిరి అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ కార్యకర్తల అరెస్టులు కొనసాగుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం నాగిరెడ్డిపల్లెకు చెందిన నగనూరు బాలాజీరెడ్డి సామాజిక మాధ్యమాల్లో హోంమంత్రిపై అసభ్యకరమైన పోస్టులు పెట్టారని అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఈ నెల 5న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం నాగిరెడ్డిపల్లెకు వెళ్లారు. వారం రోజుల పాటు అక్కడే మకాం వేసి నిఘా పెట్టారు. శనివారం రాత్రి అతని ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఆదివారం ఉదయం అనకాపల్లిలో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. నిందితుడికి రెండు వారాల పాటు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కాగా, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడంతో పాటు డ్రగ్స్ ముఠాతో సంబంధాలున్నాయంటూ అసత్య ప్రచారం చేసిన శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం వీరచిన్నయ్యగారిపల్లికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అమర్‌నాథ్‌రెడ్డిపై బాపట్లకు చెందిన ఐటీడీపీ కార్యకర్త రాజా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అమర్‌నాథ్‌రెడ్డి ఇంటికి నోటీసులు ఇవ్వడానికి పోలీసులు ఆదివారం వీరచిన్నయ్యగారిపల్లికి వచ్చారు. అతను అందుబాటులో లేకపోవడంతో నోటీసు ఇంటికి అంతికించారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నట్లు కదిరి అప్‌గ్రేడ్ సీఐ మోహన్ వెల్లడించారు. కాగా, అమర్‌నాథ్ రెడ్డి ఇంటికి పోలీసులు నోటీసు అతికించడం ఇది రెండోసారి. ఇదే ఫిర్యాదుపై విశాఖ వన్‌టౌన్ పోలీసులు ఈ నెల 15న అమర్‌నాథ్‌రెడ్డి ఇంటికొచ్చారు. అతను లేకపోవడంతో ఇంటికి నోటీసు అతికించి వెళ్లారు.

రాష్ట్ర మంత్రివర్గ భేటీ ఎల్లుండికి వాయిదా

అమరావతి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. సోమవారం సచివాలయంలో నిర్వహించాల్సిన ఈ భేటీని బుధవారాని(20వ తేదీ)కి వాయిదా వేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు శనివారం హైదరాబాద్‌లో అనారోగ్యంతో మరణించడంతో సీఎం ఢిల్లీ, మహారాష్ట్రల్లో జరగాల్సిన అన్ని కార్యక్రమాలను వాయిదా వేసుకుని.. హైదరాబాద్ చేరుకున్నారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తమ స్వగ్రామం నారావారిపల్లె వెళ్లారు. రామ్మూర్తినాయుడి పార్థివ దేహానికి ఆదివారం అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. చంద్రబాబు సోమవారం సాయంత్రం వరకు అక్కడే ఉంటారు. ఈ కారణంగా మంత్రివర్గ సమావేశాన్ని వాయిదా వేశారు.

చంద్రబాబు అరెస్టు వెనుక

సీఐడీ మహాకుట్ర!



(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్ష నేత చంద్రబాబు అరెస్ట్ విషయంలో కుట్రపూరితంగా వ్యవహరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అరెస్టు చేయడానికి జగన్ సర్కార్ కనీవినీ ఎరుగని రీతిలో మహాకుట్రకు పాల్పడినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. స్కిల్ కేసులో ఎలాగైన చంద్రబాబును అరెస్ట్ చేయాలన్న ఉద్దేశంతో నాటి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పీవీ రమేశ్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను సీఐడీ అధికారులు తారుమారు చేశారు. ఆయన ఇచ్చిన 161 స్టేట్‌మెంట్‌ను మార్చేసి, తాడేపల్లి డైరెక్షన్‌లో కథ నడిపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేయడం అక్రమమని ఆనాడే న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. కేసు పెట్టడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. చంద్రబాబు అవినీతికి పాల్పడినట్టు సీఐడీ ఒక్క ఆధారం కూడా చూపలేకపోయింది. అసలు ఈ కేసే అక్రమమని, చంద్రబాబును కుట్రపూరితంగా కేసులో ఇరికించి అరెస్ట్ చేశారని తాజాగా బట్టబయలైంది.

మొదట్నుంచీ కుట్ర

జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్కిల్‌డెవలప్‌మెంట్ కేసుపై ప్రత్యేక దృష్టిపెట్టింది. కానీ ఎక్కడా స్కామ్ జరిగినట్టు నిరూపించలేకపోయింది. అయినప్పటికీ నాటి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గంటా సుబ్బారావును అరెస్టు చేసింది. అప్పట్లో డైరెక్టర్‌గా వ్యవహరించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ ఇంటికి సీఐడీ అధికారులు వెళ్లి నానా యాగీ చేశారు. ఈ కేసులో మరిన్ని అరెస్టులు కూడా చోటు చేసుకున్నాయి. ఈ మొత్తం ఎపిసోడ్‌లో చంద్రబాబు పాత్ర ఉన్నట్లు అధికారికంగా ఎక్కడా నిరూపణ కాలేదు. అయినా బలమైన ఆధారాలు లభించాయని సీఐడీ అధికారులు హడావుడి చేశారు. చంద్రబాబు నంద్యాల పర్యటనలో ఉన్నప్పుడు అర్ధరాత్రి సమయంలో అప్పటి సీఐడీ డీఐజీ కొల్లి రఘురామరెడ్డి బృందం వెళ్లి హైడ్రామా మధ్య ఆయన్ను అరెస్టు చేసింది. చంద్రబాబు వయసును కూడా పరిగణనలోకి తీసుకోకుండా దాదాపు 400కి.మీ. రోడ్డు మార్గంలో విజయవాడకు తీసుకువచ్చారు. కోర్టులో హాజరు పరిచి, రాజమండ్రి జైలుకు తరలించారు.

సీఐడీ వక్రభాష్యం

స్కిల్ ప్రాజెక్టు చెల్లింపుల విషయంలో తాను అభ్యంతరం చెబితే నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అనేకసార్లు ఫోన్ చేసి, ఒత్తిడి చేసి డబ్బులు విడుదల చేయించారని పీవీ రమేశ్ చెప్పినట్లు సీఐడీ కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. చంద్రబాబు అరెస్టుకు దాన్నే ప్రధాన ఆయుధంగా సీఐడీ మలుచుకుంది. తాను ఇచ్చిన స్టేట్‌మెంట్ ద్వారా చంద్రబాబును అరెస్టు చేశారన్న విషయాన్ని పీవీ రమేశ్ అప్పుడే ఖండించారు. స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో ఆర్థిక చెల్లింపులపై అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎలాంటి తప్పులు చేయలేదని, అలాంటప్పుడు తప్పు జరిగినట్లు తాను ఎలా చెబుతానని పీవీ రమేశ్ నిలదీశారు.

అడ్డగోలు ఆరోపణలు

అప్పట్లో ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన పీవీ రమేశ్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా చంద్రబాబును అరెస్టు చేసినట్లు సీఐడీ అధికారులు ప్రకటించారు. చంద్రబాబు మొత్తం నిబంధనలన్నీ తుంగలో తొక్కారని, రూ.వందల కోట్ల కుంభకోణానికి ఆయన చర్యలే కారణమని పీవీ రమేశ్ తన వాంగ్మూలంలో చెప్పినట్లు పేర్కొన్నారు. వాస్తవానికి సుమారు రూ.3,500కోట్ల విలువైన స్కిల్ ప్రాజెక్టులో 90 శాతాన్ని సిమెన్స్, డిజైన్‌టెక్ కంపెనీలు గ్రాంట్ కింద భరిస్తుండగా, 10శాతం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద ఇస్తుంది. అయితే సుమారు రూ.370కోట్ల ప్రభుత్వ వాటాను ఆ కంపెనీలకు అక్రమంగా చెల్లించారని, ఆ డబ్బులు తిరిగి షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకే వచ్చాయని అప్పట్లో సీఐడీతో పాటు జగన్ అనుకూల మీడియా ఆరోపించింది. చంద్రబాబు దిగిపోయే సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 40 ఇంజనీరింగ్ కాలేజీల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేశారు. దాదాపు 4 లక్షల మందికి శిక్షణ ఇవ్వగా, అప్పటికే 60 వేలమందికి పైగా ఉద్యోగాల్లో చేరారు. ఆ తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వంలో కూడా ఆ కేంద్రాలను కొనసాగించింది. సీఐడీ చెప్పినట్లు ప్రభుత్వం చెల్లించిన డబ్బంతా తిరిగి చంద్రబాబుకే ఇస్తే ఆ కంపెనీలు ఇన్ని లక్షల మందికి ఎలా శిక్షణ ఇస్తాయి? అన్న ప్రశ్న అప్పట్లోనే తలెత్తింది. ప్రభుత్వం చెల్లించిన మొత్తం కంటే మూడు రెట్లు విలువైన శిక్షణా పరికరాలను ఇంజనీరింగ్ కాలేజీల్లో ఉన్న శిక్షణా కేంద్రాలకు సరఫరా చేశారు. స్కిల్ ప్రాజెక్టు మొత్తం స్కామ్ అయితే శిక్షణా పరికరాలు ఎలా వచ్చాయి? అన్నది మరో ప్రశ్న. సీఐడీ మాత్రం శిక్షణ పొందిన విద్యార్థులు, ఉద్యోగాలు పొందినవారు, శిక్షణా కేంద్రాల్లో ఉన్న కోట్ల విలువైన పరికరాల గురించి ఎప్పుడూ పట్టించుకోలేదు. ఎంతసేపటికి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా చేసిన చెల్లింపుల మీదే తన దండయాత్ర అని అడ్డగోలుగా వాదించింది.

తాడేపల్లి డైరెక్షన్‌లో తారుమారు

పీవీ రమేశ్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌కు సీఐడీ అధికారులు అప్పట్లో చెప్పిన దానికి పొంతన లేకపోవడం వెనుక పెద్ద కుట్రే నడిచింది. చంద్రబాబును ఎలాగైనా ఈ కేసులో ఇరికించి అరెస్టు చేయాలన్న కుట్రతో జగన్ సర్కార్ అనేకమంది అధికారులను పిలిచి స్టేట్‌మెంట్ నమోదు చేసింది. అందులో భాగంగానే పీవీ రమేశ్ నుంచి కూడా సీఐడీ 161 స్టేట్‌మెంట్ తీసుకుంది. దానికి ముందుగా ప్రశ్నావళిని ఆయనకు పంపించి సమాధానాలు రాసి పంపించాలని అధికారులు కోరారు. సీఐడీ అధికారుల విన్నపం మేరకు ఆయన రిజిస్టర్ పోస్టు ద్వారా సమాధానాలు పంపించారు. ఆ తర్వాత సీఐడీ మళ్లీ మరికొన్ని ప్రశ్నలు లేవనెత్తింది. ఇలా మూడుసార్లు సీఐడీ అధికారులు అడిగిన ప్రశ్నలకు పీవీ రమేశ్ సమాధానాలు పంపారు. సీమెన్స్ సంస్థకు చెల్లింపుల సమయంలో తాను ఆ బాధ్యతల్లో లేనని, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, జగన్‌కు ముఖ్య సలహాదారుగా పనిచేసిన అజేయ కల్లం ఆ బాధ్యతల్లో ఉన్నారని తెలిపారు. కానీ అసలు వ్యవహారం అక్కడే నడిచింది. పీవీ రమేశ్ ఇచ్చిన స్టేట్‌మెంట్ మొత్తాన్ని సీఐడీ అధికారులు మార్చేశారు. ఆయన చెప్పని విషయాలను సీఐడీ అధికారులు తాడేపల్లి డైరెక్షన్‌లో జోడించారు. దాన్నే తమ కేసులో బలంగా చూపించి చంద్రబాబును అరెస్టు చేశారు. అప్పటి సీఐడీ చీఫ్ సంజయ్, డీఐజీ కొల్లి రఘురామిరెడ్డి ఈ కేసుకు సంబంధించి చాలా ప్రకటనలు చేశారు. అవసరం లేకపోయినా ఊరూవాడా ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ ప్రచారం చేశారు. చంద్రబాబు అధికారులను బెదిరించారని, దబాయించారని, దానికి తమ వద్ద ఆధారాలున్నాయని చెప్పారు. కానీ సీనియర్ ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను మాయం చేసి, తమ సొంత స్టేట్‌మెంట్‌నే కోర్టులకు సమర్పించినట్టు తెలుస్తోంది.

ఇదీ అసలు సంగతి

చంద్రబాబు అరెస్టు తర్వాత తన స్టేట్‌మెంట్‌లో తప్పేముందో, దాని ఆధారంగా చంద్రబాబును అరెస్టు చేయడం ఏమిటో అర్థంకాక పీవీ రమేశ్ ఆ విషయాన్ని బహిరంగంగానే ప్రకటించారు. తాజాగా కేసు విచారణలో భాగంగా సీఐడీ అధికారులు ఆయనతో మాట్లాడినప్పుడు అసలు విషయం బయటపడింది. తన పేరుతో సీఐడీ రికార్డుల్లో 161 స్టేట్‌మెంట్‌లో ఉన్న అంశాలు ఏవీ తాను చెప్పినవి కావని ఆయన కుండబద్దలు కొట్టారు. తాను పంపించిన స్టేట్‌మెంట్ కాపీ తనవద్ద ఉందని, తానిచ్చానని చెబుతున్న స్టేట్‌మెంట్ ప్రతిని పంపితే ఎక్కడ గోల్‌మాల్ జరిగిందో గుర్తించి చెప్పగలనని ఆయన సీఐడీని కోరినట్లు తెలిసింది. తప్పుడు పద్ధతుల్లో స్టేట్‌మెంట్ తారుమారు చేసి ఒక మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేయించిన జగన్ లీలా విన్యాసాలు ఇప్పుడు బయటకు రావాల్సి ఉంది.

బాబు అరెస్టుకు.. నా స్టేట్‌మెంట్లతో లింకా?

- నాటి ఇంటర్వ్యూలో రిటైర్డ్ ఐఏఎస్ పీవీ రమేశ్ ఖండన



అమరావతి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు అరెస్టుకు.. తాను సీఐడీకి ఇచ్చిన స్టేట్‌మెంట్లే ప్రాతిపదికంటూ ఆ విభాగం అధికారులు చెప్పడాన్ని విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ గతంలోనే ఖండించారు. మేజిస్ట్రేట్ ముందు, పోలీసులకు తానిచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగానే చంద్రబాబును అరెస్టుచేశామని వారు చేసిన ప్రకటన తనకు ఆందోళన, దిగ్భ్రాంతి కలిగించినట్లు అప్పట్లో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. వారి ప్రకటన అసంబద్ధంగా ఉందని.., నమ్మశక్యంగా లేదని.. అరెస్టుకు కారణమయ్యే ఎలాంటి అంశాలూ ఆ స్టేట్‌మెంట్లలో లేనేలేవని తేల్చిచెప్పారు. 'నేను, నాటి ఆర్థిక శాఖ కార్యదర్శి సునీత రాసిన నోటింగ్స్‌ను వేరే విధంగా వక్రీకరించారు. కేబినెట్ ఆమోదం మేరకే స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటైంది. మంత్రివర్గం నిర్ణయం లేకుండా ఏ శాఖ, కార్పొరేషన్ ఏర్పాటు సాధ్యం కాదు, బడ్జెట్ కేటాయింపు కూడా కుదరదు. కార్పొరేషన్ ఇప్పటికీ అమల్లోనే ఉందికదా! లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ఫైళ్లను మాయం చేశారనడమూ అసంబద్ధమే, సీఎం గానీ, మంత్రులు గానీ, కార్యదర్శులు గానీ ఫైళ్ల సంరక్షకులు కాదు. అలా మాయమై ఉంటే బాధ్యులెవరో గుర్తించి చర్యలు చేపట్టాలి. చంద్రబాబు అసాధారణ విజనరీ. (రాష్ట్ర విభజన జరిగిన) రెండేళ్లలో తన సామర్థ్యంతో విద్య, వ్యవసాయం సహా పలు రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాల కోసం పలు సంస్థల నుంచి 30 వేల కోట్ల రుణం తీసుకురాగలిగారు. ఆయనతో సన్నిహితంగా పనిచేశాను. ఆయనపై ఎనలేని గౌరవం ఉంది. నా స్టేట్‌మెంట్లలో ఆయన్ను అరెస్టు చేసేందుకు దారితీసే అంశం ఒక్కటీ లేదు. డిజైన్‌టెక్ సంస్థకు నిబంధనల ప్రకారమే నిధులు విడుదలయ్యాయి. ఇందులో అవకతవకలకు ఆస్కారమే లేదు. నేను రాసిన నోట్‌పై లీక్‌కు చట్టబద్ధతే లేదు. అది చిత్తుపుస్తకం లాంటిది. దాని ఆధారంగా అరెస్టు చేశామనడం హాస్యాస్పదం. శాసనసభ కేటాయించిన.. ఆర్థికశాఖ ఆమోదించిన బడ్జెట్‌పై ఇంత గగ్గోలు చేయడం, క్రిమినల్ చర్యగా పరిగణించడం తొలిసారి చూస్తున్నాను' అని పేర్కొన్నారు.

గనుల ఘనుడు వెంకటరెడ్డి విడుదల

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగా పరిగణించింది. ఆ తీవ్రత ఏసీబీ అధికారుల్లో కనిపించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. వెంకటరెడ్డికి బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ దాఖలైనప్పటి నుంచి బలంగా కౌంటర్లు దాఖలు చేయలేకపోయారనే వాదన వినిపిస్తోంది. పైగా కోర్టుకు ఆధారాలను సమర్పించడానికి కొన్నిసార్లు గడువు అడిగినప్పటికీ వాటిని సకాలంలో సమర్పించలేకపోయారు. మరోవైపు బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ ఎలాంటి అభ్యంతరాలు కూడా చెప్పకపోవడం వల్లే న్యాయస్థానం వెంకటరెడ్డికి బెయిల్ మంజూరు చేసిందని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. చివరికి బెయిల్ మంజూరైందన్న విషయాన్ని కూడా చాలా గోప్యంగా ఉంచారు. ఏసీబీ కోర్టు ఆయనకు శుక్రవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.50 వేల పూచీకత్తు సమర్పించాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని షరతులు విధించింది. అదేవిధంగా ప్రస్తుత, పూర్వ చిరునామాను కోర్టుకు అందజేయాలని స్పష్టం చేసింది. ప్రతి శనివారం ఏసీబీ సీఐయూ అధికారుల ముందు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. పూచీకత్తును ఆయన శనివారం కోర్టుకు అందజేశారు. అనంతరం విజయవాడలోని జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు.

చంద్రబాబు విషయంలో అలా..

జగన్ సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు సహా పలువురు నాయకులు, అధికారులపై ఏసీబీ కేసులు నమోదు చేసింది. వాటి విచారణ విజయవాడలోని ఏసీబీ కోర్టులో జరిగింది. అప్పుడు పనిచేసిన అధికారులు, సిబ్బంది ప్రతి చిన్న విషయానికి చాలా హడావిడి చేసేవారు. కోర్టులో ఏయే పిటిషన్లు, మెమోలు దాఖలు చేయబోతున్నారో ముందుగానే లీక్‌లు ఇచ్చేవారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సరైన ఆధారాలు లేకపోయినా చంద్రబాబుకు బెయిల్ లభించడానికి 2 నెలలు పట్టింది. కానీ వెంకటరెడ్డి విషయంలో తీవ్ర అభియోగాలతో పాటు ఆధారాలు ఉన్నా ఏసీబీ సమర్థంగా వ్యవహరించకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

ఢిల్లీని కమ్మేసిన పొగమంచు

107 విమానాలు ఆలస్యం



న్యూఢిల్లీ, నవంబరు 17: దేశ రాజధాని ఢిల్లీలో వాయు నాణ్యత రోజురోజుకు క్షీణిస్తోంది. ఆదివారం వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) ప్రమాదకర స్థాయిలో 428గా నమోదైంది. ఏక్యూఐ 400 పైబడి నమోదు కావడం ఇది వరుసగా ఐదో రోజు. రాజధాని ప్రాంతంలోని బవానాలో అత్యధికంగా 471, అశోక్ విహార్, జహంగీర్‌పురిలో 466, ముండ్కా, వజీర్‌పుర్‌లో 463గా నమోదయ్యింది. ఢిల్లీని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో 107 విమానాలు ఆలస్యమయ్యాయి. 3 విమానాలు రద్దయ్యాయి. పొగమంచుతో ఇందిరాగాంధీ విమానాశ్రయంలో 'విజిబులిటీ' 800 మీటర్లకు పడిపోయింది. కాగా, కాలుష్య కోరల్లో చిక్కుకున్న ఢిల్లీలో ఇప్పటికే ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. అత్యవసరం కాని నిర్మాణాలు, కూల్చివేతలపై నిషేధం కొనసాగుతోంది.

మోదీ నాయకత్వాన..

ప్రగతి పథంలో భారత్!

- 5 ట్రిలియన్ల ఆర్థిక శక్తిగా ఎదగాలంటే ఎన్డీయే ప్రభుత్వమే ఉండాలి: పవన్ కల్యాణ్
- నా పిల్లలతో మరాఠీలోనే మాట్లాడతా
- ఆ భాషపై గౌరవంతోనే నేర్చుకున్నా
- పుణెలో నాకు ఇల్లు కూడా ఉండేది
- సనాతన ధర్మంపై దాడిచేస్తే ఊరుకోను
- కచ్చితంగా పోరాడతా: ఉపముఖ్యమంత్రి
- మహాయుతి అభ్యర్థుల తరఫున రెండో రోజూ ప్రచారం



పుణెలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రోడ్ షో

అమరావతి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం దేశాన్ని ప్రగతి పథాన తీసుకెళ్తోందని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సుస్థిర పాలన, సమగ్ర అభివృద్ధితోనే బలమైన ఆర్థిక వ్యవస్థ సాధ్యమని చెప్పారు. భారత్ ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలంటే కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం, మహారాష్ట్ర మహాయుతి సర్కారు ఉండాలని ఆకాంక్షించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి అభ్యర్థుల తరఫున ఆదివారం వరుసగా రెండో రోజూ ఆయన ప్రచారం నిర్వహించారు. చంద్రాపూర్ జిల్లా పరిధిలోని బల్లార్‌పూర్, పుణే కంటోన్మెంట్, చంద్రాపూర్ నియోజకవర్గాల్లో భారీ ర్యాలీ, బహిరంగ సభల్లో ప్రసంగించారు. బల్లార్‌పూర్ మినీ భారతదేశంలాంటిదని, ఇక్కడ అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, రకరకాల భాషలు మాట్లాడే ప్రజలు కలిసికట్టుగా ఉంటారన్నారు. మన బతుకమ్మ, మన సమ్మక్క సారక్క జాతరను ఈ నేలపై జరుపుకొంటారని చెప్పారు. కానీ హైదరాబాద్ పాతబస్తీ నుంచి వచ్చిన కొందరు సమ్మక్క సారక్కను, బతుకమ్మను అపహాస్యం చేస్తున్నారని.. భారతీయ సంస్కృతిని, పండుగలను విమర్శిస్తున్నారని దుయ్యబట్టారు. సనాతన ధర్మాన్ని అగౌరవపరిచేవారికి.. ఆ ధర్మాన్ని అవలంబించేవారు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అన్ని మతాలను సమానంగా చూసే సనాతన ధర్మంపై దాడి జరిగితే చూస్తూ ఊరుకోనని.. కచ్చితంగా బయటకు వచ్చి తన వంతు పోరాటం చేస్తానని ప్రకటించారు. జనసేన ఏర్పాటు వెనుక మహారాష్ట్రకు చెందిన మహనీయుల స్ఫూర్తి ఉందని.. తనకు స్ఫూర్తినిచ్చిన వారిలో ఛత్రపతి శివాజీ, బాలాసాహెబ్ ఠాక్రే ఉన్నారని తెలిపారు. ఆదివారం ఠాక్రే వర్ధంతిని పురస్కరించుకుని ఆయన ఘన నివాళులు అర్పించారు. శివసేన, జనసేన రెండూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం పని చేసేవేనని పవన్ చెప్పారు. తన ఇద్దరు పిల్లలతో మరాఠీలోనే మాట్లాడతానన్నారు. ఈ భాషపై గౌరవంతోనే మరాఠీ నేర్చుకున్నానని అన్నారు. పుణేతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని.. తన ఇద్దరు పిల్లలు ఇక్కడే చదువుకున్నారని చెప్పారు. ఇక్కడ తనకు ఇల్లు కూడా ఉండేదని గుర్తుచేశారు. అయోధ్య రామాలయానికి అవసరమైన కలపను బల్లార్‌పూర్ సమకూర్చడం ఆనందంగా ఉందని తెలిపారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఐదో ఆర్థిక శక్తిగా ఉందని.. దానిని మూడో స్థానానికి తీసుకొచ్చేందుకు మోదీ ప్రభుత్వం కృషిచేస్తోందని చెప్పారు. అభివృద్ధి యాత్రను ఆపడానికి వీల్లేదని.. ప్రతి ఒక్కరూ సరైన అభ్యర్థికి ఓటేయాలని పిలుపిచ్చారు.

సంఘ్ లేని భారత్‌ను ఊహించలేం..

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మద్దతు లేనిదే భారత్ బలంగా ఉండజాలదని పవన్ స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ లేని దేశాన్ని ఊహించుకోలేమన్నారు. ఆ సంస్థ ఉండడం వల్లే విచ్ఛిన్న శక్తులు దేశాన్ని విడగొట్టలేకపోయాయని తెలిపారు. తాను నెల్లూరులో స్కూల్లో చదువుకునేటప్పుడు వరద సహాయ కార్యక్రమాల్లో అది పాలుపంచుకుందని గుర్తుచేసుకున్నారు. 'దేశాన్ని విభజించేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. స్థానిక ప్రజలను, వారి సంస్కృతిని గౌరవిస్తూ దేశాన్ని సమైక్యంగా ఉంచాలి. తద్వారా భారత్‌ను బలోపేతం చేయాలి' అని కోరారు. 2028కల్లా మహారాష్ట్రను ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చేందుకు ఎన్డీయే కట్టుబడి ఉందని పవన్ చెప్పారు.

హామీల అమలుపై తెలంగాణ సీఎం చెప్పేవన్నీ అబద్ధాలే

- పథకాల లబ్ధిదారుల లెక్కలు తీయడంలోనే ఏడాది గడిపేశారు
- ఆరోగ్య బీమా అమలు చేయట్లేదు.. ఉపాధి కల్పనలోనూ విఫలం
- 'మహా' ఎన్నికల ప్రచారంలో మంత్రి సత్యకుమార్ ఆరోపణలు



ముంబై, నవంబరు 17: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేరుస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ నాయకుడు సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన మహా వికాస్ అఘాడీ తరఫున ప్రచారంలో పాల్గొన్నారు. ఆదివారం ముంబైలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సత్యకుమార్ మాట్లాడారు. గత ఏడాది కాలంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పథకాల లబ్ధిదారుల లెక్కలు తీస్తూనే ఉందని ఎద్దేవా చేశారు. సీనియర్ సిటిజన్లకు రూ.4వేలు పింఛను ఇస్తామని రేవంత్ హామీ ఇచ్చారని, కానీ ఏడాది గడిచినా ఇంకా లబ్ధిదారులను గణించే ప్రక్రియ కొనసాగుతునే ఉందని పేర్కొన్నారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం సీనియర్ సిటిజన్ల పెన్షన్‌ను రూ.3వేల నుంచి రూ.4వేలకు, దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3వేల నుంచి రూ.6 వేలకు పెంచిందని గుర్తుచేశారు. గ్యాస్ సిలిండర్‌కు రూ.500 ఇస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, దీనికీ లబ్ధిదారుల గణన పూర్తికాలేదని తెలిపారు. ఏపీలో ప్రజలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చామని, దీపావళికి 1.55 కోట్ల మందికి మొదటి సిలిండర్ అందించామని వివరించారు. ఉపాధి కల్పనలోనూ తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని, ఆరోగ్య బీమాను కూడా అమలు చేయడంలేదని సత్యకుమార్ ఆరోపించారు.

చనిపోయాడనుకున్న వ్యక్తి తిరిగి ప్రత్యక్షం!

- తన సంస్మరణ కార్యక్రమానికి హాజరు!

అహ్మదాబాద్, నవంబరు 17 : గుజరాత్‌లో జరిగిన ఓ ఘటన అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. చనిపోయాడనుకున్న వ్యక్తి తన సంస్మరణ కార్యక్రమం జరుగుతుండగా తిరిగి వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అహ్మదాబాద్‌లోని నరోదా ప్రాంతంలో బ్రిజేశ్ సుతార్(43) అనే వ్యక్తి అక్టోబరు 27 నుంచి కనిపించకుండాపోయాడు. కుటుంబసభ్యులు అతడి కోసం గాలించినా ఫలితం దక్కలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం నవంబరు 10న సబర్మతి బ్రిడ్జి దగ్గర ఓ మృతదేహం కనిపించింది. పోలీసులు బ్రిజేశ్ కుటుంబసభ్యులను పిలిపించి బాగా పాడైన ఆ మృతదేహాన్ని గుర్తుపట్టాల్సిందిగా కోరారు. బ్రిజేశ్‌ని పోలి ఉన్న ఆ మృతదేహాన్ని చూసి తమవాడేనని భావించారు అతడి కుటుంబసభ్యులు. ఆ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి.. శుక్రవారం అతడి సంస్మరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సరిగ్గా ఆ కార్యక్రమం జరుగుతున్నప్పుడే బ్రిజేశ్ తిరిగి వచ్చి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. పోలీసులు బాగా ఉబ్బిపోయిన మృతదేహాన్ని తమకు చూపగా తమవాడే అనుకుని అంత్యక్రియలు చేశామని అతడి తల్లి వాపోయింది. కాగా బ్రిజేశ్ మానసిక సమస్యలతోపాటు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడని సమాచారం. అతడు తిరిగి రావడంతో చనిపోయిన వ్యక్తి ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో అతడి వివరాల కోసం పోలీసులు విచారణ ప్రారంభించారు.

లెక్చరర్ కుర్చీ కింద బాంబు పెట్టిన విద్యార్థులు

భివాని, నవంబరు 17: పాఠాలు చెబుతున్నప్పుడు మందలించిందని మహిళా సైన్స్ లెక్చరర్‌పై ప్రాంక్ పేరుతో ఆమె కూర్చునే కుర్చీ కింద బాంబు పెట్టి పేల్చారు ఓ తరగతి విద్యార్థులు. ఈ ఘటన హరియాణాలోని భివాని జిల్లాలో శనివారం జరిగింది. బపోరా గ్రామంలోని ప్రభుత్వ స్కూల్‌లో పాఠం చెబుతున్న సందర్భంలో 12వ తరగతిలోని 15 మంది విద్యార్థుల్లో 13 మందిని మహిళా సైన్స్ లెక్చరర్ మందలించింది. కోపోద్రిక్తులైన విద్యార్థులు లెక్చరర్‌పై ప్రాంక్ పేరుతో ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నారు. యూట్యూబ్‌లో చూసి ఫైర్ క్రాకర్స్ తరహాలో బాంబు తయారుచేశారు. శనివారం లెక్చరర్ కుర్చీ కింద బాంబు అమర్చారు. ఆమె కుర్చీలో కూర్చున్నప్పుడు రిమోట్ కంట్రోల్ సాయంతో పేల్చారు. పేలుడు ధాటికి కుర్చీకి రంధ్రం పడింది. లెక్చరర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఉన్నతాధికారులు పాఠశాలకు వచ్చి దర్యాప్తు చేశారు. ఈ సంఘటనకు కారణమైన విద్యార్థులను వారం పాటు సస్పెండ్ చేశారు. అయితే పిల్లల తల్లిదండ్రులు క్షమాపణ చెప్పడంతో అధికారులు వెనక్కి తగ్గారు. ఆ మహిళా లెక్చరర్ కూడా విద్యార్థులను మన్నించింది.

పెళ్లికొడుకు కోసం ఆగిన రైలు!

కోల్‌కతా, నవంబరు 17: ఓ పెళ్లి కొడుకు మండపానికి సమయానికి చేరుకునేందుకు రైల్వే శాఖ ఏకంగా ఓ రైలు సర్వీసును ఆలస్యంగా నడిపింది. ఈ అరుదైన సంఘటన పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో జరిగింది. ముంబైకు చెందిన చంద్రశేఖర్ వాఘ్ అనే వ్యక్తి పెళ్లికి గువాహటిలో ఏర్పాట్లు చేశారు. అతడు 34 మందితో ఈనెల 14న ముంబైలో బయలుదేరి 15న హౌరాకు చేరుకుని అక్కడి నుంచి గువాహటికి వెళ్లేందుకు రైలు టికెట్లు బుక్ చేసుకున్నారు. అయితే హౌరా చేరకునేందుకు వారు ఎక్కిన గీతాంజలి ఎక్స్‌ప్రెస్ మూడున్నర గంటలు ఆలస్యమైంది. దాంతో హౌరాలో వారు ఎక్కాల్సిన సరైఘట్ ఎక్స్‌ప్రెస్ అందుకోలేమని గ్రహించిన పెళ్లికొడుకు వెంటనే అత్యవసర సహాయం కావాలంటూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను, రైల్వే శాఖను ట్యాగ్ చేస్తూ ఎక్స్(ట్విటర్)లో పోస్టు పెట్టారు. తమ రిజర్వేషన్ టికెట్ల ఫొటోలను దానికి జత చేశాడు. స్పందించిన రైల్వే శాఖ గీతాంజలి ఎక్స్‌ప్రెస్ వచ్చేవరకు హౌరాలో సరైఘట్ ఎక్స్‌ప్రెస్‌ను వేచి ఉంచింది. దాంతో చంద్రశేఖర్, అతడి బంధువులు కనెక్టింగ్ రైలును అందుకొని పెళ్లికి వెళ్లారు. తన పెళ్లికి సరైన సమయంలో చేరుకునేందుకు సహాయం చేసిన రైల్వే శాఖకు, అధికారులకు చంద్రశేఖర్ ఎక్స్‌లో ధన్యవాదాలు తెలిపారు. అయితే రైల్వే శాఖ చర్యపై కొంత మంది నెటిజన్లు మండిపడ్డారు. "ఒక వ్యక్తి, అతడి కుటుంబం కోసం రైలును ఆలస్యం చేయడం న్యాయమేనా.. ఒక రైలు ఆలస్యమైతే మరో రైలును ఆలస్యంగా నడపడం సమంజమేనా? మీరు గీతాంజలి ఎక్స్‌ప్రెస్‌ను సరైన సమయంలో నడపలేకపోయారు ఇప్పుడీ విషయంలో క్రెడిట్ తీసుకోవాలనుకుంటున్నారు" అని ఓ యూజర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీ వైఫల్యాన్ని దాచుకునేందుకు వి ఎమ్మల్ని మీరు మెచ్చుకోవడం ఆపండి" అని మరొకరు పేర్కొన్నారు.

అధికార లాంఛనాలతో

నారా రామ్మూర్తి అంత్యక్రియలు

- నారావారిపల్లిలో తల్లిదండ్రుల సమాధుల పక్కనే చితి ఏర్పాటు
- చితికి నిప్పంటించిన రోహిత్, గిరీష్
- తమ్ముడి పాడె మోసిన చంద్రబాబు
- స్వయంగా డప్పుకొట్టి నివాళులర్పించిన మందకృష్ణ

తిరుపతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కన్నుమూసిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, సీఎం చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడి పార్థివ దేహానికి ఆదివారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా నారావారిపల్లిలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దంపతులు, నారా, నందమూరి కుటుంబాలకు చెందిన వారు పాల్గొని రామ్మూర్తికి తుది వీడ్కోలు పలికారు. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. శనివారం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో మృతి చెందిన రామ్మూర్తినాయుడి భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం మంత్రి నారా లోకేశ్, రామ్మూర్తి నాయుడు తనయులు నారా రోహిత్, నారా గిరీష్ విమానంలో తిరుపతికి తీసుకువచ్చారు. తర్వాత సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ మరో విమానంలో వచ్చారు. వీరితోపాటు చంద్రబాబు సోదరి హైమావతి తదితరులు రామ్మూర్తి నాయుడి పార్థివ దేహంపై పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.



సీఎం చంద్రబాబును ఓదారుస్తున్న మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



నారా రామ్మూర్తినాయుడు అంత్యక్రియల్లో డప్పు కొడుతున్న మందకృష్ణ మాదిగ



నారావారిపల్లెలో రామ్మూర్తినాయుడు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, నారా లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్, నారా రోహిత్, టీడీపీ నాయకులు

తల్లిదండ్రుల సమాధుల వద్దే

స్వగ్రామం నారావారి పల్లిలోని ఇంటి నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు అంతిమయాత్ర మొదలు కాగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు పాడె మోశారు. చంద్రబాబు తల్లిదండ్రుల సమాధుల సమీపంలోనే అధికార లాంఛనాల నడుమ అంత్యక్రియలు జరిగాయి. గౌరవ సూచకంగా తొమ్మిది మంది ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. 3.50 గంటలకు నారా రోహిత్, నారా గిరీష్ తండ్రి చితికి నిప్పంటించారు. కాగా, అంత్యక్రియలకు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరై రామ్మూర్తినాయుడికి నివాళులు అర్పించారు. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, హీరోలు నాగశౌర్య, రాజేంద్రప్రసాద్, మోహన్‌బాబు, మంచు మనోజ్, నిర్మాత ఎన్వీ ప్రసాద్, మాజీ మంత్రులు అమరనాథ్‌రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కొత్తపల్లి సుబ్బారాయుడు తదితరులు రామ్మూర్తి నాయుడి భౌతికకాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగ స్వయంగా డప్పు కొట్టి నివాళులర్పించారు.

చంద్రబాబు కన్నీటిపర్యంతం

సోదరుడి అంత్యక్రియలకు హాజరైన చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ విషణ్ణ వదనాలతో కనిపించారు. నారావారిపల్లిలో స్వగృహానికి వచ్చింది మొదలు అంత్యక్రియలు ముగిసి తిరిగి ఇంటికి చేరేవరకు వారు మౌనంగానే ఉన్నారు. పార్థివ దేహం వద్ద పినతండ్రి తనయులు రోహిత్, గిరీష్ విలపిస్తుండగా లోకేశ్ వారి పక్కనే కూర్చుని అనునయించారు. తమ్ముడి పార్థివదేహాన్ని అంతిమయాత్రకు కదలించినపుడు, అంత్యక్రియల సందర్భంలోనూ చంద్రబాబు కన్నీటి పర్యంతమయ్యారు.

నేటి సాయంత్రం దాకా స్వగ్రామంలోనే బాబు

తమ్ముడి అంత్యక్రియల కోసం ఆదివారం నారావారిపల్లి వచ్చిన సీఎం చంద్రబాబు సోమవారం సాయంత్రం దాకా ఇక్కడే ఉండనున్నారు. సతీమణి భువనేశ్వరి, తనయుడు లోకేశ్ కూడా ఆయనతో పాటే నారావారిపల్లిలో ఉంటారు.

హసీనాను అప్పగించాలని

భారత్‌ను కోరతాం

- ప్రధాన సలహాదారు యూనస్



ఢాకా, నవంబరు 17: భారత్‌లో తలదాచుకుంటున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను తిరిగి తీసుకు వచ్చేందుకు మధ్యంతర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఆమెను తమకు అప్పగించాలని భారత్‌ను కోరుతామని ప్రభుత్వ ప్రధాన సలహాదారు, నోబెల్ పురస్కార గ్రహీత మహమ్మద్ యూనస్ చెప్పారు. ఆగస్టులో జరిగిన విద్యార్థుల ఉద్యమం సందర్భంగా దేశాన్ని విడిచిన హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటయి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం యూనస్ టీవీలో జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. "పదవీచ్యుత నియంత షేక్ హసీనాను తిప్పి పంపాలని భారత్‌ను కోరుతాం" అని చెప్పారు. ఆమె కాలంలో జరిగిన హత్యలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై దర్యాప్తు జరిపిస్తామని తెలిపారు. ప్రజా ప్రభుత్వానికి అధికారం అప్పగించడం కోసం ఎన్నికలు నిర్వహించడమే తమ ప్రధాన కర్తవ్యమని చెప్పారు. అందుకోసం ఎన్నికల సంస్కరణలు చేపడుతామని తెలిపారు. మైనార్టీలు, ముఖ్యంగా హిందువులపై జరుగుతున్న దాడులను ఎక్కువ చేసి చెబుతున్నారని వ్యాఖ్యానించారు. హసీనాను తొలగించిన తరువాత ఇస్లామిస్ట్ సంప్రదాయవాదుల ప్రభావం అధికమయిందని, అందువల్లనే హిందువులపై దాడులు జరుగుతున్నాయన్న అభిప్రాయాలు వస్తున్నాయి.

డిస్కమ్‌ల ప్రక్షాళన ఎప్పుడో?



అప్పుల ఊబిలో డిస్కమ్‌లు

అకారణంగా పరికరాల కొనుగోళ్లు

అధిక ధరకు విద్యుత్ కొనుగోలు.. అయినా చర్యలేవీ?

నేటికీ కొనసాగుతున్న అక్రమాల 'సీఎండీ'!

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్తు పంపిణీ సంస్థ(డిస్కమ్)లు వైసీపీ ప్రభుత్వ హయాంలో పాల్పడిన అవినీతిపై చర్యలు తీసుకునేదెప్పుడని విద్యుత్తు రంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. 2019 నుంచి 2024 వరకూ యథేచ్ఛగా అధిక ధరలకు విద్యుత్తు పరికరాలు కొనడం.. బహిరంగ మార్కెట్లో ఎక్కువ ధరకు కరెంటు కొనుగోలు చేయడం ద్వారా నష్టాలకు కారణమైన యాజమాన్యంపై చర్యలెందుకు తీసుకోవడం లేదని నిలదీస్తున్నారు. రాష్ట్రంలోని మూడు(దక్షిణ, కేంద్ర, తూర్పు) డిస్కమ్‌ల అప్పులు 2018-19 నాటికి రూ.62,826 కోట్లుగా ఉంటే.. జగన్ ప్రభుత్వం దిగిపోయేనాటికి 2023-24లో 1,12,422 కోట్లుకు చేరాయి. అంటే.. జగన్ సర్కారు ఉన్న ఐదేళ్లలో అప్పులు ఏకంగా రూ.49,596 కోట్లకు ఎగబాకాయి. పెట్టుబడి రుణాలు రూ.2018-19 నాటికి రూ.26,034 కోట్ల నుంచి 2023-24 నాటికి రూ.66,042 కోట్లకు చేరాయి. యాజమాన్య నిర్వహణలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ.. డిస్కమ్‌లను తీవ్ర నష్టాలకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి కూటమి సర్కారు జాప్యమెందుకు చేస్తోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నాడు ఆ అధికారుల ఇష్టారాజ్యం

జగన్ హయాంలో డిస్కమ్‌ల సీఎండీలుగా ఉన్న వారు ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. సంతోష్ రావు, పద్మా జనార్దన్ రెడ్డి, హరనాథరావులు డిస్కమ్‌ల సీఎండీలుగా వ్యవహరించారు. హరనాథరావు, పద్మా జనార్దన్ రెడ్డిల అవినీతిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. జగన్‌కు పద్మా జనార్దన్ రెడ్డి అత్యంత అప్తుడన్న ప్రచారం ఉంది. జగన్ సీఎంగా ఉన్నంతకాలం తాను సీఎండీగా ఉంటానంటూ జనార్దన్ వ్యాఖ్యానించేవారు. అధిక ధరలకు ట్రాన్స్‌ఫార్మర్లు కొనడంతో డిస్కమ్‌లకు భారీగా నష్టాలు వచ్చాయన్న ఆరోపణలున్నాయి. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డికి సన్నిహితుడు విశ్వేశ్వరరెడ్డి ఎండీగా ఉన్న షిర్డీ సాయి సంస్థను ట్రాన్స్‌ఫార్మర్లను కొనుగోలు చేశారు. వీటిని తెలంగాణకంటే అధిక ధరకు కొన్నారన్న ఆరోపణలున్నాయి.

ఇప్పటికీ ఆయనే సీఎండీనా..?

దీర్ఘకాలిక విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలను ప్రతిపక్ష నేతగా జగన్ తప్పుబట్టేవారు. అయితే, తాను అధికారంలోకి వచ్చాక సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) నుంచి 25 ఏళ్ల కాలానికి ఏడు వేల మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడం గమనార్హం. దీనివల్ల ప్రజలపై రూ.62 వేల కోట్ల రూపాయల భారం పడనుందని కూటమి ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో వెల్లడైంది. ఇక, గత ప్రభుత్వ హయంలో చేసుకున్న విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలను డిస్కమ్‌లు రద్దు చేసుకున్నాయి. ప్రైవేటు సోలార్ ఉత్పత్తి కంపెనీలు న్యాస్థానాన్ని ఆశ్రయించడంతో.. తిరిగి ఒప్పందాలు కొనసాగించాల్సి వచ్చింది. అయితే.. ఈ లోగానే ఈ కంపెనీల నుంచి కరెంటు వాడకుండానే రూ.9000 కోట్లను డిస్కమ్‌లు చెల్లించాయి. వైసీపీ హయాంలో సీఎండీలు కొనుగోలు చేసిన విద్యుత్తు, పరికరాలపై దర్యాప్తునకు చంద్రబాబు ప్రభుత్వం ఆదేశిస్తుందని భావించారు. అయితే, ఇప్పటికీ ఎస్పీడీసీఎల్ సీఎండీగా సంతోష్‌రావు కొనసాగడంపై కూటమి శ్రేణులు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. జగన్ జమానాలో నియమించిన సీఎండీల స్థానంలో కొత్తవారిని నియమించి, నాటి అక్రమాల నిగ్గు తేల్చాలని కోరుతున్నారు.

ఆ జిల్లాల్లో శిక్షణ బహిష్కరణ!

- ప్రధానోపాధ్యాయులకు ఫ్యాప్టో పిలుపు

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులకు ఇస్తున్న లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమాలను పలు జిల్లాల్లో బహిష్కరించాలని ఫ్యాప్టో పిలుపునిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 9 కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నారని ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్.చిరంజీవి ఆదివారం ఓ ప్రకటన తెలిపారు. ప్రతి జిల్లాలో శిక్షణ కేంద్రం ఏర్పాటుచేయాలని తాము విజ్ఞప్తి చేయగా, ప్రతి జిల్లాలో శిక్షణ కేంద్రం ఉంటుందని ఎస్పీడీ హామీ ఇచ్చారని, అయినా 9 కేంద్రాల్లోనే శిక్షణ ఇస్తున్నారని పేర్కొన్నారు. శిక్షణ కేంద్రానికి దూరంగా ఉన్న ఉమ్మడి జిల్లాలు కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, ఉభయ గోదావరి జిల్లాల్లో శిక్షణను బహిష్కరిస్తున్నామని తెలిపారు. కాగా, శిక్షణను రద్దుచేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.షరీఫ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలి: ఏపీటీఎఫ్

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు పూర్తయినా ఇప్పటివరకూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి భరోసా కల్పించలేదని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి విమర్శించారు. ఆదివారం విజయవాడలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర సబ్‌కమిటీ సమావేశంలో పలు డిమాండ్లు చేశారు. 12వ వేతన సవరణ గడువు రెండేళ్లు దాటినా ఇంతవరకూ అతీగతీ లేదన్నారు. గత ప్రభుత్వం నియమించిన పీఆర్సీ కమిషన్ చైర్మన్ ప్రభుత్వం మారిన తర్వాత రాజీనామా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్‌ను నియమించి, మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలన్నారు.

పాఠశాలల పనివేళలు గంట పెంపు!

- నెల్లూరు జిల్లాలో పైలెట్‌గా కొత్త టైమ్‌టేబుల్

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలల పనివేళలు పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా కొత్త టైమ్‌టేబుల్‌ను నెల్లూరు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని నిర్ణయించింది. తాజాగా ఆ జిల్లా డీఈవో దీనిపై ఉత్తర్వులు జారీచేశారు. ప్రతి మండలంలో ఒక ఉన్నత పాఠశాల లేదా హైస్కూల్ ప్లస్‌ను ఎంపిక చేసి ఈ నెల 25 నుంచి 30 వరకు కొత్త టైమ్‌టేబుల్ అమలుచేయాలని పేర్కొన్నారు. దానిపై వచ్చే అభిప్రాయాలతో నివేదికలు సమర్పించాలన్నారు. ఆ నివేదికల ఆధారంగా రాష్ట్రవ్యాప్త అమలుపై నిర్ణయం తీసుకుంటారు. ప్రస్తుత పాఠశాలల పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్ర 4 గంటలు కాగా..కొత్త టైమ్‌టేబుల్ ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు పనిచేస్తాయి. ఉదయం, మధ్యాహ్నం ఇచ్చే బ్రేక్‌ల సమయం 5 నిమిషాల చొప్పున, భోజన విరామం 15 నిమిషాలు పెంచారు. ఉదయం మొదటి పీరియడ్ 5 నిమిషాలు పెంచి 50 నిమిషాలు చేశారు. ఆ తర్వాత 3 పీరియడ్లు ప్రస్తుతం 40 నిమిషాల చొప్పున ఉండగా వాటిని 45 నిమిషాలకు పెంచారు. మధ్యాహ్నం మొదటి పీరియడ్‌ను మార్చకుండా అనంతరం 3 పీరియడ్లు 45 నిమిషాలకు పెంచారు. ఈ మార్పుల కారణంగా రోజులో బడి సమయం గంట పెరుగనుంది. అయితే కొత్త పనివేళలపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) అధ్యక్షుడు ఎస్.బాలాజీ, ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రస్తుత పనివేళలనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

38 కాలేజీలకు జీవో ఇవ్వండి: ఫార్మసీ కాలేజీల సంఘం

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నిలిచిపోయిన 38 కాలేజీలకు వెంటనే అనుమతుల జీవో జారీ చేయాలని ఏపీ ప్రైవేటు ఫార్మసీ కాలేజీ యాజమాన్యాల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీవీ నారాయణ, వై.పద్మనాభరెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 90కిపైగా కాలేజీలకు అనుమతులు జారీ కాగా, 38 కాలేజీల అనుమతులు నిలిచిపోయాయన్నారు. అనుమతులు రాకపోవడం వల్ల ఉన్నత విద్యలో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయినా, ఫార్మసీ అడ్మిషన్లు ప్రారంభం కాలేదన్నారు.

విశాఖలో ఉద్యోగం..

ముంబైలో లంచం!

- సీబీఐ ఉచ్చులో విశాఖ రైల్వే ఉన్నతాధికారి
- రూ.25 లక్షలు లంచం తీసుకుంటుండగా అరెస్టు
- లంచం ఇచ్చిన ఇద్దరు కంపెనీ ప్రతినిధులు కూడా అరెస్టు
- కాంట్రాక్టు పనుల జాప్యానికి భారీ జరిమానా
- పెనాల్టీ తగ్గించడానికి డీఆర్ఎం లంచం డిమాండ్
- తొలివిడత సొమ్ము తీసుకుంటూ దొరికిపోయిన వైనం
- ముంబైలోని డీఆర్ఎం నివాసం సహా 11 చోట్ల సోదాలు
- 87లక్షల నగదు, 72లక్షల బంగారు ఆభరణాలు.. పలు ఆస్తి పత్రాలు స్వాధీనం



సౌరభ్ ప్రసాద్, వాల్తేర్ డీఆర్ఎం(ఫైల్)

విశాఖపట్నం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆయనో ఐఆర్ఎస్ అధికారి.. తన పరిధిలో జరుగుతున్న కోట్లాది రూపాయల పనులకు సంబంధించి కాంట్రాక్టు పొందిన కంపెల నుంచి భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేశారు. విశాఖ కేంద్రంగా పనిచేసే ఆయన.. ఎవ్వరికీ అనుమానం రాకుండా లంచం సొమ్ము తీసుకునేందుకు ముంబై నగరాన్ని ఎంచుకున్నారు. సదరు కాంట్రాక్టర్లను శనివారం కలుసుకుని పాతిక లక్షల లంచం సొమ్ము తీసుకుంటూ సీబీఐకి అడ్డంగా దొరికిపోయారు. ఆయనే.. తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలోని వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్. రైల్వేలో డివిజన్ స్థాయి అధికారి ఇంత పెద్ద మొత్తంలో లంచం తీసుకుంటూ ముంబైలో అరెస్టవ్వడం.. చర్చనీయాంశంగా మారింది. సీబీఐ అధికారుల సమాచారం మేరకు.. సౌరభ్ ప్రసాద్ ఇండియన్ రైల్వే సర్వీసు(ఐఆర్ఎస్)కు చెందిన 1991వ బ్యాచ్ అధికారి. ముంబైలోని సెంట్రల్ రైల్వేలో చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తూ గత ఏడాది జూలై 21న వాల్తేరు డీఆర్ఎంగా విశాఖపట్నంలో బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో.. కొన్ని పనులకు చేపట్టడానికి ఈస్ట్‌కోస్ట్ నుంచి ముంబైలోని డీఎస్ మార్కెటింగ్, పుణెకు చెందిన హెచ్ఆర్‌కే సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు కాంట్రాక్టు పొందింది. అయితే కాంట్రాక్టు అమలులో జాప్యానికి ఈస్ట్ కోస్ట్ రైల్వే భారీ పెనాల్టీ ఆయా కంపెనీలకు విధించింది. ఈ జరిమానాను తగ్గించడానికి, అలాగే, రూ.3.17కోట్ల బిల్లులు క్లియర్ చేయడానికి సదరు కాంట్రాక్టు పనులు చేస్తున్న 2 కంపెనీల నుంచి డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ చెరో పాతిక లక్షల లంచం డిమాండ్ చేశారు. ఇందులో తొలుత రూ.25 లక్షలు పుచ్చుకోవడానికి డీఆర్ఎం ముంబై వెళ్లారు. అయితే సదరు కంపెనీ ప్రతినిధులు అంతకుముందే సీబీఐని ఆశ్రయించడంతో అధికారులు ఉచ్చు బిగించారు. శనివారం ముంబైలో సునీల్ రాథోడ్ నుంచి డీఆర్ఎం సౌరభ్ రూ.25 లక్షలు లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా అరెస్టు చేశారు. అలాగే, సునీల్ రాథోడ్, ఆనంద్ భగత్‌లను కూడా అరెస్టు చేశారు. సోదాల అనంతరం ముంబై, విశాఖపట్నం, పుణె, వడోదర తదితర 11 చోట్ల సీబీఐ సోదాలు జరిపింది. ముంబైలోని సౌరభ్ నివాసంలో అల్మారాలకు తాళాలు వేసి ఉండడంతో ఆదివారం కూడా సోదాలు కొనసాగాయి. ఇందులో మొత్తం రూ.87లక్షల నగదు తోపాటు, రూ.72లోల బంగారు ఆభరణాలు, పలు ఆస్తిపత్రాలు, లాకర్ కీలు స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ ప్రతినిధి ఒకరు తెలిపారు.

నాలుగు నెలల క్రితం గుంతకల్ డీఆర్ఎం..

సౌరభ్ ప్రసాద్ సర్వీసు అంతా ఉత్తరాది వైపే సాగింది. తొలిసారి ఆయన తూర్పు కోస్తా రైల్వేకి వచ్చారు. ఇప్పుడు లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కారు. ఈ ఏడాది జూలైలో గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ బినీత్ సింగ్ కూడా సీబీఐకి దొరికిపోయారు.

డీఎస్సీ ఆలస్యం!

(మొదటి పేజీ తరువాయి)

బడుల్లో ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

ఆ లోగా భర్తీ!: ప్రభుత్వం సానుకూల ఉద్దేశంతోనే డీఎస్సీ నోటిఫికేషన్ వాయిదా వేసినా.. అనుకున్న సమయానికి టీచర్ల భర్తీ ప్రక్రియ పూర్తవుతుందా అనేదానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి పాఠశాల విద్యాశాఖ మొత్తం ప్రక్రియ పూర్తిచేసింది. కానీ ఎస్సీ వర్గీకరణ ప్రక్రియకు ఎంత సమయం పడుతుందనేదానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగు నెలలు, ఆరు నెలలు అంటూ రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. వర్గీకరణ ప్రక్రియ పూర్తయితే అందుకు అనుగుణంగా ఆర్‌వోఆర్‌లో మార్పులు చేసుకుని వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తారు. ఒకవేళ వర్గీకరణకు ఆరు నెలల సమయం తీసుకుంటే దాదాపు కొత్త విద్యా సంవత్సరం చేరువ అవుతుంది. అప్పుడు డీఎస్సీ ప్రక్రియ ప్రారంభిస్తే విద్యా సంవత్సరం మధ్యలో కొత్త టీచర్లు వచ్చే పరిస్థితి ఉంటుంది. కానీ, ఈలోగానే ప్రక్రియ పూర్తవుతుందని, ఎలాగైనా విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే భర్తీ పూర్తవుతుందని పాఠశాల విద్యాశాఖ చెబుతోంది.

మరింత పకడ్బందీగా

సాధారణంగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై న్యాయ వివాదాలు వస్తుంటాయి. వాటిని పరిష్కరించడానికి పాఠశాల విద్యాశాఖకు ఎక్కువ సమయం పడుతుంది. ఈలోగా షెడ్యూళ్లు మారిపోతూ ఉంటాయి. ఈ నోటిఫికేషన్‌కు అలాంటి పరిస్థితి ఎదురుకాకూడదనే ఉద్దేశంతో పాఠశాల విద్యాశాఖ అధికారులు న్యాయ వివాదాల అంశాలను సుదీర్ఘంగా సమీక్షించారు. వివాదం తలెత్తకుండా నోటిఫికేషన్‌ను సాఫీగా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పుడు వర్గీకరణ కారణంగా మరికొంత గడువు దొరకడంతో నోటిఫికేషన్‌ను మరింత పకడ్బందీగా, ఎక్కడా చిన్న లోపాలు కూడా లేకుండా చేయాలని చూస్తున్నారు. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా దీనిని సీరియస్‌గా తీసుకున్నారు. సీఎం చంద్రబాబు తొలి సంతకం పెట్టిన హామీ కావడంతో న్యాయ వివాదాలను అధిగమించేలా నోటిఫికేషన్ ఉంటుందని ప్రకటించారు.

'హాయ్' అంటే చాలు ధాన్యం కొంటాం!

- వాట్సప్ నంబరు 73373 59375
- పౌరసరఫరాలశాఖ సేవలు సులభతరం
- రైతుల సమయం వృథా కాకూడదనే: మంత్రి నాదెండ్ల



అమరావతి, తెనాలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సులభతరం చేశామని, రైతుల సమయం వృథా కాకుండా వాట్సప్ ద్వారా సేవలందిస్తున్నామని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం విక్రయించుకునేందుకు రైతులు తమ వాట్సప్ ద్వారా 73373-59375 నంబరుకు హాయ్(Hi) అని మెసేజ్ పెడితే కొనుగోలు ప్రక్రియ చకచకా జరుగుతుందని ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. వాట్సప్ సందేశం పంపగానే కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ద్వారా ప్రత్యేక వాయిస్‌తో సేవల వినియోగంపై మార్గదర్శకం చేస్తుందన్నారు. రైతు మొదట తన ఆధార్ నంబరు నమోదు చేసి, ఆ తర్వాత పేరును ధ్రువీకరించాల్సి ఉంటుంది. అనంతరం ధాన్యం అమ్మదలిచిన కొనుగోలు కేంద్రం పేరును ఎంచుకోవాలి. తర్వాత ధాన్యం అమ్మదలచిన తేదీలకు మూడు ఆప్షన్లు ఉంటాయి. వాటిలో ఒక తేదీని రైతు ఎంచుకోవాలి. అలాగే సమయాన్ని కూడా నిర్ణయించుకోవాలి. ఆపై ఎలాంటి రకం ధాన్యం అమ్మదలిచారనే ఆప్షన్ ఉంటుంది. తర్వాత ఎన్ని బస్తాల ధాన్యం అమ్మదలిచారో నమోదు చేయాలి. దీంతో స్లాట్ బుక్ అయినట్లు ఓ ప్రత్యేక సందేశం ద్వారా షెడ్యూల్ అయిన కూపన్ కోడ్ వస్తుంది. ఆ తేదీ, సమయంలో ఎంచుకున్న కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి రైతు సులభంగా ధాన్యం అమ్ముకోవచ్చు. కొనుగోలు కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి ఉండకుండా, ధాన్యం కొనుగోలుకు ఎవరినీ బతిమలాడకుండా రైతు ఈ ప్రక్రియ ద్వారా సులభంగా ధాన్యం అమ్ముకునేలా ఏర్పాట్లు చేసింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తరహాలో ఈజ్ ఆఫ్ డూయింగ్ ఫార్మర్ సర్వీస్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సరళతరం చేసినట్టు మంత్రి మనోహర్ తెలిపారు.

23న బంగాళాఖాతంలో అల్పపీడనం!

విశాఖపట్నం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 23న అల్పపీడనం ఏర్పడనుంది. తరువాత ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించే క్రమంలో తుఫాన్‌గా మారే అవకాశం ఉంది. ఈ నెల 26 లేదా 27నాటికి శ్రీలంకకు ఉత్తర దిశగా రానుంది. దీని ప్రభావం రాయలసీమ, దక్షిణ కోస్తాలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాలపై పడే అవకాశం ఉందని అంచనావేశారు. కాగా, బంగాళాఖాతం నుంచి వీస్తున్న తూర్పుగాలుల ప్రభావంతో రాయలసీమ, కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాయలసీమలో పలుచోట్ల, దక్షిణ కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, ఉత్తర కోస్తాలో పొడి వాతావరణం నెలకొంటుందని వాతావరణశాఖ తెలిపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.